fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 57 | విజయవాడ, మంగళవారం 27 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఓరియంటల్ బ్యాంకుకు రూ.109 కోట్ల 'టోకరా'

- సింబోలి చక్కెర కర్మాగారంపై కేసు నమోదు
- పంజాబ్ ముఖ్యమంత్రి అల్లునిపై ఎఫ్ఐఆర్
- ఎనిమిది ప్రాంతాలలో సోదాలు

8

అనుమానాస్పదం





మిస్టరీగా శ్రీదేవి మృతి

స్నానాల తొట్టిలో పడి మరణించారు : ఫోరెన్సిక్ నివేదిక

దేశం విడిచివెళ్లొద్దు : బోని కపూర్‌కు దుబాయ్ పోలీసుల ఆదేశం

భౌతిక కాయాన్ని తరలించేందుకు అనుమతి నిరాకరణ

దుబాయ్ : కోట్లాది మంది అభిమానులను విషాదంలో ముంచిన ప్రముఖ సినీ నటి శ్రీదేవి మరణం మిస్టరీగా మారింది. సోమవారం ఉదయం నుండి దుబాయ్‌లో చోటుచేసుకున్న పరిణామాలు ఈ దిశలో ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. కుటుంబ సభ్యులు ప్రకటించినట్టుగా శ్రీదేవి గుండెనొప్పితో మరణించలేదని, స్నానాల తొట్టిలో ప్రమాదవశాత్తు పడి ఊపిరాడక తుది శ్వాస విడిచారని దుబాయ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ తేల్చింది. దీంతో పాటు మరణానికి ముందు శ్రీదేవి మద్యం సేవించిందని, ఆమె మరణంలో ఎటువంటి కుట్రకోణం లేదని ఫోరెన్సిక్ నివేదికలో పేర్కొనడం కొత్త అనుమానాలకు తోవతీసింది. ఈ నివేదిక వెలువడిన కాసేపటికే సమాజ్‌వాదీ పార్టీ మాజీ నేత, శ్రీదేవి కుటుంబానికి సన్నిహితుడు కూడా యైన అమర్‌సింగ్ దీనిని తోసిపుచ్చారు. శ్రీదేవికి అసలు మద్యం అలవాటు లేదని ఆయన స్పష్టం చేశారు, ఫోరెన్సిక్ నివేదిక విడుదలైన తరువాత రంగంలోకి దిగిన పోలీసులు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారు. శ్రీదేవి భర్త బోని కపూర్‌తో పాటు మరికొందరిని సుదీర్ఘంగా విచారిం చారు. విచారణ పూర్తయ్యేంతవరకూ దుబాయ్ విడిచి వెళ్లవద్దని ఆదేశించారు.. ఈ పరిణామాల నేపథ్యంలో శ్రీదేవి మరణం ప్రమాదవశాత్తు జరిగిందా? ఆత్మహత్యా లేక ఎవరైనా పథకం ప్రకారం హత్య చేశారా అన్న విషయాలు తేలాలంటే మరికొంత సమయం ఆగక తప్పని స్థితి నెలకొంది.

ఇవీ ప్రశ్నలు

- గుండెపోటుతో శ్రీదేవి మరణించారని బంధువులు ఎలా చెప్పారు?
- హోటల్ గదిలో ఆమె మితిమీరి మద్యం తాగిందా? ఎవరైనా తాగించారా?
- (ఆమెకు మద్యం అలవాటే లేదని అమర్‌సింగ్ చెబుతున్నారు)
- 'ప్రమాదవశాత్తు' అని 'కుట్ర లేదు' అని ఫోరెన్సిక్ నివేదిక ఎలా నిర్ధారించింది?
- 20వ తేది వివాహం తరువాత శ్రీదేవి అక్కడే ఎందుకున్నారు?
- 21, 22 తేదీల్లో ఆమె గది విడిచి రాలేదని హోటల్ సిబ్బంది చెబుతున్నారు? ఎందుకు రాలేదు?
- ఆ రెండు రోజుల్లో ఏం జరిగింది?
- ఒకే నెంబర్ నుండి పదేపదే ఫోన్లు వచ్చాయని పోలీసులు నిర్ధారించారు. ఆ నెంబర్ ఎవరిది?
- వివాహం తరువాత భారత్‌కు వచ్చిన బోనీ కపూర్, ఆకస్మికంగా దుబాయ్‌కు ఎందుకు వెళ్లారు?

శనివారం రాత్రి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీదేవిని ఆస్పత్రికి తరలించిన తరువాత అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆస్పత్రికి వెళ్లేటప్పటికే శ్రీదేవి మృతి చెందినట్లు వైద్య వర్గాలు నిర్ధారించిన సంగతి తెలిసిందే. అకస్మాత్తుగా తీవ్ర గుండెనొప్పి రావడంతో శ్రీదేవి మరణించారని ఆమె కుటుంబసభ్యులు ప్రకటించారు. అయితే, 36 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన పోస్ట్‌మార్టమ్ ప్రక్రియ గుండెనొప్పి వాదనను తోసిపుచ్చింది. 'ప్రమాదవశాత్తు స్నానాల తొట్టిలో పడి ఊపిరాడక మృతిచెందినట్టు' ఈ నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో ఎటువంటి కుట్ర కోణం కూడా లేదని తెలిపారు. అయితే, ఈ నివేదిక కూడా అనుమానాస్పదంగా మారింది. 'ప్రమాదవశాత్తు' 'కుట్రకోణం లేదు' అన్న పదాలు నివేదికలో ఉండటం పట్ల తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన దుబాయ్ పోలీస్ శాఖ శ్రీదేవి బస చేసిన హోటల్ గదిని సీజ్ చేసింది. ఆ ప్రాంతాన్నంతా నేరస్థలంగా ప్రకటించింది. కేసును పునర్విచారిస్తున్నట్లు ప్రకటించింది.

బోనీ కపూర్ పాస్‌పోర్టు స్వాధీనం

శ్రీదేవి భర్త బోనీ కపూర్‌ను 3.30 గంటల పైగా ప్రశ్నించింది. విచారణ ప్రక్రియ ముగిసేంత వరకు దుబాయ్ విడిచి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేసింది. దుబాయ్ పోలీసులు బోని కపూర్‌పై అనేక ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. దుబాయ్ ప్రాసిక్యూటర్ కూడా గంటన్నర పైగా ఆయన్ను ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రశ్నల వివరాలు తెలియనప్పటికీ బంధువుల పెళ్లికి దుబాయ్‌కు వచ్చినప్పటి నుండి శ్రీదేవి మరణం వరకు చోటుచేసుకున్న వివిధ పరిణామాలపై అడిగినట్లు తెలిసింది. ఈ విచారణ పర్వం మిగతా 9లో



సిఐఐ సదస్సు ముగింపుసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగం

మోడల్ సిటీగా అమరావతి

- సవాళ్లను అవకాశాలుగా మలచుకుని అభివృద్ధి
- సిఐఐ సదస్సు ముగింపుసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

పాలనలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలచుకుని ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత మూడు రోజులుగా విశాఖలోని ఎపిఐఐసి మైదానంలో జరుగుతున్న భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) సదస్సుల ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. అమరావతిని ప్రపంచం లోని ఐదు ఉత్తమ నగరాల్లో ఒకటిగా చేస్తానని చెప్పారు. ప్రజలకు అంద జేసే సేవలకు టెక్నాలజీని అనుసంధానించడమే మిగతా 9లో

రూ.4,39,765 కోట్ల పెట్టుబడులు

- మొత్తం 734 ఎంఒయులు
- ఉద్యోగావకాశాలు 11,02,125
- మూడోరోజు ఎంఒయులు 369
- పెట్టుబడులు రూ.2,20,951 కోట్లు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ వేదికగా ఈ నెల 24 నుంచి 26 వరకూ మూడు రోజుల పాటు జరిగిన సిఐఐ భాగస్వామ్య మిగతా 9లో

లోక్‌పాల్‌ను ఎందుకు నియమించలేదు

ప్రధానికి రాహుల్ ప్రశ్న

బెంగళూరు : అవినీతిపై పోరాడేందుకు లోక్‌పాల్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని మోడీని ప్రశ్నించారు. మోడీ చర్యలన్నీ 'సూపర్‌రిచ్ 'కు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. మూడురోజుల కర్నాటక ప్రచారంలో భాగంగా ఉత్తర కర్నాటకలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ప్రధాని నిశబ్దం పాటిస్తున్నారని, ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లోనూ మోడీ లోకాయుక్తను ఏర్పాటు చేయలేదని అన్నారు. అవినీతిని అంతమొందిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా కేంద్రంలోనూ లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అవినీతికి కాపలాదారుడిగా తనకు తాను వర్ణించుకున్న మోడీ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జెయ్‌షా కంపెనీలో టర్నోవర్ పెరగడంపైనా మాట్లాడలేదని తెలిపారు. కర్నాటకకు వచ్చిన సమయంలో ఆయన మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప, మరో నలుగురు మంత్రులతో కలిసి వేదికను పంచుకున్నారని, వారందరూ జైలుకు వెళ్లి వచ్చిన వారేనని వ్యాఖ్యానించారు. ప్రసంగాలు చేయ డానికి మోడీని ప్రధానిని చేయలేదని, నిరవ్‌మోడీ దోచు కున్న 22 వేల కోట్లు రైతులు, పేదలవేనని తెలిపారు. దేశం లో రెండో అతిపెద్ద బ్యాంకుగా ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల కుంభకోణం మిగతా 9లో

మేఘాలయ, నాగాలాండ్ 'పోలింగ్' నేడే

- సోమవారంతో ముగిసిన ప్రచారం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- మార్చి 3న త్రిపురతో పాటు మూడు రాష్ట్రాల ఫలితాలు

షిల్లాంగ్ : మేఘాలయ, నాగాలాండ్‌లలో శాసనసభలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. బిజెపి, కాంగ్రెస్‌లతో పాటు ఇతర ప్రాంతీయ పార్టీల ప్రచారం సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. రెండు రాష్ట్రాలకు కలిపి మొత్తం 60 స్థానాలుండగా, నాగాలాండ్‌లోని అంగ్మీ -2 నియోజకవర్గంలో నెఫ్యూరియో గెలుపు ఏకగ్రీవం కాగా, మిగిలిన 59అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు మార్చి 3న వెలువడనున్నాయి. కాగా, ఫిబ్రవరి 18న జరిగిన త్రిపుర ఎన్నికల ఫలితాలు కూడా అదేరోజు వెలువడనున్నాయి. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. బిజెపి తరపున ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీతోపాటు, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర హోం మంత్రి రాజనాథ్ సింగ్‌ల తో పాటు ఇతర నాయకులు కూడా పాల్గొన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిగా ఉన్న కె.జె.అల్ఫోన్స్‌ను మేఘాల యలో క్రిస్టియన్ ఓటర్లను ఆకర్షించడానికి బిజెపి ప్రచార కర్తగా నియమించింది. మేఘాలయలో ఇతర పార్టీల భాగ స్వామ్యం తోపదిసంవత్సరాలుగాఅధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ తిరిగి అధికారాన్ని దక్కించుకోవడానికి మిగతా 9లో



కర్నూలు నగరంలోని విద్యుత్‌భవన్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు. సోమవారం నాటికి వీరి సమ్మె ఏడో రోజుకు చేరింది. (వార్త 7వ పేజీలో)



బొండా భూ కబ్జా కేసులో రెవెన్యూ అధికారుల విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు భూ కబ్జా ఆరోపణలపై సోమవారం జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో విచారణ జరిగింది. స్వాతంత్ర్య సమర యోధుని స్థలం కబ్జా, బెదిరింపుల కేసులో కీలకపాత్ర పోషించిన టిడిపి కార్పొరేటర్ గండూరి మహేశ్, బొండా అనుచరుడు మాగంటి బాబు, స్వాతంత్ర్య సమరయోధుని మనవడు సురేష్, శ్రీనివాస్ విచారణకు హాజరయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గండూరి మహేశ్ మాట్లాడుతూ మాగంటి బాబుతో తనకు పార్టీ పరమైన సంబంధాలే తప్ప వ్యక్తిగత సంబంధాలు లేవన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న కోటేశ్వరరావు, అతని మిగతా 9లో

అరకొరగా గిరిజనాభ్యుదయం

50 శాతమైనా నిధులు ఖర్చు కాని వైనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తున్నా వాటి ఫలాలు గిరిజనులకు అందడం లేదు. ఉపప్రణాళిక నిధుల ద్వారా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల చేపట్టడంలో వైఫల్యం చెందుతూనే ఉన్నారు. గిరిజన గూడేలకు తాగు నీరు అందించడం, రోడ్డు మార్గాలు ఏర్పాటు చేయడం, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు, విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడంలో నిర్లక్ష ధోరణినే ప్రదర్శిస్తున్నారు. ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా కొన్ని శాఖల్లో రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదు.

ఈ ఆర్థిక సంవత్సరంలో గిరిజన ఉపప్రణాళిక కింద తొలుత రూ. 3,528.74 కోట్లు కేటాయించారు. తర్వాత రూ. 3,997.05 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సబ్‌ప్లాన్ కింద 45 ప్రభుత్వ శాఖల ద్వారా గిరిజనులకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా అన్ని శాఖలకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించారు. సుమారు మూడు శాఖలకు కేటాయించిన నిధుల్లో ఇంత వరకు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. మెడికల్ ఎడ్యుకేషన్‌కు రూ. 6, శాప్‌కు 5, ఆయుష్కు 1.58 కోట్లు కేటాయించగా, ఈ విభాగాల నుంచి ఒక కార్యక్రమం కూడా గిరిజనులకు చేపట్టకపోవడం గమనార్హం. విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లు, గృహనిర్మాణం వంటి ప్రాముఖ్యమైన సుమారు 14 శాఖలకు కేటాయించిన నిధుల్లో కేవలం 50 శాతం నిధులే ఖర్చు పెట్టారు. వీటిలో పశు సంవర్ధక, ఇంటర్ విద్య, ప్లానింగ్, గ్రామీణ రోడ్లు, సాంస్కృతిక శాఖల్లో అయితే మరీ దారుణం. ఈ శాఖల ద్వారా ఇప్పటి వరకు కేవలం 20 శాతం నిధులే ఖర్చు పెట్టినట్టు లెక్కలు పేర్కొంటున్నాయి. ప్లానింగ్ విభాగానికి మిగతా 9లో



కరెన్సీ రాదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో నెలకొన్న కరెన్సీ కష్టాలు సమసిపోయే పరిస్థితి కనిపించడం లేదు. అదనంగా నోట్లు పంపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్‌పై రిజర్వ్ బ్యాంకు నుంచి సానుకూల సంకేతాలు రావడం లేదు. ఉన్న కరెన్సీతోనే సర్దుకుపోవాలన్న సూచనలు మౌఖికంగా వస్తున్నట్లు కనిపిస్తోంది. దీని వెనుక కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆన్‌లైన్ నిర్ణయాలు ప్రధానంగా కనిపిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. అందుకే కరెన్సీ కష్టాలు మరికొంత కాలం తప్పవన్న భావానికి వారు వస్తున్నారు. ఈ పరిస్థితి పట్టణ ప్రాంతాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయని వారు అంచనా వేస్తున్నారు. 2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు ప్రక్రియను అమలు చేసిన సమయం నుంచి కరెన్సీ కష్టాలు మొదలయ్యాయి. అయితే తరువాత రెండు వేల నోట్లు, ఐదొందల నోట్లు విడుదల చేశాక కొంతవరకు సమస్య తగ్గినట్లు కనిపించినప్పటికీ, మళ్లీ పాత సమస్యలు రెట్టింపుగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా నోట్ల కొరతే జనాన్ని వేధిస్తోంది. డబ్బు తీసుకోవాలనుకున్న వినియోగదారులపై బ్యాంకుల్లో పరిమితి అమలు చేస్తూ కావాల్సిన దానికన్నా తక్కువ మొత్తాన్ని ఇవ్వడం, ఎటిఎంలలో నగదు పెట్టకపోవడం వంటి కారణాల వల్ల నగదు కోసం జనం అల్లాడిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలోనే మరో ఐదు వేల కోట్ల రూపాయల కరెన్సీని రాష్ట్రానికి పంపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నేరుగా కేంద్ర ఆర్థిక మంత్రి, మిగతా 9లో

కరువు నివారణకు పైలెట్ ప్రాజెక్టు

టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువును అధిగమించేందుకు దావోస్ సదస్సులో చర్చించిన విధంగా కొన్ని గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. నీరు-ప్రగతి, వ్యవసాయ అనుబంధ రంగాలపై సోమవారం ఉదయం ఆయన టెలీకాన్ఫరెన్స్‌తో అధికారులతో మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.745 కోట్లు విడుదల చేశామని, గతంలో రూ.300 కోట్లు కూడా ఉన్నాయని, వీటితో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఉపాధి పథకంలో పనిదినాలు కల్పన మరింత మెరుగుపడాలన్నారు. నర్సరీలను అభివృద్ధి చేసి రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. వేసవిలో పశుగ్రాస కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విశాఖలో నిర్వహించిన మూడు భాగస్వామ్య సదస్సుల లక్ష్యమూ రాష్ట్రంలోని 13 జిల్లాల సమగ్రాభివృద్ధి కోసమేనని, ఈ సదస్సులు విజయవంతమయ్యాయని తెలిపారు.

నాటకోత్సవం

గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిస్తున్న నంది నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రదర్శించిన కుంకుళ్లు' నాటికలో ఓ సన్నివేశం



వాస్తవాలకు ప్రతిరూపం

విజయవంతంగా నంది నాటకోత్సవ ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

సమాజంలోని వాస్తవ గాథలే కథాంశాలుగా నంది నాటకోత్సవ ప్రదర్శనలు సాగుతున్నాయి. రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం సాంఘిక నాటికలు ప్రదిర్శించారు. తొలుత కళాసాహితీ రామాయపట్నం వారి 'కుంకుళ్లు' నాటకాన్ని ప్రదర్శించారు. దీనికి రచన, దర్శకత్వాన్ని ఎన్.శ్రీనివాసరావు అందించారు. ఈ నాటికలో రైతుల బాధలు, భూ కామందుల పెత్తనాలను కళాకారులు కళ్లకు కట్టి చూపారు. అనంతరం స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారు హరిబాబు దర్శకత్వంలో 'భూమి దుక్కం' నాటికను ప్రదర్శించారు. మారుతున్న భూమి విలువలు, వేల ఎకరాలను రియలెస్టేట్‌గా మారుతున్న తీరు కథాంశంగా ఈ ప్రదర్శన సాగింది. మూడో ప్రదర్శనగా మల్లెల ఆర్ట్స్ థియేటర్స్ గుంటూరు వారు 'బామ్మగారి మరచెంబు' హాస్య నాటికను మల్లెల శ్రీనివాసరావు రచించగా కరణం ఠాగోర్‌రాజా దర్శకత్వం వహించారు. అనంతరం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి శిష్లా చంద్రశేఖర్ రచన, ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో 'కేవలం మనుషులం' నాటికను ప్రదర్శించి సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో తిరోగమనాన్ని ఎండగట్టింది.



రెండు అల్పపీడన ద్రోణులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో భూమధ్య రేఖా ప్రాంతానికి సమీపంలో ఒక ద్రోణి, కేరళ తీరం నుంచి అరేబియా సముద్రంలో దక్షిణ మహారాష్ట్ర వరకు మరో ద్రోణి కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. వీటి ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నాలుగు రోజుల పాటు కోస్తా, సీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని తెలిపింది. పగలు ఎండలు, రాత్రి పూట చలి ప్రభావం చూపిస్తున్నాయి.

ప్రజ్ఞ

1. ఏ రాష్ట్రం పోలీస్ శాఖలో అత్యధిక సంఖ్యలో మహిళ ఉద్యోగులు ఉన్నారు?
2. సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ఎక్కడ జరిగింది?
3. అణ్వాయుధాలను మోసుకుపోగల బాలిస్టిక్ క్షిపణి ధనుష్ ఎంత దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు ?
4. ఇటీవల చెన్నైలో ఏ సినీ నిర్మాత 105వ వర్ధంతి పురస్కరించుకుని తపాలా బిళ్లను ఆవిష్కరించారు?
5. ఇటీవల పదివేల ఏళ్లనాటి భారీ గడియారాన్ని ఎక్కడ కనుగోన్నారు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మీ పెట్టుబడులకు నేను హామీ

- ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి
- సిఐఐ ముగింపు సభలో గవర్నర్ ఇఎల్ నరసింహన్



సిఐఐ ముగింపు సభలో మాట్లాడుతున్న గవర్నర్ ఇఎల్ నరసింహన్

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

'పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనువైనదేగాక, ఈ రాష్ట్రం భద్రత కలిగినది కూడా. ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారింది. పెట్టుబడుల ప్రవాహం ఎక్కడనుంచి ఎక్కడికైనా వస్తోంది. ఈ సదస్సులో వ్యాపార ఆసక్తుల (బిజినెస్ ఇంటరెస్ట్)తో ఎంఒయులు జరిగాయి. రాష్ట్ర ప్రథమ పౌరునిగా మీ పెట్టుబడులకు నేను పూర్తిగా హామీ. నేను రక్షణ కల్పిస్తాను. ఎపిలో పెట్టుబడులు పెట్టండి. ప్రజా జీవన ప్రమాణాలను మార్చేయండి'. అంటూ రాష్ట్ర గవర్నర్ ఇఎల్ నరసింహన్ ఉద్ఘాటించారు. విశాఖలో గత మూడురోజులుగా జరుగుతోన్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు ముగింపు రోజైన సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలు పూర్తిచేసుకున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ప్రకటించారు. 'వికాస్ కా నారా ... ఆంధ్రప్రదేశ్ హమారా'.. అంటూ హిందీలో పొగిడారు. దేశంలో నరేంద్రమోడీ 2020 సంవత్సరం నాటికి 'న్యూ ఇండియా' అన్నారని, చంద్రబాబు కూడా 2020 నాటికి న్యూ ఆంధ్రప్రదేశ్ నినాదంతో వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుని అభివృద్ధి కావాల్సి ఉందన్నారు. రోడ్డు, రైలు, పోర్టులు, ఎయిర్ పోర్టు కనెక్టివిటీ ఎపిలో బాగుందన్నారు. రాష్ట్రంలో కమ్యూనికేషన్ల వ్యవస్థ బలంగా ఉందని, రక్షణ వ్యవస్థలను ఇంకా అభివృద్ధి పరచుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించే పరిస్థితులుండడంతో రక్షణలతో కూడిన స్నేహపూర్వక వ్యాపారం సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. స్వామి వివేకానంద సూక్తిని గవర్నర్ చెబుతూ 'మేఘాలు ఆవిరై వర్షపు నీటి చుక్కలుగా భూమిపై రాలుతున్నప్పుడు వృథాగా పడనివ్వకుండా 'క్లీన్ హ్యాండ్స్'లోకి తెచ్చుకోగలిగితే తాగేందుకు పనికొస్తుందని, పెట్టుబడులు, వ్యాపారాల విషయంలోనూ ఇది వర్తిస్తుందన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను కాకుండా పర్యావరణాన్ని పెంచే పెట్టుబడులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.రియల్ టైం గవర్నన్స్ కోసం చంద్రబాబు కృషిచేస్తున్నాడని, మీరంతా టెక్నాలజీని అందజేసి ఏటా పెట్టుబడులను పెంచాలని ఇన్వెస్టర్లను గవర్నర్ కోరారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

పార్టీ రాష్ట్ర కమిటీ తీర్మానం

వెంటనే చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కమిటీ మద్దతు తెలుపుతూ తీర్మానించిదని, ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, వేతనాలు నేరుగా చెల్లింపులు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో, రెగ్యులరైజేషన్ తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఫిబ్రవరి 20 నుంచి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కమిటీ డిమాండ్ చేసింది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఈ సమ్మెకు మద్దతు తెలపాలని కోరింది. విద్యుత్ సంస్థల్లో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పీస్ రేట్ పద్ధతుల్లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని పేర్కొంది. ఈ వేతనాలు కూడా మధ్య దళారులకు చెల్లించడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని తెలిపింది. విద్యుత్ ప్రమాదాల బారిన పడి కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కమిటీ విమర్శించింది. వీరంతా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు లేవని వివరించింది. మహిళలకు ప్రసూతి సెలవులు అమలు కావడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గత సంవత్సరకాలంగా కార్మికులు అనేక ఆందోళనలు నిర్వహించారని గుర్తు చేసింది. అయినా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోవడంతో కార్మికులు ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేపట్టారని తెలిపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ తరహాలో వీరిని కూడా విద్యుత్ సంస్థ కార్మికులుగా విలీనం చేయాలని కోరింది. ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది.

పెట్టుబడులన్నీ బూటకం

ప్రజాసంఘాల విమర్శ



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాబూరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖపట్నంలో మూడు రోజులు పాటు నిర్వహించిన సిఐఐ సదస్సులో వచ్చిన ఒప్పందాలన్నీ బూటకమేనని, ఇటువంటి బూటకపు ఒప్పందాలను నమ్మేస్థితిల్లో ప్రజలు లేరని ప్రజాసంఘాలు మండిపడ్డాయి. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గత మూడు రోజులుగా 'పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులు ఎవరికోసం? ఎందుకోసం' అనే అంశంపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సులు సోమవారం ముగిశాయి. చివరి రోజు 'పెట్టుబడుల ప్రవాహం- వృద్ధిరేటు- తలసరి ఆదాయం- ఉపాధికల్పనపై ప్రభావం, ప్రత్యామ్నాయాలు' అనే అంశంతో పాటు 'రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం- పర్యావరణ విధ్వంసం- ప్రత్యామ్నాయాలు అనే అంశంపై కూడా ప్రజా సంఘాలు సుదీర్ఘంగా చర్చించాయి. పిఒడబ్ల్యుఒ నాయకులు లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రొఫెసర్ బాబూరావు మాట్లాడుతూ.. గత రెండు సమ్మెట్‌లో 881 సంస్థలతో రూ.11.11 లక్షల కోట్లకు ఒప్పందాలు జరిగాయనీ, కానీ కేవలం 130 సంస్థలు మాత్రమే తమ కార్యాకలాపాలను తూతూ మంత్రంగా ప్రారంభించాయనీ అన్నారు. ఈ సమ్మెట్ వల్ల కూడా ఉపయోగం ఉండబోదన్నారు. అభివద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేసి మానవ మనుగడే అంతరించిపోయేలా ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. దేశంలోని 100 నగరాల్లో కాలుష్యం వల్ల ప్రజలు ఊపిరి పీల్చుకోగలిగే స్థితి లేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో నీరు కలుషితమైపోయిందన్నారు. ఒకప్పుడు బావులు, బోర్ల ద్వారా నీరు భూగర్భ జలాలను ఉపయోగించుకునే వారిమని, ఇప్పుడు నీరు కొనుక్కోని తాగాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం వస్తున్న పెట్టుబడుల వల్ల కోటి రూపాయల పెట్టుబడికి ఒక ఉద్యోగం కూడా రాదన్నారు. ఇప్పుడొస్తున్న టెక్నాలజీ ఉద్యోగాలను కల్పించదన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ నాది నేను చూసుకోవాలనే భావనను పెంచుతుం దన్నారు. విధ్వంసకర పరిశ్రమల వల్ల ప్రజల నిర్వీర్యమైపోతారన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర జిల్లాల వారికే కాకుండా అభివద్ధి చెందామని చెబుతున్న కష్ణా, గోదావరి జిల్లాల వారు కూడా ప్రమాద బారిలో పడతారన్నారు. ప్రకతిని పరిరక్షించడానికి పర్యావరణ ఉద్యమాలను తీవ్రం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి జెసిల సదస్సు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జాయింట్ కలెక్టర్ల రాష్ట్ర స్థాయి సదస్సు మంగళవారం నుంచి విజయవాడలోని నీటిపారుదలశాఖ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. రెండు రోజులపాటు జరిగే సమావేశాల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన అనేక అంశాలను ఉప ముఖ్య మంత్రి, రెవెన్యూ మంత్రి కెఇ కృష్ణమూర్తి చర్చించనున్నారు. రెవెన్యూ శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, క్షేత్ర స్థాయిలో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు. అధికారులతో చర్చించి, ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనాలని భావిస్తున్నారు. తొలి రోజు సమావేశంలో 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లతోపాటు వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేసిన 39 మంది తహసీల్దార్లు, 39 మంది సర్వేయర్లను కూడా ఆహ్వానించారు. తొలిరోజు భేటీలో సర్వే, అనుబంధ అంశాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం రెవెన్యూ అంశాలపై చర్చ జరుగుతుంది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించడం, చుక్కల భూమి సమస్యల పరిష్కా రంపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపైనా చర్చించనున్నారు. రెండో రోజు రెవెన్యూ శాఖలో బయోమెట్రిక్ హాజరు అఅమలు, ఇ-ఆఫీస్, ఒడిఎఫ్‌తో పాటు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల పైనా చర్చిస్తారు. భూసేవ ప్రాజెక్టులు, వెబ్‌ల్యాండ్ వంటి అంశాలపైనా చర్చ ఉంటుంది.

రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండండి

చంద్రబాబు, జగన్‌కు రఘువీరారెడ్డి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీలపై కేంద్రం చేస్తున్న అన్యాయానికి నిరసనగా మార్చిలో జరిగే రాజ్యసభ ఎన్నికలకు టిడిపి, వైసిపిలు దూరంగా ఉండాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సిఎం చంద్రబాబు, వైసిపి అధ్యక్షులు జగన్మోహనరెడ్డికి సోమవారం లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ప్రజలంతా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ మార్చిలో వస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల హక్కులను నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాజ్యసభ ఎన్నికలో పాల్గొనకుండా టిడిపి, వైసిపిలు దూరంగా ఉంటే కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ప్రజలు, రాజకీయ ఒత్తిడికి తలొగ్గి రాష్ట్రానికి న్యాయం చేయడానికి కొంతమేర ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల టిడిపి, వైసిపిలకు నష్టం కూడా ఏమీ జరగదన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల సమయంలోనూ ప్రత్యేక హోదా, విభజనచట్టంలోని అంశాల అమలు కోసం షరతులు పెట్టాలని కోరుతూ లేఖ రాశానని, అప్పుడే షరతులు పెట్టివుంటే కొంత మేరకైనా న్యాయం జరిగేదని లేఖలో పేర్కొన్నారు.

సిఎం ప్రకటన సాక్షిగా హోదా లేకున్నా పరిశ్రమలొస్తాయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులతో వివిధ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటనతో హోదా లేకున్నా పరిశ్రమలు వస్తాయనేది తేటతెల్లమయ్యిందని బిజెపి రాష్ట్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ వై.రఘునాథబాబు అన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖలో మూడు పర్యాయాలు నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో రూ.30 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయని వీటిలో 59 శాతం పెట్టుబడులు రానున్నాయని సిఎం ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఈ పరిశ్రమల్లో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని చెప్పారన్నారు. హోదా ఉంటేనే పరిశ్రమలు వస్తాయనేది నిజం కాదనేదానికి సిఎం ప్రకటనే నిదర్శనమన్నారు.



వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి దామోదరనాయుడు, తదితరులు

వ్యవసాయ పరిశోధనలతో సత్ఫలితాలు

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

వ్యవసాయంలో సాంకేతికతను జోడించి రైతులకు ఆదాయాన్ని పెంచడంలో వ్యవసాయ ఇంజినీర్లు ఎంతో కీలకమని జాతీయ వ్యవసాయ సృజనాత్మక ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రామారావు అన్నారు. గుంటూరు జిల్లా బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో రెండ్రోజులు నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. సభకు వ్యవసాయ విశ్వవిద్యాలయ విసి దామోదరనాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ యాంత్రీకరణ అవసరమని, పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. శాటిలైట్ వినియోగంతో పంటలపై ఆశించే తెగుళ్లు, చీడపీడల్నీ ముందుగా పసిగట్టి కాపాడుకోవడానికి అవకాశం ఉందని, దేశంలోని రైతులందరికీ ఉపయుక్తంగా ఉండేలా జియో గ్రాఫిక్ రిమోట్ సెన్సింగ్ ఏజన్సీ ద్వారా శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగించి గతేడాది 145 మిలియన్ టన్నుల దిగుబడిని సాధించామని, ఇది స్థూల జాతీయోత్పత్తిలో 9 శాతమని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్‌లాల్, విసి దామోదరనాయుడు మాట్లాడారు. తొలుత కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యంత్ర పరికారాలను, వివిధ పరిశోధనల స్టాళ్లను పరిశీలించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలోని జివిఎంసి కార్యాలయంలో సోమవారం రాత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ వ్యవస్థ పనితీరును జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జివిఎంసి కమిషనర్ ఎం.హరినారాయణన్ సిఎంకు వివరించారు. వాటిపై ఆయన పలు సూచనలు చేశారు. ప్రపంచంలో ఎక్కడ అత్యాధునికమైన టెక్నాలజీ ఉంటే దాన్ని తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

ప్రత్యేకం

అడుగుపడని అమరావతి మెట్రో

- కేంద్ర బడ్జెట్‌లో మొండిచెయ్యే
- బాంకుల్లో మూల్గుతున్న రాష్ట్ర నిధులు 300 కోట్లు
- తాజా బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించాలని డిమాండ్లు
- మీడియం నుంచి లైట్‌కు డిజైన్ల మార్పునకు రుణదాతల సూచన



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త రాజధాని అమరావతిలో మెట్రో రైలు కూత ఎప్పుడు వినిపిస్తుందోననేది సంశయాత్మకంగా మారింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో అమరావతి మెట్రో నిర్మాణానికి కేంద్రం నిధులివ్వకపోయినా, అందుకు రాష్ట్రం భరించే వాటా నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలనే డిమాండ్ ఉంది. అయితే ఇందుకు గతంలోనే విడుదల చేసిన రూ.300 కోట్లు బ్యాంకుల్లోనే మురిగిపోతుండగా, కొత్తగా నిధులు ఎలా ఇవ్వాలనే సంశయాన్ని ఆర్థిక శాఖ వ్యక్తం చేస్తోంది.

ఈ మెట్రోను మీడియం మెట్రో రైల్‌గా కాకుండా లైట్ మెట్రో రైల్ డిజైన్‌గా అమలు చేయాలని మెట్రోకు రుణాన్ని అందించేందుకు ముందుకొచ్చిన జర్మనీ రుణ సంస్థ సూచించడంతో రాష్ట్ర అధికారులు పునరాలోచనలో పడుతున్నారు. విశాఖ మెట్రో పరిస్థితైతే ముందడుగే పడలేదు. రాష్ట్రంలో విశాఖ, విజయవాడల్లో మెట్రో రైళ్ల నిర్మాణానికి విభజన సమయంలోనే కేంద్రం అంగీకరించింది. ముందుగా విజయవాడలో అమరావతిని కలుపుతూ మెట్రో రైల్‌కు డిజైన్లు కూడా సిద్ధం చేశారు. కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత నిధులను భరించాల్సి ఉండడంతో జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు, ఫ్రాన్స్‌కు చెందిన ఎఎఫ్‌డి సంస్థలను ఆశ్రయించారు. ఈ సంస్థలు రాష్ట్ర ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందిస్తూనే విజయవాడలో మెట్రో రైల్‌లో మీడియంగా కాకుండా లైన్ డిజైన్లలో నిర్మించడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని సూచించాయి. దీనివల్ల మెట్రో నిర్మాణ వ్యయం 15 నుంచి 20 శాతం వరకు తగ్గడంతోపాటు, ఈ నిర్మాణం 40 ఏళ్ల ట్రాఫిక్‌కు సరిపడే విధంగా ఉంటుందని, ఆదాయం కూడా బాగుంటుందని ఆ రుణ సంస్థలు పేర్కొన్నాయి. ఈ విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రికి కూడా సూచించడంతో ఆ దిశగా ఆలోచన చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో మరోసారి డిజైన్లను మార్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులో భూసేకరణ కోసం 2016-17లోనే రూ.300 కోట్లను జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కానీ ఇంతవరకు దాంట్లో ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. ఆ నిధులు బ్యాంకుల్లోనే మురిగిపోతున్నాయి. కొత్త డిజైన్ల ఆగస్టు నాటికి సిద్ధం చేస్తామని, వెంటనే భూసేకరణ ప్రారంభిస్తామని మెట్రో అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా ఈ మెట్రో నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సిన కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో చేతులెత్తేసింది. కేంద్రం నిధులు విడుదల చేస్తే దానికి తమ వాటా నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే నిధులు విడుదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే జర్మనీ, ఫ్రాన్స్ నుంచి రుణం తీసుకునేందుకు కూడా రాష్ట్ర ఆర్థిక శాఖ తటపటాయిస్తున్నట్లు తెలుస్తోంది.

సంక్షిప్తం

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సరైన సమయం : లోకేష్

అమరావతి బ్యూరో : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఈశ్వరన్‌తో పాటు పలువురు సింగపూర్ పారిశ్రామికవేత్తలతో సోమవారం భేటీ అయ్యారు. సమస్యలను అధిగమిస్తూ వృద్ధి సాధిస్తున్నామని, అధునాతన టెక్నాలజీలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని పాలసీలను తీసుకొచ్చామని, రాయితీలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. రాష్ట్రం కన్నా చాలా చిన్న దేశమైన సింగపూర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీసుకున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రాజధాని అభివృద్ధికి సింగపూర్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటగిరీని పరిగణలోకి తీసుకోవాల్సిందే : హైకోర్టు

హైదరాబాద్ : వక్ఫ్ బోర్డ్ పాలక మండలి నియామక సమయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కేటగిరీ కింద ఎంత మంది ఉండాలో తర్వాత విచారిస్తామని, అయితే ఆ కేటగిరీని పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఎపి సర్కార్‌ను ఆదేశించింది. ముస్లిం ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముత్తవల్లీ, బార్ కౌన్సిల్ సభ్యుడు.. ఇలా నాలుగు కేటగిరీలుగా ఎన్నికలు జరిపాక పాలకమండలి ఏర్పాటు చేయాలి. కానీ సర్కార్ ముత్తవల్లి ఎమ్మెల్యే కేటగిరిలకు మాత్రమే ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు శాసనసభ్యుడు ముస్తఫా షేక్ హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జిలు వేర్వేరుగా ఇచ్చిన ఉత్తర్వులపై ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ వ్యాజ్యాల్ని సోమవారం బెంచ్ విచారించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

పాటలు

ఏ ఒక్క ఓటూ రెండు స్టేట్లూ కాకినాడ్లో
చెప్పినదే మోడీ మైడియర్ మోడీ
రెండు కళ్లాపోలసితో లేఖరాసి ఇచ్చినావే
బాబూ మైడియర్ బాబూ
రెండు ముక్కల్ చేస్తూ ఉంటే హౌసులో చప్పట్లు కొట్టినరే
ఐదు పదీ పదిహేనేళ్లు ప్రత్యేక హోదాని చెప్పినరే
సీఎమ్మూ పిఎమై హోదాయే
వద్దంటూ ప్యాకేజితో ముంచిరే...
ఇవ్వండోయ్ మోడీగారూ అడగండో బాబూగారు..

విభజన చట్టంలోనా పదమూడో
షెడ్యూల్లోనా దుగ్గరాజుపట్నంలోనా ఓడవేరేన్నారే
కడప జిల్లాలోనా ఉక్కు ఫ్యాక్టరీ అంటూ
వైజాగ్ టూ చెన్నై బిజినెస్ కారిడారన్నారే
అరవై వేలకోట్లు రాజధానికని రెండు వేలకోట్లు విదిలించారే
అమరావతి శంకుస్థాపనకొచ్చీ గుప్పెడు మట్టి చెంబూతో నీళ్లిచ్చావో
"ఇవ్వండోయ్"

పోలవరం ప్రాజెక్టంటూ జాతీయ
హోదా అంటూ 60వేల కోట్లంటూ వెయ్యి కోట్లివలేదే
యూనివర్సిటీలకేమో పదివేల కోట్ల ఖర్చుంటే
ఫోర్టొంటీ వన్ను కోట్లిచ్చి ఫోజులు కొడతారే
మెట్రో రైలు లేదు రైల్వే జోనూలేదు
రెవెన్యూలోటుకూ దిక్కేలేదూ
మాటల్లోన ఏపిబ్రాండింగేమోమంటూ
చేతుల్లోనా ఇంత చీటింగు చేస్తారా
"ఇవ్వండోయ్"

ఏపికి బడ్జెట్టు లేదూ యూపికి
ఏ లోటూ రాదు కన్నడ గుజరాత్‌కేమో కనక వర్షాలే
తప్పుడు లెక్కలు జూపీగొప్పలుబోతున్నారు
మాయల మాటలతో గొంతులు కోశారే
కడుపు మంటతో ఎన్నాళ్లుకుమిలేము
వాగ్దానాలు ప్యాకేజిలొద్దు
మాట మీద నిలిచెదమ్ము లేదా
మీకూ ప్రత్యేక హోదాయే కావాలి మాకూ
"ఇవ్వండోయ్"
రచన: కవి పిఎన్ఎమ్

ఆ ప్రాంతంలో ఒకప్పుడు నిత్యం మూడు పంటలూ పండేవి.. అక్కడ సారవంతమైన భూములన్నీ పచ్చని పొలాలుగా దర్శనమిచ్చేవి.. మరిప్పుడు మాత్రం ఆ భూములన్నీ 'ఆక్వా' చెరువులుగా మారిపోతున్నాయి. చేపల చెరువుల పేరిట అనుమతులు తీసుకున్న కొందరు అక్రమార్కులు వాటిని రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. దీంతో వందలాది ఎకరాల్లో ఆక్వా కాలుష్యం విరజిమ్ముతోంది. దీన్ని భరించలేని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదు. పైగా అక్కడున్న ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నారు. ఇదంతా తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం వాసుల దీనస్థితి..

శకటాపొలాలశై 'ఆక్వా' భూతం

చెరువులను మూసివేయాలన్న ఆదేశాలు బేఖాతరు
ఫిర్యాదు చేసిన ప్రజలపై అక్రమ కేసులు


ఐ.పోలవరంలో గోదారి చెంతనే తవ్వేస్తున్న ఆక్వా చెరువులు


అల్లవరంలో ఆక్వా చెరువుల కోసం యంత్రాలతో కొబ్బరి తోటలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గంగవరం మండలంలో ఐదేళ్లుగా ఆక్వా భూతం పంజా విసిరింది. ఇప్పటికే కె.గంగవరం, పామర్రు, అముజూరు, పేకేరు, యర్రపోతవరం, శివల, దంగేరు తదితర గ్రామాల్లో మూడు పంటలూ పండే భూములు ఆక్వా చెరువులుగా మారిపోయాయి. ఒక్క కె.గంగవరంలోనే వంద ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి చేపల చెరువులుగా అనుమతులు తీసుకుని ఆక్వా చెరువులుగా మార్చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో అనుమతి లేకుండా వందలాది ఎకరాలను రొయ్యల చెరువులుగా మారుస్తున్నారు. దీంతో గ్రామాల్లోని తాగునీరు కలుషితమౌతోంది. కె.గంగవరంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన రక్షిత మంచినీటి బోర్ల నుంచి కలుషితమైన నీరు వస్తుండటంతో ప్రజలు ఆ నీటిని వినియోగించడం లేదు. దీంతో పక్కనే ఉన్న కుందూరు గ్రామంలోని నీటి పైప్‌లైన్‌పై ఆధారపడుతున్నారు. చెరువుల పక్కన ఉన్న పంట భూములు ఉప్పుబారిన పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో రైతుల భూములను కారుచౌకగా లీజుకు తీసుకుని వాటిని కూడా చెరువులుగా మార్చేస్తున్నారు. ఇలా ఆక్వా చెరువులు ఇబ్బడిముబ్బడిగా విస్తరిస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

కె.గంగవరం మండలంలో ఆక్వా చెరువులు విస్తరించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. జన్మభూమి సభల్లోనూ, పంచాయతీ సభల్లోనూ, అనేకసార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం రావడం లేదు.

మత్స్యశాఖ అధికారులకు, కలెక్టర్‌కు, చివరికి టాస్క్‌ఫోర్స్ అధి.కారులకు డిసెంబరు నెలలో ఫిర్యాదు చేశారు. దీంతో ఫిబ్రవరి 5న వల్లూరి వెంకట తిరుపతిరాయుడు, మరో ఐదుగురు ఆక్వా సాగు యజమానులకు టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏడు రోజుల్లో మూసివేయాలని ఆదేశిస్తూ నోటీసులిచ్చారు. ఇవీ అమలుకు నోచుకోలేదు.

ప్రజలపై తప్పుడు కేసులు

ఉన్న చెరువులను మూసివేయకుండానే కొత్త చెరువులు తవ్వుతుండటంపై ప్రజలు ప్రశ్నించారు. దీంతో కక్షగట్టిన పెత్తందారులు ప్రజలపై తప్పుడు కేసులు బనాయించారు. ఆక్వా చెరువుల్లో ఉన్న రూ.10 లక్షల విలువైన సామగ్రిని, నీటి మోటార్లను దొంగిలించినట్లు అక్రమ సాగుదారుడు యాళ్ల శ్రీనివాసరావు ఆరుగురిపై తప్పుడు కేసులు పెట్టించారు. సెక్షన్లు 447, 427, 379, 506 రెడ్‌విత్ 34, ఐపిసి 36 కింద కేసులు పెట్టారు. కాట్రేనికోన మండలం కోటిపల్లి రామకృష్ణ మరో ఐదుగురిపై కేసులు పెట్టారు. ఇదిలా ఉంటే పెత్తందారులు కేసులు పెట్టిన వెంటనే కె.గంగవరం పోలీసులు కేసులు నమోదు చేసి ఫిర్యాదు చేసిన గ్రామస్తులను వేధిస్తున్నారు.

అక్రమ సాగును అడ్డుకుంటాం



కె.గంగవరం మండలంలో అక్రమంగా ఆక్వా సాగు చేస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన మాపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఈ చెరువులతో ప్రజలకు తాగునీరందని పరిస్థితి. ఆక్వా భాగోతాన్ని అధికారులకు స్వయంగా చూపించినా చర్యలు తీసుకోలేదు. కానీ అక్రమ సాగుదారులు తప్పుడు కేసులు పెట్టించి వేధిస్తున్నారు. ఆక్వా చెరువులను ధ్వంసం చేసేవరకూ పోరాడతాం.

– గుబ్బల ఆదినారాయణ, స్థానికుడు, కె.గంగవరం

అక్రమ ఆక్వా చెరువులను తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి –కాకినాడ

అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని కోరుతూ ఎఐకెఎంఎస్, ఇఫ్టూ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధార్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కె.గంగవరంలో100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అక్రమ ఆక్వా చెరువులున్నాయన్నారు. వీటి వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయన్నారు. తాగునీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారన్నారు. చెరువులను తొలగించాలని గ్రామసభ తీర్మానించిందన్నారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపినా నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. మత్స్యశాఖ అధికారులు సైతం నివేదికను కలెక్టర్‌కు అందించారన్నారు. చెరువులను మూసేయాలని ఆదేశాలిచ్చినా పట్టించుకోవట్లేదన్నారు. వెంటనే వీటిని మూసేయాలని, గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల ఆదినారాయణ, జనుపల్లి సత్తిబాబు, గంగాబత్తుల గంగాభవాని, పోలిశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అబద్దాలకు హద్దేలేదు

(పాటలు)

పల్లవి: అబద్దాలకూ హద్దేలేదండీ
స్వీటు మాటలతో పీఠమెక్కినా మోడీ బాబుల జమానలోనా
॥అబద్దాలకు

చరణం: అయ్యోపాపం ఆంధ్రాప్రజలు అదోగతిపాలు అవుతారంటూ
రాష్ట్ర విభజన చేస్తున్నప్పుడు రెబల్ వాయిస్‌తో రెచ్చిపోయారు
అయిదుపదికాదు పదిహేనేళ్ల స్పెషల్ స్టేటస్సు కావాలన్నారు
ఎన్నికలప్పుడు కన్నీళెట్టి ఆస్కార్ లెవల్‌లో యాక్టింగ్ చేసి
ప్రధానమంత్రి ముఖ్యమంత్రులై ప్రత్యేక హోదా ఒదంటున్నారు
॥అబద్దాలకు

చరణం: పి.ఎమ్మూ, సిఎమ్మే కాదు మంత్రివర్యులేం తక్కువ కాదు
బ్యాంకు సొమ్ము ఎగనామం పెట్టిన సహాయ మంత్రి సుజనా చౌదరి
ఎలక్షన్‌లలో నిలబడకుండా సెలక్షన్‌లలో మంత్రై నేడు
కలక్షన్‌లపై ప్యాకేజని ఒకే అంటూ బొక్కుతున్నడు
ప్రత్యేక హోదా అడిగినందుకు ఆంధ్రులను పందులతో పోల్చినడు
॥అబద్దాలకు

చరణం : తెలుగోళ్లంటే తెగ ప్రేమంటూ ఆంధ్రులు అంబాసిడరంటూ
డైలాగులతో డ్రామాలాడే టివి టైగర్ వెంకయనాయుడు
ప్రత్యేక హోదా పచ్చిపులుసని ప్యాకేజంటే వరమాన్నమని
మోసపుమాటల మూటలు విప్పి టెలివిజనులకు విసురుతుంటడు
మోడీగారే దేవుడు మనకు అడగక ముందే అన్ని ఇస్తడని
మూసుకునుండుటే దేశభక్తని ప్రశ్నించారో దేశద్రోహమని
॥అబద్దాలకు

చరణం : బాబు వస్తేనే బాబులన్నరు రుణమాఫీ గ్యారెంటీ అన్నరు
ఉద్యోగాలా ఊసేలేదు ఆస్తుల జప్తులు ఆగనేలేదు
వీరుడు సూరుడు ధీరుడు మోడీ బ్లాక్‌మని భరతం పడతానన్నడు
నోట్లరద్దుతో పాట్లు పెంచాడు రెండొందలమందిని చంపాడు
విడిబడిన పదకొండు రాష్ట్రాలు
ప్రత్యేక హోదా తో ప్రగతిలో ఉన్నయ్
ఆంధ్రులకు మాత్రం వద్దంటున్నారు – ప్యాకేజీనే ముద్దంటున్నరు
ఆంధ్రుల హక్కు ప్రత్యేక హోదా వెంటనే ఇస్తారా లేదా?
ఇవ్వపోతే..... మోడీ చంద్రబాబుల జోడీ చూపిస్తాం
మా ఆంధ్రుల వేడీ
రచన: కవి పిఎన్ఎమ్

నమ్మించి

రచన: కవి పిఎన్ఎమ్

పల్లవి : నమ్మించీ గొంతులు కోశారో.. నీతులతో గోతిలో తోశారు..
మనలా నీతులతో గోతిలో తోశారు..
ప్రత్యేక హోదా మరిచారూ ప్యాకేజి వలలూ విసిరారు
అరచేతుల్లో స్వర్గం చూపీ.. ఆంధ్రులనూ అంధులుగా చేసి..
॥నమ్మించి

చరణం: భాష ఒక్కటే శ్వాస ఒక్కటే తెలుగు తల్లి బిడ్డలం ఒక్కటే
కుట్రల కుంపటి రాజేశారు. నిట్ట నిలువునా చీల్చేశారు
ఒకే ఓటుతో రెండు రాష్ట్రాలు రెండు కళ్ల సిద్ధాంత లేఖలూ
ప్రతి పక్షంలో హోదా అన్నరు.. గద్దెనెక్కి ఇప్పుడొద్దంటున్నరు
॥నమ్మించి

చరణం : రాజువెడలె రవితేజము లలనగ రాజధాని అమరావతి కొచ్చి
నమో నమో నమో నరేంద్రమోడీ ఏం తెస్తాడని ఎదురు చూడగా
మాయల మోడీ బాబుతో జోడీ భూమి పూజలో ఇద్దరు తోడై
చెంబుతో నీళ్లూ చెత్తో మట్టీ... నోట్లో కొట్టి నెత్తిన మొట్టి
॥నమ్మించి

చరణం: బొంకయ్యా వెంకయ్యా నాయుడూ మాటలతోనే కోటలు గట్టి
యాస ప్రాసలూ పంచులతోటి మీడియా ముందు గంతులు వేసి
అన్నమో రామచంద్రని అంటే అద్దంలో బిరియానీ జూపి
హోదా మీకూ వేస్టంటూ... ప్యాకేజీనే బెస్టంటూ
॥నమ్మించి

చరణం: బిక్షగా ఇచ్చే లక్షలు వద్దూ కరుణ జూపి ఏకోట్లివ్వద్దూ
దయతలచీ ధన రాసులు వద్దూ ప్రేమతో ప్యాకేజీలొద్దూ
రాదా రాదా రాదా హోదా ఎన్నాళింకా మాకీ బాధ
ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు.. ఇవ్వనోడికిక ఉత్తర దిక్కు

కృష్ణా నీటితోనే కిడ్నీ వ్యాధులకు పరిష్కారం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు


రోగులను పరామర్శిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి–ఎ.కొండూరు

ఫ్లోరైడ్ నీరు తాగడం వల్లనే గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారినపడ్డారని, కృష్ణా నీటితోనే కిడ్నీ వ్యాధులకు పరిష్కారం లభిస్తుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలోని దీప్లానగర్, చైతన్యనగర్, మత్రియా, మాన్‌సింగ్ తండాలు, చీమలపాడు పెద్ద తండా, రామచంద్రాపురం పంచాయతీలోని లక్ష్మీపురంలో పర్యటించి కిడ్నీ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు కిడ్నీబాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు, ఆసుపత్రిలో వైద్యానికయ్యే ఖర్చు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారని, ఇక్కడ కిడ్నీ వ్యాధులను అరికట్టాలంటే కృష్ణా నీటిని అన్ని గ్రామాలకూ, గిరిజన తండాలకు యుద్ధప్రాతిపదికన సరఫరా చేయాల్సిన అవసరముందన్నారు. డయాలసిస్ చేయించుకునేవారు ఎక్కువగా ఉండటంవల్ల ఎ.కొండూరులోనే డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. కిడ్నీ వ్యాధులు రావడం వల్ల వైద్యం చేయించుకోవడానికి తమకున్న భూములు, పాడిపశువులతో సహా అమ్ముకొని దయనీయ స్థితిలో ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఈవ్యాధులవల్ల అనేకమంది మృతి చెందారని, వారి వివరాలను త్వరలోనే ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంఘం కార్యదర్శి బి.గోపిరాజు, మండల సంఘం కన్వీనర్ డి.రాముడు, స్థానిక సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

పది లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు


లబ్ధిదారురాలికి గృహ నిర్మాణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కాలవ

ప్రజాశక్తి–రాయదుర్గం

రాష్ట్రంలో పది లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు ఇవ్వాలనే లక్ష్యంతో టిడిపి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణ పరిధిలో సామూహిక ఎన్టీఆర్ గృహ నిర్మాణ పనులకు ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఎన్టీఆర్ గృహాలను నిర్మించి పేదలకు ఇస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారని చెప్పారు. 2050 నాటికి ప్రపంచంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దే దిశగా ఆయన ముందుకెళ్తున్నారని చెప్పారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తాం : మంత్రి సునీత

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నిజం చేస్తామని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖా మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల మహా శంకుస్థాపన పక్షోత్సవాల్లో భాగంగా అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పర్వతదేవరపల్లిలో 101 ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సునీత మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం అన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని చెప్పారు.

త్వరలో శ్రీదేవి సంస్మరణ సభ : నన్నపనేని

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

సినీనటి శ్రీదేవి హఠాన్మరణం తెలుగువారి హృదయాలను కలిచివేసిందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. గుంటూరులో శ్రీదేవి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరులో సోమవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ త్వరలో రాజధాని ప్రాంతంలో శ్రీదేవి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలుగు ప్రేక్షకులతో శ్రీదేవికి ఉన్న అనుబంధం మరవలేమని, తనకు వ్యక్తిగతంగా ఆమె బాగా తెలుసునని అన్నారు. శ్రీదేవి మృతికి సినీపరిశ్రమే కాకుండా ప్రజలంతా శోకంతో మునిగిపోయారని అన్నారు. శ్రీదేవి మరణంపై వస్తున్న అనుమానాలపై రాజకుమారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె మరణించి రెండ్రోజులు దాటినా దుబాయ్ నుంచి మృతదేహాన్ని తీసుకురాకపోవడం బాధకరమన్నారు. భారత ప్రభుత్వం దుబాయ్ అధికారులతో సంప్రదించి శ్రీదేవి పార్థివ దేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని కోరారు.

వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పాకులాటలు

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విమర్శ

ప్రజాశక్తి–సీతమ్మధార, విశాఖ

వ్యక్తిగత ప్రయోజనాల కోసమే బిజెపి, టిడిపిలు పాకులాడుతున్నాయని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విమర్శించారు. ఈ మేరకు సోమవారం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీల అమలును విస్మరించి మోడీ, చంద్రబాబులు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. వారిరువురూ వ్యక్తిగత ప్రయోజనాలకే తప్ప ప్రజల మనోభావాలకు విలువన్విడం లేదని ధ్వజమెత్తారు. కేవలం మోడీ, చంద్రబాబు వ్యవహార శైలి వల్లే ఆంధ్రప్రదేశ్ పూర్తిగా నష్టపోయిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల మనోభావాల ప్రసక్తి లేకుండా రాజకీయ పార్టీలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం వల్లే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక నిధులు వంటివి అమలు కాలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి ఎంతో విలువైన భూములను పప్పు, బెల్లాల మాదిరిగా ప్రయివేటు సంస్థలకు చంద్రబాబు కారుచౌకగా కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్తీ పాల వ్యాపారి అరెస్ట్

ప్రజాశక్తి–నరసరావుపేట రూరల్ (గుంటూరు జిల్లా) :

గుంటూరు జిల్లా నరసరావుపేటలో కల్తీ పాల తయారీ గుట్టును రట్టు చేసిన పోలీసులు వ్యాపారిని అరెస్టు చేశారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడుకు చెందిన పాలవ్యాపారి కొంకల ప్రసన్నాంజనేయరెడ్డి మూడేళ్లుగా ఆ పరిసరాల్లో పాలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నాడు. ఏడాది నుండి సంగం డెయిరీకి చెందిన పాలపొడి ప్యాకెట్లు, సన్‌రైజ్ రిఫైన్డ్ ఆయిల్, యూరియాను సేకరించి నకిలీ పాల తయారీకి పాల్పడుతుండేవాడు. ఈ కల్తీ పాలను జెర్సీ డెయిరీ, గృహ వినియోగదార్లకు విక్రయించేవాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రసన్నాంజనేయ ఇంటిపై ఆదివారం దాడులు చేశారు. 38 సంగం డెయిరీ పాలపొడి ప్యాకెట్లు, 15 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు, మరో 15 ఖాళీ ఆయిల్ పాకెట్లను, మిక్సీ, 10 లీటర్ల కల్తీపాలు, స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డిఎస్‌పి కె.నాగేశ్వరరావు సోమవారం వెల్లడించారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీలకు అరికట్టేందుకు సెన్సార్లు

ఒఎన్‌జిసి ఆన్‌షోర్ డైరెక్టర్ మహావర్

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒఎన్‌జిసిలో గ్యాస్, ఆయిల్ పైపులైన్ల లీకేజీలను గుర్తించి, తక్షణం అరికట్టేందుకు సెన్సార్ల విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టామని ఒఎన్‌జిసి ఆన్‌షోర్ డైరెక్టర్ విపి.మహావర్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్‌లో సోమవారం జరిగిన 'ఆయిల్ అండ్ మైన్స్ రెగ్యులేషన్ 2017' వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చమురు, గ్యాస్ వెలికితీత బావుల వద్ద మొబైల్ ఫోన్లు వినియో గించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేజీ బేసిన్ పరిధిలో 800 కిలో మీటర్ల మేర పైపులైను మారుస్తు న్నామన్నారు. ఈ పనులు 80 శాతం పూర్తయ్యాయన్నారు. పైపు లైను లీకులను గుర్తించేందుకు అధునాతన విధానాలు అమలు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా లీకేజీ ఉంటే తక్షణం సెన్సార్ల ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆయిల్ కంపెనీల భద్రతా ప్రమాణాల క్రమబద్ధీకరణ చట్టం 1984ను సవరించి రెగ్యులేషన్ చట్టం–2017ను తీసుకొచ్చారన్నారు. లీకులు జరగకుండా ప్రతి 15ఏళ్లకు ఒక సారి పైపు లైను వ్యవస్థను మార్చే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. ఆయిల్, గ్యాస్ వెళ్లే సాంద్రతను బట్టి పైపులైన్లను ఎప్పటికప్పుడు మారుస్తున్నామన్నారు. నాగాయలంక, బంటుమిల్లి గ్రామాల్లో చమురు బావులు ఉత్పత్తికి సిద్ధమయ్యాయని తెలిపారు. జాతీయ భద్రతా డైరెక్టరేట్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే వీటి నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామని చెప్పారు.

సంక్షిప్తం

ఎయు ఆర్‌సెట్ ఫలితాలు విడుదల

మద్దిలపాలెం, విశాఖ: ఎయు ఆర్‌సెట్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, లా, ఫార్మశీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో పరిశోధనలకు ప్రవేశాలు చేపట్టనున్నారు. అభ్యర్థులు మార్చి 5 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. మార్చి 19న సీట్లు కేటాయింపు ప్రక్రియ ఉంటుంది. 26 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల తనిఖీ, ఫీజు చెల్లింపు చర్యలు చేపడతారు. పిహెచ్ కేటగిరీ అభ్యర్థులకు ఏప్రిల్ 4వ తేదీన కౌన్సిలింగ్, సీట్ల కేటాయింపు జరుపుతారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

ఇద్దరు ఉపాధ్యాయులు అరెస్టు

ఒంగోలు క్రైం: పాఠశాలల్లో అధికారులు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై ఇటీవల అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థినులు చైతన్యవంతమయ్యారు. తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేస్తున్నారు. ఒంగోలు బండ్లమిట్ట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్న హెడ్ మాస్టర్ కొలసాని సాయి శ్రీధర్, రామకృష్ణరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికల ఫిర్యాదు మేరకు ఇద్దరు ఉపాధ్యాయులపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఒంగోలు డిఎస్‌పి బి.శ్రీనివాసరావు తెలిపారు.

తిరుమలలో చిరుత మళ్లీ హల్‌చల్

తిరుమల : తిరుమల వాసులకు, అక్కడికి వచ్చే భక్తులకు చిరుత పులులు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కొంతకాలంగా అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న బాలాజీనగర్, కాటేజీ ప్రాంతాల్లో చిరుతల సంచారం పెరిగింది. తాజాగా ఆదివారం అర్ధరాత్రి చిరుత తిరిగి అదే ప్రాంతానికి చేరుకుంది.

వైద్యుల నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ వర్కర్ మృతి

చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి–చిత్తూరు అర్బన్

ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ వర్కర్ మృతి చెందిన సంఘటన సోమవారం చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆదివారం చెన్నై–బెంగుళూరు మార్గంలోని సంక్రాంతిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ వర్కర్ గజలక్ష్మి, ఆమె భర్త నరసింహులు రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని అపోలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఉన్న చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడి వైద్యులు ఎలాంటి ప్రథమ చికిత్స చేయకుండా వేలూరు సిఎంసికి, తిరుపతి స్విమ్స్‌కు వెళ్లాలంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బంధువులు సిఎంసికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గజలక్ష్మి మృతిచెందింది. ప్రథమ చికిత్సను కూడా అందించకుండా సిఎంసికి తీసుకెళ్లాలంటూ చేతులు దులుపుకున్న వైద్యుల నిర్లక్ష్యానికి ఆస్పత్రి ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా వైద్యులు రెఫర్ చేయడంపై సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని, వైద్యుల నిర్లక్ష్యంపై కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అంగన్‌వాడీలు ఆందోళనను విరమించారు.

సంపాదకీయం

దిగ్భ్రాంతికరం

అతిలోక సుందరిగా, అంతకు మించి మంచి నటిగా అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన సినీ నటి శ్రీదేవి హఠాన్మరణం కేవలం సినీ ప్రేక్షకులకే కాక యావత్ దేశానికి దిగ్భ్రాంతికరం. సమీప బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు దుబాయ్ వెళ్లిన శ్రీదేవి శనివారం పొద్దుపోయాక తాను బస చేసిన హోటల్‌లోని స్నానపుగదిలో విగతజీవి అయ్యారన్న వార్త ఆమెతో కలిసి చిత్ర పరిశ్రమలో పని చేసిన వారినే కాక దక్షిణాది ఉత్తరాది అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరినీ విషాదంలో ముంచింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, హిందీ ఐదు భాషల్లో ఐదు దశాబ్దాలపాటు వెండితెరను ఏలిన శ్రీదేవి చక్కని నటనకు చిరునామా. సినీ వినీలాకాశంలో చెరగని సంతకం. అందం, ఆహార్యం, అభినయం కలబోతగా సినీ విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు పొందడం శ్రీదేవికే సాధ్యమైంది. తమిళనాడులోని శివకాశీలో 1963లో పుట్టిన శ్రీదేవి నాలుగేళ్ల ప్రాయంలోనే అరంగేట్రం చేసి ఇక వెనక్కి చూడకుండా యాభై ఏళ్లపాటు సినీరంగంలో అగ్రపథాన్ని అధిరోహించడం అసాధారణం. మామూలుగా సినీ పరిశ్రమలో పురుషాధిక్యం రాజ్యమేలుతుంది. కథానాయకులకే పెద్దపీట. ఆ ఆనవాయితీ శ్రీదేవి విషయంలో పని చేయలేదు. శ్రీదేవి హీరోయిన్ అయితే చాలు తమ వ్యాపారానికి ఢోకా లేదనే విధంగా నిర్మాతలు, దర్శకులను తన కాల్‌షీట్లు కోసం క్యూ కట్టించారామె. శ్రీదేవి లేని సినిమాను వెలితిగా భావించేవారు ఒక తరం ప్రేక్షకులు. అదీ అమె స్టార్‌డమ్. అందుకే 1980వ దశకం శ్రీదేవికి స్వర్ణయుగం. లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన ఆమె రెమ్యునరేషన్ అగ్ర హీరోలతో సరిసమానంగా ఉండేదంటారు. అందుకే భారతదేశ వెండితెర చరిత్రను ఎవరైనా లిఖించదలిస్తే శ్రీదేవికి కచ్చితంగా ఒక అధ్యాయం కేటాయించాల్సిందే.

శ్రీదేవి కోలీవుడ్‌లో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించి బాలీవుడ్‌లో స్థిరపడినప్పటికీ ఆమె వంశ మూలాల దగ్గర నుంచి సినిమాల వరకు తెలుగు ప్రాంతం, ఇక్కడి ప్రజలతోనే అనుబంధం ఎక్కువ. శ్రీదేవి తాత తిరుపతికి చెందినవారు. తర్వాత వ్యాపారం కోసం తమిళనాడుకు మకాం మార్చారు. ఆమె బాల్యం తిరుపతిలోనే గడిచింది. ఆమె నటించిన 300 సినిమాల్లో తెలుగు చిత్రాలే ఎక్కువ. ఆమెతో అత్యధిక చిత్రాలు నిర్మించిన దర్శకుడు కూడా తెలుగువారే. కాబట్టి శ్రీదేవి అగ్రతారగా వెలుగొందడానికి తెలుగు గడ్డపైనే బలమైన బీజాలు పడ్డాయనడంలో సందేహం లేదు. తెలుగులో అగ్ర నటులు ఎన్టీఆర్, ఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున తదితరుల సరసన శ్రీదేవి నటించారు. హీరోల్లో రెండు తరాల వారితో హీరోయిన్‌గా నటించింది ఆమె ఒక్కరే. అందుకే తెలుగు ప్రజల హృదయాల్లో నాటికీ నేటికీ గూడుకట్టుకున్నారు. ఒక్క తెలుగులోనే కాదు, తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్, హిందీలో అమితాబ్, అనిల్‌కపూర్, రాజేశ్‌ఖన్నా, జితేంద్ర, వంటి యోధానుయోధులతో నటించడం శ్రీదేవికే సాధ్యమైంది. ఆమెను ఎంతగా పాత్రలు వెతుక్కుంటూ వచ్చాయో అవార్డులు, రివార్డులూ అంతే. భారత ప్రభుత్వం ప్రదానం చేసిన పద్మశ్రీ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఉత్తమ నటి, ఫిలింఫేర్ ఇత్యాది ఎన్నో అవార్డులు, సత్కారాలు శ్రీదేవి స్వంతమయ్యాయి. బోనీకపూర్‌తో వివాహం అయ్యాక 1997 నుంచి దశాబ్దంన్నరపాటు నటనకు దూరమైనా అభిమానులు శ్రీదేవిని మర్చిపోలేదనడానికి నిదర్శనం అనంతరం ఆమె నటించిన ఒకటి రెండు సినిమాలు సాధించిన ఘన విజయాలే.

సినిమారంగంలో సత్తా చూపి వివాదాలకు దూరంగా ఉన్న శ్రీదేవి మృతి చెందారన్న వార్త అభిమానులను శోకసంద్రంలో ముంచగా ఆమె మరణంపై గంటకో తీరుగా అనుమానాలు రేకెత్తించడంతో మరింత కలత చెందుతున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటుతో దుబాయ్‌లో తాను బస చేసిన హోటల్‌లోని బాత్‌రూంలో శ్రీదేవి కుప్పకూలగా ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు విడిచారని తొలుత వెల్లడింది. ఆదివారం సాయంత్రానికే ప్రత్యేక విమానంలో మృత దేహాన్ని ముంబయికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. శవ పరీక్ష పూర్తయినప్పటికీ ఫోరెన్సిక్ నివేదిక రానందున మృతదేహం తరలింపు సోమవారం ఉంటుందన్నారు. ఇప్పుడేమో శ్రీదేవి గుండెపోటుతో కాదు ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి చనిపోయారని దుబాయ్ ఫోరెన్సిక్ డిపార్టుమెంట్ పేర్కొందంటూ వార్తలు వస్తున్నాయి. ఆమె మృతిలో కుట్ర, నేర పూరిత కోణం లేదంటూనే పోలీసులు తదుపరి విచారణను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు బదిలీ చేశారు. ఆమె శరీరంలో మద్యం నమూనాలు ఉన్నాయంటున్నారు. మృతదేహం తరలింపులో జాప్యం కారణంగా సర్వత్రా ఆందోళన అధికమైంది. మితిమీరిన స్థాయిలో సౌందర్య సాధనాల వాడకం, శస్త్ర చికిత్సలు, మానసిక ఒత్తిళ్లు 54 ఏళ్లకే శ్రీదేవి మరణానికి కారణమన్న వాదన బయలుదేరింది. పలువురు సెలబ్రిటీల జీవితాలు విషాదాలతో ముగిసిన అనుభవం ఉన్న దరిమిలా నివాళులతో సరిపెట్టకుండా శ్రీదేవి మృతిపై వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వంపై ఉంది. అవసరమనుకుంటే సమగ్ర విచారణ జరిపించాలి. అకాల మరణం చెందిన ఉత్తమ నటి శ్రీదేవికి నివాళులు.

ఇదీ విషయం



బల్లగుద్ది ప్రశ్నించిన
డొల్లతనం బట్టబయలు...
హోదా గోదాను వదిలి
పదవులకై పైరవీలు!

స్వార్థం చూసుకుంటే
ప్రజా పోరు చేయలేరు...
ఆర్భాటపు ప్రకటనలతో
హక్కులు సాధించ లేరు!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

చంద్రబాబుది జ్ఞానోదయమా! మరో మోసమా!!



ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని బిజెపి చెబితే నమ్మేటంత అజ్ఞానా చంద్రబాబు? ఇప్పటికైనా ఈ రెండు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. అంతా నాకు తెలుసు. నాకంటే తెలివిగల వాడు ఈ భూమ్మీద ఎవరూ లేరనేంత ధీమాతో నిత్యం మాట్లాడే చంద్రబాబు అంత అజ్ఞాని అనుకోలేం. ఏవో కారణాలు ఉండాలి. లేదా స్వంత ప్రయోజనాలు ఉండాలి. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని బిజెపి ప్రకటించగానే మేధావులతోను, ప్రణాళికా సభ్యులతోను చర్చించాలి. అప్పటికీ సాధ్యం కాదంటే అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్షం వేయాలి. పరిస్థితిని వివరించి వారి సలహాలు తీసుకోవాలి. అందరి సహకారంతో కేంద్రంతో పోరాడాలి. కాని ఇందుకు భిన్నంగా నాకు ఎవరి అవసరం లేదనే అహంకార ధోరణిని ప్రదర్శించారు

'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని' చంద్రబాబు మరల అడుగుతున్నారు. చంద్రబాబుకు జ్ఞానోదయ మయ్యిందా? లేక మరో మోసానికి నడుం బిగిస్తున్నారా? ఇది ప్రజలందరి మదిలో మెదులుతున్న సందేహం! కేంద్ర బడ్జెట్‌తో ఆశలన్నీ సన్నగిల్లి, ఫిబ్రవరి ఒకటి నుండి రాష్ట్ర ప్రజలంతా ఆందోళన చేస్తున్నారు. ఫిబ్రవరి 8న వామపక్షాలు ప్రకటించిన బంద్ జయప్రదమైంది. అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని కార్యాచరణకు దిగాయి. మీడియా యావత్తూ ప్రత్యేక హోదాలో కేంద్రం చేసిన మోసాన్ని ఎత్తి చూపిస్తోంది. అయినా చంద్రబాబు ఇప్పటివరకూ సర్దుకుపోవాలనే ధోరణిలోనే వ్యవహరించారు. అటువంటి చంద్రబాబులో హఠాత్తుగా ఇంతలా మార్పేమిటని జనం ఆశ్చర్యపోతున్నారు.

సుదీర్ఘ రాజకీయ అనుభవం, 9 ఏళ్ళ ముఖ్యమంత్రిగా పాలనా అనుభవం గల చంద్రబాబైతే విభజనలో నష్టపోయిన రాష్ట్రానికి ఉపయోగం వుంటుందనే రాష్ట్ర ప్రజానీకం టిడిపికి అధికారం అప్పగించిన మాట ఎవరూ కాదనలేరు. చంద్రబాబు గతం తెలిసినా అప్పటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు తీసుకున్న నిర్ణయమది. అధికార పీఠం ఎక్కిన మరుక్షణమే చంద్రబాబు ప్రజలకు చెప్పింది మర్చిపోయారు. ఇచ్చిన హామీలు ఓట్ల కోసమే తప్ప ఆచరణకు కాదని తేల్చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టేశారు. స్వీయ ప్రయోజనాలను ముందుకు తెచ్చారు.



ఎం.కృష్ణమూర్తి

పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా కోసం బిజెపి చేసిన వాదనలను, ఎన్నికల్లో ఐదేళ్ళకు బదులు పదేళ్ళు ప్రత్యేక హోదా ఇస్తామనే వాగ్దానాలను తుంగలో తొక్కింది. అధికారంలో కొచ్చాక ప్రత్యేక హోదా సంజీవని కాదన్న వాదనలకు తెరతీసింది. పైగా 14వ ఆర్థిక సంఘం వద్దన్నదని చెప్పింది. ఉన్న రాష్ట్రాలకూ ఊడబెరికేస్తామని చెప్పింది. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి కాలేదని వాదించింది. ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజి మిన్న అన్నది. ప్రత్యేక హోదా పనికి మాలినదన్నంత వరకు బిజెపి వెళ్లింది.

తిరుపతి ఎన్నికల సభలో వెంకయ్యానాయుడు పదేళ్ళ ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇస్తే, చాలదు 15 ఏళ్ళు కావాలని చంద్రబాబు కోరారు. బిజెపిని కేంద్రంలో, రాష్ట్రంలో టిడిపిని ఎన్నుకుంటే ప్రత్యేక హోదాను అమలు చేసి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇన్ని చెప్పిన చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని బిజెపి చెప్పగానే అవును అదే నిజం ప్రత్యేక హోదా రాదు. ప్రత్యేక ప్యాకేజి మంచిదనే నిర్ణయానికి వచ్చేసారు. ఆ ప్రత్యేక ప్యాకేజి అర్ధరాత్రి అరుణ్ జైట్లీ ప్రకటిస్తే తెల్లారితే మరల కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజి వెనక్కి తీసుకుంటుందేమోనని అప్పటికప్పుడు అర్ధరాత్రి 12 గంటలకు పత్రికా ప్రతినిధుల సమావేశంలో చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీని ఆహ్వానించేశారు. ఆ మహా ప్రసాదం దొరికినందుకు మహదానంద పడిపోయారు.

అరుణ్‌జైట్లీ ప్యాకేజీ ప్రకటించగానే చంద్రబాబు ఆహ్వానించే పద్ధతిని చూసిన వారందరికీ ఇద్దరూ ముందుగా కూడబలొక్కుని 'నేను ప్రకటిస్తాను. వెంటనే నువ్వు ఆహ్వానించు. అర్ధరాత్రే ఇదంతా జరిగిపోవాలి. తెల్లారితే ఎవరైనా ఆటంక పర్చవచ్చు. మనం అటువంటి అవకాశం ఇవ్వకూడద'న్నట్లుంది.

అంత తొందరెందుకు పడ్డారు? ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని బిజెపి చెబితే నమ్మేటంత అజ్ఞానా చంద్రబాబు? ఇప్పటికైనా ఈ రెండు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. అంతా నాకు తెలుసు. నాకంటే తెలివిగల వాడు ఈ భూమ్మీద ఎవరూ లేరనేంత ధీమాతో నిత్యం మాట్లాడే చంద్రబాబు అంత అజ్ఞాని అనుకోలేం. ఏవో కారణాలు ఉండాలి. లేదా స్వంత ప్రయోజనాలు ఉండాలి. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని బిజెపి ప్రకటించగానే మేధావులతోను, ప్రణాళికా సభ్యులతోను చర్చించాలి. అప్పటికీ సాధ్యం కాదంటే అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్షం వేయాలి. పరిస్థితిని వివరించి వారి సలహాలు తీసుకోవాలి. అందరి సహకారంతో కేంద్రంతో పోరాడాలి. కాని ఇందుకు భిన్నంగా నాకు ఎవరి అవసరం లేదనే అహంకార ధోరణిని ప్రదర్శించారు

ఇదంతా చూసిన వారికి చంద్రబాబు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని చేస్తున్న ప్రకటన మోసపూరితమైనదేనని అనుమానం కలుగుతోంది. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా మరో పదేళ్ళు పెంచిన వెంటనే మాకెందుకివ్వరని చంద్రబాబు అడగలేదు. దీన్ని బట్టి ప్రత్యేక హోదా కావాలని చంద్రబాబుకు లేదు. రాష్ట్ర ప్రజలంతా ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని పోరాటానికి దిగడంతో రాజకీయంగా నష్టం వస్తుందనే భయంతో ప్రజలను మరల మోసం చేయడానికే చంద్రబాబు మరలా తెరదీసారని ప్రజలు భావిస్తున్నారు.

అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడ్డ ఆర్థిక లోటును, 2014-15 ఆర్థిక బడ్జెట్‌లోనే పూడ్చాలని విభజన చట్టం చెప్పింది. ఆ లోటు రూ.15,691 కోట్లని 14వ ఆర్థిక సంఘం తేల్చింది. కేంద్ర ప్రభుత్వం 2014-15లో రూ.2,303 కోట్లు, 2015-16లో రూ.500 కోట్లు, 2016-17లో రూ.1,176.50 కోట్లే ఇచ్చింది. మొత్తం రూ.3,979.50 కోట్లే. ఇంకా మీకు రావాల్సింది రూ.139.39 కోట్లేనని కేంద్ర ఆర్థిక మంత్రి 2017 మేలో ముఖ్యమంత్రికి ఉత్తరం ద్వారా తేల్చేశారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో పూడ్చాల్సిన లోటు పూడ్చకపోగా ఇక మీకు ఇవ్వాల్సింది లేదని ఉత్తరం రాశారు. ఇదేమిటని మన చంద్రబాబు గారు ప్రశ్నించ లేదు. అఖిలపక్ష సమావేశం వేసి అన్ని పార్టీల సహకారంతో కేంద్రంపై ఒత్తిడి ఎందుకు చేయలేదు? బిజెపితో ఏదో లాలూచీ వ్యవహారం ఉంది.

విభజన చట్టం పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో పాటు తెలంగాణలో ముంపు భాగాన్ని ఏపికి బదలాయించడానికి, ప్రాజెక్టు నిర్మాణం, భూసేకరణ, పునరావాసం, పునఃపరిష్కారం 2013 చట్ట ప్రకారం చేయాలని చెప్పింది. అందుకు మొత్తం ఖర్చు పెరుగుతున్న ధరల ప్రకారం కేంద్రమే భరిస్తుందని చెప్పింది. అందుకు అనుగుణంగా 2014 ఏప్రిల్ 29న కేంద్ర కేబినెట్ నిర్ణయం కూడా చేసింది. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు ఏర్పడ్డ తరువాత ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. 2017 మార్చి 15న కేంద్ర కేబినెట్ నిర్ణయాల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చు మాత్రమే కేంద్రం భరిస్తుందని స్పష్టం చేసింది. భూసేకరణ, పునరావాసం, పునఃపరిష్కారం బాధ్యతను స్వీకరించలేదు. ప్రాజెక్టుకయ్యే ఖర్చు రూ.23,814 కోట్లు నాబార్డు నుండి ఇవ్వడానికి అంగీకరించింది.

పోలవరం మొత్తం ఖర్చు పెరిగిన ధరల్లో రూ.58 వేల కోట్లు అందులో రూ.33 వేల కోట్లుపైనే భూసేకరణ, పునరావాసం, పునఃపరిష్కారం ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి కేంద్రానికి పంపింది. ఆ డబ్బు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించనపుడు కూడా ఇంతవరకు జరిగిన ఖర్చును మాత్రమే ఇమ్మని అడిగింది తప్ప మొత్తం ఖర్చును ఎందుకు భరించరని రాష్ట్ర ప్రభుత్వం అడగలేదు. ఈ వాస్తవం రాష్ట్ర ప్రజలకు, రాజకీయ పార్టీలకు కూడా తెలియనివ్వలేదు.

రాజధానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, అసెంబ్లీ, సచివాలయం, రాజ్‌భవన్, వివిధ ఆఫీసుల నిర్మాణానికి ఉదారంగా ఆర్థిక సహకారం కేంద్రం చేయాలని విభజన చట్టంలో పొందుపర్చారు. ఎన్నికల్లో మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణమే తన లక్ష్యంగా చంద్రబాబూ ప్రకటించారు. అందుకు పదేళ్ళలో రూ.1,20,000 కోట్లు ఖర్చవుతుందని, అందులో మొదటి ఐదు సంవత్సరాలు రూ.48 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనాలు వేశారు. అంత గొప్ప రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇస్తామన్నది రూ.3,500 కోట్లే. ఇంతవరకు ఇచ్చింది రూ.1,500 కోట్లే. అయినా చంద్రబాబు జరుగుతున్న అన్యాయం కప్పి పెట్టడానికి ప్రయత్నించారే తప్ప ప్రజలకు, రాజకీయ పార్టీలకు నిజం చెప్పలేదు. రాష్ట్రానికి ఇంత నష్టం జరుగుతున్నా ఇలా వ్యవహరించడంలో ఏదో లాలూచీ ఉందని ప్రజలు భావించడం తప్పు కాదు.

చంద్రబాబు రాష్ట్ర ప్రజానీకాన్ని మభ్యపెట్టడానికి రెండు కారణాలు. మొదటిది పోలవరం నిర్మాణం తనే వేగంగా పూర్తి చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నం చేశారు. కేంద్రంతో ఘర్షణ పడితే తన నుండి ప్రాజెక్టును స్వాధీనం చేసుకుంటుందని భయపడ్డారు. రెండవది కేంద్రం ఆర్థిక సహకారం లేకుండానే రైతుల నుండి భూమిని తీసుకుని రియల్‌ఎస్టేట్ పద్ధతిలో రాజధానిని నిర్మించేయగలనని భ్రమల్లో చంద్రబాబు వున్నారు.

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కేంద్రంతో ఘర్షణ పడితే జైలుకు పోవాల్సి ఉంటుందని భయపడ్డారు. సిబిఐని మోడీ, అమిత్‌షాలు ఉసిగొల్పుతామని చంద్రబాబుకు తెలుసు. కేంద్రమే కేసిఆర్‌కు చంద్రబాబుల మధ్య రాజీ ఒప్పందం కుదిర్చింది. ఆ ఒప్పందం ప్రకారం చంద్రబాబు హైదరాబాద్ నుండి తక్షణమే ఖాళీ చేయాలని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోరాదని కేసిఆర్ పెట్టిన షరతులను చంద్రబాబు అంగీకరించి అమరావతికి ఆదరా బాదరా వచ్చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసు కేంద్రం చేతిలో వుంది గనుక ఏదో రకంగా బిజెపితో సర్దుకుపోయారు. మన రాష్ట్రానికి మోడీ, చంద్రబాబులు ద్రోహం చేశారు.

2017-18 బడ్జెట్‌తో బిజెపి, టిడిపి దొంగనాటకం బట్టబయలైంది. రాష్ట్ర ప్రజలు ఒక్క గొంతులో ప్రత్యేక హోదాకై నినదిస్తున్నారు. కార్యాచరణకు ఉవ్వెత్తున కదులుతున్నారు. ఈ నేపథ్యంలో కేసుకు భయపడితే రాజకీయ పతనం ఖాయమని గుర్తెరిగిన చంద్రబాబు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్న ప్రజలతో గొంతు కలుపుతున్నారు. చేసిన పాపాన్ని ఒప్పుకొని చిత్తశుద్ధితో పోరాటంలో నిలుస్తారో? లేదో చూడాల్సిందే. చంద్రబాబుది జ్ఞానోదయమో? మోసగింపో వేచి చూడాల్సిందే.

(రచయిత సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు)

కౌంటర్ పాయింట్

దొంగల చేతికి తాళాలు



'పిఎన్‌బీ ఉదంతాన్ని చూస్తే అంతర్గత నియంత్రణలన్నీ విఫలమైనట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ యాజమాన్యం వల్ల నియంత్రణ వ్యవస్థలు బలహీనంగా తయారయ్యాయి. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల ప్రయివేటీకరణే పరిష్కారమనే ఆలోచన కలుగుతోంది' అని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడు అరవింద సుబ్రమణియన్ అన్నారు. 'దేశంలో 21- 22 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి, వివిధ కారణాల వల్ల స్థిరీకరణ చేపట్టి వీటిని 10- 15 బ్యాంకులకు తగ్గించాల్సి ఉంది' అని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహదారుడు సంజీవ్ సన్యాల్ చెబుతున్నారు. ప్రధాన, ముఖ్య ఆర్థిక సలహాదారులిద్దరూ కార్పొరేట్ల బంటులు కనుక ఈ విధంగా మాట్లాడటంలో ఆశ్చర్యం ఏముంటుంది? ఓ ప్రముఖ పత్రిక 'కేటు' బ్యాంకులకు ప్రయి'వేటు' మందు అంటూ, ఏకంగా ప్రత్యేక కథనం వేసింది. వేల కోట్లు బడా కార్పొరేట్లకు ధారాదత్తం చేసింది కాక నేరం పని వాళ్ళపై నెట్టివేసే దుర్నీతి ఇది. ప్రధాని నేరుగా నేరస్తులతో రాసుకు పూసుకు తిరుగుతూ వారిని దేశం దాటిస్తున్నారు. పైగా నేరం బ్యాంకు అధికార్లపై నెట్టివేస్తున్నారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను బట్టే ప్రభుత్వ బ్యాంకుల విధానాలు ఉంటాయనేది సత్యం. పాలక వర్గాల విధానాలను అనుసరించే బ్యాంకులు చూసీ చూడకుండా బడా వ్యాపార సంస్థలకు రుణాలు ఇస్తున్నాయి. అవి తిరిగిరాకే నష్టాల పాలవుతున్నాయి. ప్రభుత్వ బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లే ఈ పరిస్థితికి కారణమని బ్యాంకింగ్ యూనియన్లు చెపుతున్న మాట అక్షర సత్యం.

గతంలో లాభాల్లో నడిచిన ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా ప్రభుత్వం అనుసరించే బడా పెట్టుబడిదార్ల అనుకూల సంస్కరణల దెబ్బకు కుదేలౌతున్నాయి. ఎస్‌బీఐకి అధికంగా రూ. 1.86 లక్షల కోట్ల మొండి బాకీలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు ఉన్నాయి. అదే సమయంలో ప్రయివేటు రంగ బ్యాంకులకూ అదే పరిస్థితి వుంది. గతేడాది సెప్టెంబరు నాటికి రూ.1.03 లక్షల కోట్ల బకాయిల భారం ఉంది. ప్రయివేటు రంగ బ్యాంకుల్లో ఐసీఐసీఐ బ్యాంకుకు అధికంగా రూ. 44,237 కోట్ల రాని బాకీల భారం ఉంది. తర్వాత స్థానాల్లో యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, జమ్మూకాశ్మీర్ బ్యాంకులు ఉన్నాయి. ఈ లెక్కల బట్టి చూసినా ప్రయివేటీకరణ వల్ల బ్యాంకులు బాగుపడతాయని చెప్పటం అర్థం లేని వాదన.

బ్యాంకుల సంఖ్య తగ్గితే ఎవరికి ఉపయోగం?

ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు మారకుండా బ్యాంకుల సంఖ్య తగ్గటం వల్ల మార్పు వస్తుందని చెప్పటం అర్థం లేని వాదన. స్థిరీకరణ (కన్సాలిడేషన్) చేపట్టి ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను తగ్గించటమే దీనికి పరిష్కారమని పాలక పక్షాల వాదన. కేంద్ర ప్రభుత్వం ఏడాది క్రితం ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకులను ఎస్‌బీఐలో విలీనం చేసింది. పరిస్థితి ఏం మారింది. మరింత పెద్ద మొత్తంలో, మరింత పెద్ద కార్పొరేట్లకు దోచి పెట్టటానికే ఈ విలీనం ఉపయోగపడింది.

ప్రయివేటీకరణ ఎవరికి మేలు?

ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలనే వాదన తెరమీదకు వస్తోంది. అయితే సహారా గ్రూప్ సుబ్రతా రాయ్, సత్యం గ్రూప్ రామలింగరాజు, అగ్రిగోల్డ్ లాంటి అనేక ఉదాహరణలు మన ముందున్నాయి. ఓ వ్యక్తి లేదా కంపెనీ వేల కోట్ల రూపాయల ప్రజల నగదును దోచుకుంటోంది చూస్తున్నాం. అందువల్ల ప్రభుత్వ బ్యాంకులను క్రమంగా ప్రయివేటీకరించటం అంటే 'కొండ నాలిక్కి మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టవుతుంది' తప్ప వేరేమీ ఉండదు. ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల్లో 50 శాతానికి పైగా వాటా ప్రయివేటు యాజమాన్యాల చేతుల్లో ఉంది. అందుకే బ్యాంకుల ప్రయివేటీకరణే మార్గమని చెప్పటం అర్థం లేనిది. ప్రభుత్వరంగంలో వికేంద్రీకరణ ప్రక్రియద్వారా వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటు నందించే విధానాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం.

- కారుసాల శ్రీనివాసరావు

జన వాక్యం

మాటల్లోనేనా?



మహిళల కోసం ఎన్నో చేశామని చెబుతున్న ప్రధాన మంత్రి మోడీ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును మాత్రం ఆమోదించడం లేదు. కనీసం ముసాయిదా బిల్లు ప్రతిని చింపి పారేసిన ఎంపిలను అదుపు చేయలేదు. పార్లమెంట్‌లో సంపూర్ణ మెజారిటీ వున్న బిజెపికి మహిళా సాధికారత పట్ల చిత్తశుద్ధి ఉంటే, వేసవి కాలం సమావేశాల్లో 'మహిళా బిల్లును ప్రవేశపెట్టాలి. చట్టం తీసుకురావాలి. కేంద్రం నోట్ల రద్దు, జియస్‌టి, ఎఫ్‌ఆర్‌డిఐలను ఒంటెద్దు పోకడతో అమలు చేసింది. దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులు అతలాకుతలం చేసే ఈ నిర్ణయాలను తీసుకున్న మోడీ మహిళా సాధికారత పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.

చాకలకొండ శారద,
గుంటూరు.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

వార్త

ఈశాన్య రాజకీయ చిత్రం

జె జగదీష్

ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయలో నేడు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. రెండు రాష్ట్రాల్లోను క్రైస్తవులు అధికంగా వున్నారు. నాగాలాండ్‌లో 88 శాతం వుంటే, మేఘాలయలో 75 శాతం మంది వున్నారు. అధికారంలోకి ఎవరొస్తారనే అంశంపై వీరిదే నిర్ణయాత్మక పాత్ర. దీంతో అన్ని పార్టీలు వారిని ఆకర్షించే ప్రకటనలు చేయడంలో నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల్లో గెలిస్తే, క్రైస్తవులకు జెరూసలెం యాత్రకు ఉచిత సౌకర్యం కల్పిస్తామని ఈ రాయితీ కేవలం ఈ రెండు రాష్ట్రాలకే పరిమితమని బిజెపి ప్రకటించింది. ఇటీవల హజ్ యాత్రకు ముస్లింలకు ఇచ్చే రాయితీ ఉపసంహరించుకున్న మోడీ సర్కార్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతోంది. నాగాలాండ్, మేఘాలయల స్థితిగతులను పరిశీలిస్తే శాంతి భద్రతల సమస్య ఎక్కువగా వుంటుంది. నాగాలాండ్‌లో నిత్యం ఏదో ఒక చోట ఘర్షణలు తలెత్తుతుంటాయి. దశాబ్దాల తరబడి పరిష్కారం కాని నాగా సమస్య రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మారుస్తోంది. మేఘాలయాలోనూ ఇటువంటి పరిస్థితులే కనబడుతున్నాయి. ఇటీవల ఎన్సీపి ఎమ్మెల్యే అభ్యర్థిని ఉగ్రవాదులు హత్య చేశారు. రెండు రాష్ట్రాల్లో త్రిముఖ పోటీ జరుగుతోంది. నాగాలో అధికార పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్), కాంగ్రెస్, నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రసివ్ పార్టీ(ఎన్డీపిపి)-బిజెపి కూటమిల మధ్య గట్టి పోటీ నెలకొంది. మేఘాలయలో అధికార కాంగ్రెస్, ఎన్‌పిపి, బిజెపిలు పోరుకు నిలిచాయి. నాగాలో ఎన్పీఎఫ్‌లో బిజెపి భాగస్వామిగా ఉండేది. ఈ పార్టీతోనే ఎన్నికలకు వెళ్లాలని ముందు భావించింది. అయితే అందుకు ఎన్పీఎఫ్ అంగీకరించ లేదు. కొంతకాలంగా ఎన్పీఎఫ్‌లో అంతర్గత సమస్యలు నెలకొన్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత కూడా ఉంది. పైగా బిజెపితో కలిసి వెళితే క్రైస్తవ ఓటు బ్యాంకు దూరమవుతుందన్న భయం వుంది. ఈ కారణంగానే బిజెపిని పక్కన పెట్టింది. వాస్తవానికి రెండు రాష్ట్రాల్లోను కాంగ్రెస్, బిజెపిలకు సమర్థులైన నాయకులు లేరు. ఆయా పార్టీలు కేంద్ర నాయకులపైనే ఆధార పడుతున్నాయి.

ఎన్నికలు బహిష్కరించి..మళ్లీ వెనక్కి

నాగా శాంతి ఒప్పందం తేలేంత వరకూ ఎన్నికలను వాయిదా వేయాలని వివిధ పార్టీలు, వర్గాలు డిమాండ్ చేశాయి. నాగా శాంతి ఒప్పందం బయటపెట్టాలని, గ్రేటర్ నాగాలాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ దాదాపు అన్ని పార్టీలూ ఎన్నికలను బహిష్కరించాయి. అందుకు అనుగుణంగా జనవరి 30న 11 పార్టీలతో కూడిన అఖిల పక్షం ప్రకటించింది. బిజెపి, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు కూడా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు సంతకం చేశారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకే మొగ్గుచూపింది. గడువు ముగింపు వరకూ ఎవరూ నామినేషన్లు వేయలేదు. ఈ పరిస్థితుల్లో అసలు



ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న సందేహం తలెత్తింది. అయితే చివరి రోజున రాష్ట్రంలో ఉన్న 60 నియోజక వర్గాలకు అన్ని పార్టీల తరపున 253 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

ఇక ఎన్పీఎఫ్‌తో పొత్తు కుదరని బిజెపి ఎన్డీపిపితో కలిసి పోటీ చేసేందుకు సిద్ధపడింది. కొత్తపార్టీ అయినా బిజెపి కంటే ఇదే బలమైన పార్టీ. నాగా సమస్యకు గతంలో అనేక ఒప్పందాలు కుదిరాయి. అయితే నాగా వర్గాలు, ప్రభుత్వాల మధ్య చిత్తశుద్ధిలేని కారణంగా ఏ ఒప్పందం అమలు కాలేదు. ప్రస్తుత నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాల వలే చర్చలు జరిపింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చర్చల పేరిట, ఒప్పందాల పేరుతో మోసగించాయని, ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం కూడా అదేబాటలో నడుస్తుందని నాగా వర్గాలు ఆరోపిస్తున్నాయి.

నాగాలాండ్ రాష్ట్రం ఏర్పడి 54 ఏళ్లవుతోంది. ఆ రాష్ట్ర శాసనసభకు ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరిగాయి. కానీ ఒక్క మహిళ కూడా నాగాలాండ్ అసెంబ్లీలో అడుగు పెట్టలేదు. గత ఎన్నికల్లో ఇద్దరు మహిళలు పోటీ చేశారు. కానీ పరాజయం పాలయ్యారు. ఈ సారి జరగనున్న ఎన్నికల్లో ఐదుగురు మహిళలు బరిలో నిలిచారు. 60 అసెంబ్లీ స్థానాలకు గాను 195 మంది అభ్యర్థులు పోటీలో వుంటే, వీరిలో కేవలం ఐదుగురే మహిళా అభ్యర్థులు వున్నారు. మేఘాలయలో మొత్తం 370 మంది అభ్యర్థులు పోటీ చేస్తుంటే, 32 మంది మాత్రమే మహిళా అభ్యర్థులు వున్నారు.

మేఘాలయ


మేఘాలయలో క్రైస్తవుల తరువాత అత్యల్పంగా హిందువులు 11.52 శాతం, ముస్లింలు 4.39 శాతం, గిరిజనులు 8.70 శాతం ఉన్నారు. ఈ ప్రాంతంలో సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తారు. వారి సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు సొంత పార్టీ వారైనా సరే ఎదిరించడానికి సైతం వెనుకాడరు. ఇటీవల బిజెపి అలాంటి ఆగ్రహ జ్వాలలే చవి చూసింది. గోవధ నిషేధంపై బిజెపికి సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఇక్కడ బిజెపితో పొత్తు పెట్టుకునేందుకు ఎవ్వరూ సిద్ధపడలేదు. నాలుగేళ్లుగా బిజెపి సర్కార్ తీసుకున్న విధానాలు క్రైస్తవులనూ, గిరిజన జాతులనూ తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. దీంతో ఎన్డీఏలో భాగస్వామి పార్టీగా ఉన్న నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి) కూడా పొత్తు పెట్టుకోలేదు. ఇప్పటికే ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి(ఎన్ఈడిఎ)ని బిజెపి ఏర్పాటు చేసింది. ఇక స్వతంత్రుల మద్దతుతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్, ఎన్‌పిపిల మధ్యే ప్రధాన పోటీ ఉండవచ్చు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి తెగల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి అనువైన రంగాన్ని సిద్ధం చేసింది. 2016లో అస్సాం ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడంతో మేఘాలయలో కూడా చాలా మంది బిజెపికి వలస బాట పట్టారు. అయితే ఆవు మాంసానికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్ తీసుకురావడంతో ఆదివాసీలైన ఖాసీలు, గారోలు, జయింటీయాలు ఆ పార్టీకి ఎదురు తిరిగారు. మేఘాలయ రాష్ట్రం మనుగడ 85 శాతం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడి ఉంది కనుక రాష్ట్ర ప్రజలు తమని గెలిపిస్తారని బిజెపి నాయకులు భావిస్తున్నారు. గోమాంసం గురించి ప్రశ్నిస్తే అది ముగిసిపోయిన అధ్యాయమని చెబుతున్నారు. పాలక కాంగ్రెస్ పట్ల పెరుగుతున్న వ్యతిరేకతతో పలువురు శాసన సభ్యులు, మేఘాలయ జిల్లా అటానమస్ కౌన్సిల్ సభ్యులు గతంలో బిజెపిలోకి వలస వెళ్లారు. తరువాత వారు ఎన్‌పిపిలోకి వలస పోయారు. జాతీయ స్థాయిలో బిజెపితో అంటకాగుతున్న ఎన్‌పిపి రాష్ట్రంలో మాత్రం విడిగా పోటీ చేస్తోంది.

కాంగ్రెస్, బిజెపిలకు రాజీనామాల షాక్

అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, కాంగ్రెస్‌లకు సంకటంగా మారాయి. దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ కాషాయ జెండా ఎగరవేయాలని లక్ష్యంతో వీలైతే మిత్రపక్షాలుగా ప్రాంతీయ పార్టీలను తమ వైపునకు తిప్పుకోవడం లేకపోతే అణచివేయడం అనే ఏకైక అజెండాతో వెళుతోన్న మోడీ అండ్ టీంకు మేఘాలయలో షాక్ తగిలింది. రాష్ట్రంలో బిజెపిలో రాజీనామా పరంపరలు కొనసాగుతున్నాయి. దీంతో ఇప్పుడు మేఘాలయ బిజెపిలో అసంతృప్తి జ్వాలలు ఒక్కసారిగా ఎగసిపడుతున్నాయి. గోవధ నిషేధానికి వ్యతిరేకంగా మేఘాలయ కీలక బిజెపి నేత బచూమారక్ రాజీనామా చేశారు. బిజెపి మైనార్టీల వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. తమ సంస్కృతిని బిజెపి అవమానపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు దాదాపు 2,500 మంది బిజెపి నేతలు, కార్యకర్తలు ఆపార్టీకి రాజీనామా చేశారు. ఇక టికెట్ల కేటాయింపుపై అసంతృప్తితో వున్న 115 మంది నేతలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

(న్యూ ఢిల్లీ ప్రజాశక్తి ప్రతినిధి)

జిహ్వా చేపల్యం



ఎప్పుడైనా.. నోరు చప్పబడినప్పుడు... కాస్త ఘాటుగా.. మరికాస్త స్పైసీగా ... జిహ్వకు రుచి తగిలితే ప్రాణం లేచొచ్చినట్టు ఉంటుంది కదా! అందుకే ఈవారం ఫిష్‌తో.. నోరూరే కొన్ని వెరైటీ వంటకాల గురించి తెలుసుకుందాం! వెరైటీకి వెరైటీ.. రుచికి రుచిగల పసందైన ఈ.. చేపల వంటకాల్ని ఓ పట్టుపడదాం పదండి!

అరిటాకు ఫిష్



కావల్సిన పదార్థాలు : చేపలు- రెండు, నిమ్మరసం-కొద్దిగా, కొబ్బరి తురుము- రెండు టీస్పూన్లు, తరిగిన పచ్చిమిర్చి- నాలుగు, కొత్తిమీర-కొద్దిగా, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, జీలకర్ర- ఒకటీస్పూను, చిన్న అరిటాకులు- రెండు.

తయారుచేసే విధానం : చేపలను కొంచెం పెద్దముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిపై నిమ్మరసం, ఉప్పు చల్లి పావుగంటసేపు నాననివ్వాలి. కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, కొత్తిమీర, వెల్లుల్లి, జీలకర్ర కలిపి పేస్టు చేసుకోవాలి. ఒక్కో చేప ముక్కను ఒక్కో అరిటాకులో పెట్టి మసాలా పేస్టును ముక్కలకు రెండుపక్కలా పట్టించాలి. అరిటాకులను మడిచి ఊడిపోకుండా దారంతో కట్టాలి. వాటిని ఆవిరిలో ఏడు నిమిషాలపాటు ఉడికిస్తే నోరూరించే అరిటాకు ఫిష్ రెడీ అయిపోతుంది. ఈ వంటకం కేరళ ప్రాంతంలో చాలా పాపులర్.

అమృత్‌సరి



కావల్సిన పదార్థాలు : చేప - 300 గ్రాములు, అల్లం వెల్లులి పేస్ట్ - ఒక టీస్పూన్, వాము - పావు టీస్పూన్, ఉప్పు - రుచికి సరిపడా, కారం - ముప్పావు టీస్పూన్, కసూరి మెంతి - అర టీస్పూన్, తందూరీ మసాలా - ముప్పావు టీస్పూన్, బిర్యానీ మసాలా - పావు టీస్పూన్ (అవసరమనుకుంటే), ఆమ్‌చూర్ - చిటికెడు, నిమ్మరసం - ఒక టీస్పూన్, శెనగపిండి - ఒకటిన్నర టేబుల్ స్పూన్, పసుపు - కొద్దిగా, నూనె - రెండు టేబుల్ స్పూన్లు (ఆవనూనె అయితే రుచి బాగా వస్తుంది)

తయారుచేసే విధానం : శెనగపిండిని నూనె లేకుండా పచ్చి వాసన పోయేవరకు వేగించాలి. పిండి రంగు మారకుండా జాగ్రత్తపడాలి. చేప ముక్కల్ని శుభ్రంగా కడిగి నచ్చిన సైజ్‌లో కోయాలి. ఈ ముక్కలకి వాము, శెనగపిండి, నూనె తప్పించి మిగతా అన్ని పదార్థాలను పట్టించాలి. వెడల్పాటి పాన్‌లో నూనె వేడిచేయాలి. అందులో వాము వేసి అది చిటపటమనే వరకు ఉంచాలి. ఇందులో నానబెట్టిన చేపముక్కలు వేసి ఓ మాదిరి మంట మీద నాలుగు నిమిషాలు ఉంచాలి. తరువాత రెండో వైపు తిప్పి మరో ఐదు నిమిషాలు వేగించాలి. ముక్కల మీద ఒకవైపు మాత్రం శెనగపిండి చల్లాలి. వేగించేటప్పుడు పిండి మాడిపోకుండా జాగ్రత్తపడాలి. ముక్కల్ని రెండోవైపు తిప్పి మళ్లీ వేగించాలి. ఒకవైపు చల్లిన శెనగపిండి రెండు వైపులకు సరిపోతుంది. అవసరమనుకుంటే మంట కాస్త పెంచుకోవచ్చు. ముక్క సరిగా ఉడికేలా వేగించాలి. స్నాక్స్‌గా తినడానికీ బావుంటాయి.

థాయ్ ఫిష్



కావల్సిన పదార్థాలు : చందువా చేప ముక్కలు - పావుకిలో, కార్న్‌ఫ్లోర్- టేబుల్ స్పూను, బియ్యప్పిండి- టీ స్పూన్, కోడిగుడ్డు- ఒకటి, బ్రెడ్ పొడి- రెండు కప్పులు, నూనె- వేయించడానికి సరిపడా, ఉప్పు- తగినంత, మిరియాలపొడి- అరటీస్పూను

తయారీ విధానం : కోడిగుడ్డు మిశ్రమాన్ని గిలకొట్టి పక్కన ఉంచాలి. చేప ముక్కల్ని కడిగి పక్కన ఉంచాలి. కార్న్‌ఫ్లోర్‌లో బియ్యప్పిండి, కోడిగుడ్డు మిశ్రమం, ఉప్పు, మిరియాల పొడి వేసి అవసరమైతే కొద్దిగా నీళ్ళుపోసి కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని చేపముక్కలకు పట్టించాలి. తర్వాత ముక్కల్ని బ్రెడ్‌పొడిలో దొర్లించి తీయాలి. కళాయిలో నూనె పోసి కాగాక తక్కువ మంటమీద ముక్కల్ని వేయించి తీసి సాస్‌తో సర్వ్ చేయొచ్చు.

సాల్మన్ ఫిష్ ఫ్రై



కావలసిన పదార్థాలు : సాల్మన్ ఫిష్ - 8 ముక్కలు, నిమ్మరసం- టేబుల్ స్పూన్, కారం- రెండు టేబుల్ స్పూన్లు, మిరియాలపొడి- అరటీ స్పూన్, ఉప్పు- తగినంత, పసుపు- రెండు టీ స్పూన్లు, నూనె- రెండు టీ స్పూన్లు,

తయారుచేసే విధానం: ముందుగా ముక్కలను శుభ్రంగా కడుక్కోవాలి. ముక్కల్లోని నీటిని పూర్తిగా ఆరనివ్వాలి. ఒక గిన్నె తీసుకొని అందులో కారం, మిరియాలపొడి, పసుపు, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం లేదా వెనిగర్ చల్లుకుంటూ కొంచెం నీరు వేసుకుంటూ మందపాటి పేస్ట్‌ని తయారు చేసుకోవాలి. చేప ముక్కలకు పేస్ట్ సమానంగా తగిలేలా చూసుకోవాలి. ఆ పేస్ట్‌లో ముక్కలను గంటపాటు ఉంచాలి. ఒక పాన్ తీసుకొని అందులో కొంచెం నూనెను వేడి చేసుకోవాలి. రెండు వైపులా బంగారు గోధుమ రంగు వచ్చే వరకు ఫ్రై చేయాలి. అంతే సాల్మన్ ఫిష్ ఫ్రై రెడీ..

హైదరాబాదీ ఫిష్ దమ్ బిర్యానీ



బిర్యానీ మసాలా కోసం :

కావల్సిన పదార్థాలు :

షాజీరా -అరటీ స్పూన్, సోంపు-టీ స్పూన్, బిర్యానీ పూలు-4 రెమ్మలు, జాపత్రి- ఒకటి, జాజికాయ-ముక్క, లవంగాలు- నాలుగు, యాలుకలు- నాలుగు, దాల్చినచెక్క అంగుళం ముక్కలు- రెండు, మీడియం ఉల్లిపాయలు- మూడు, నూనె- వేయించడానికి సరిపడా,

మారినేషన్ కోసం :

బోన్ లెస్ ఫిష్-500 గ్రాములు, పెరుగు- 300 గ్రాములు, ఉప్పు- తగినంత, పసుపు- అరటీ స్పూన్, కారం-టీ స్పూన్, బిర్యానీ మసాలా- రెండు టేబుల్ స్పూన్లు, వేయించిన ఉల్లిపాయలు- రెండు, నిమ్మకాయ- ఒకటి, అల్లం వెల్లుల్లి ముద్ద- టేబుల్ స్పూన్, పుదీనా-కప్పు, నెయ్యి- రెండు టేబుల్ స్పూన్లు, నూనె కాచినది - ఐదు టేబుల్ స్పూన్లు, వేయించిన ఉల్లిపాయ ముక్కలు-ఒకటి, పుదీనా-కప్పు, నెయ్యి-రెండు టేబుల్ స్పూన్లు,

తయారు చేసే విధానం :

బిర్యానీ మసాలా తయారీ : ఒక పెనం వేడి చేసి అందులో షాజీరా, సోంపు, బిర్యానీ పూలు, యాలుకలు, దాల్చినచెక్క, లవంగాలు, జాపత్రి వేసి ఒక నిమిషం పాటు వేపి స్టౌ కట్టేయాలి. వాటిని మిక్సీలో వేసి పొడి చేసుకొని పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయలను డీప్ ఫ్రై చేయాలి. ఉల్లిపాయల్ని చాలా సన్నగా నిలువుగా కట్ చేసుకోవాలి. ఒక చిన్న పాన్‌లో డీప్‌ఫ్రై కి సరిపడా నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగాక, ఉల్లిపాయ ముక్కల్ని వేసి అవి ముదురు గోధుమ రంగులోకి మారేవరకు వేయించాలి. పాన్‌లో నుంచి బయటకు తీసే ముందు నూనెని గట్టిగా నొక్కేసి ఉల్లిపాయలని పక్కన పెట్టుకోవాలి. చేప ముక్కల్ని శుభ్రం చేసిన తర్వాత అయిదు నిమషాల పాటు పసుపు, ఉప్పు వేసి కలిపిన మజ్జిగలో నానబెట్టాలి. తర్వాత మజ్జిగలో నుంచి తీసుకొని పక్కన పెట్టుకోవాలి. ఒక మిక్సింగ్ బౌల్‌లోకి చేప ముక్కల్ని తీసుకోవాలి. అందులో ఉప్పు, పసుపు, కారం, బిర్యానీ మసాలా, అల్లం వెల్లుల్లి ముద్ద, మూడు వంతులు వేయించిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి పేస్ట్, నిమ్మరసం, నాలుగు నుంచి ఐదు టేబుల్ స్పూన్ల కాచిన నూనె, గిలకొట్టిన పెరుగు వేసి జాగ్రత్తగా కలపి 15 నుంచి 20 నిమిషాల పాటు నానబెట్టాలి. ఒక గిన్నెలో రెండు నుంచి మూడు లీటర్ల నీళ్ళు పోసి అందులో తగినంత ఉప్పు, కొద్దిగా నూనె, గరం మసాలా దినుసులు, పుదీనా వేసి మరిగించాలి. నీళ్ళు మరగడం మొదలవగానే నానబెట్టి కడిగిన బియ్యం వేయాలి. అన్నం ఉడకడం మొదలైన దగ్గర నుంచి సరిగ్గా 3 నిమిషాలు ఉడికించి పొయ్యి కట్టేయాలి. వెంటనే అన్నంలోని నీళ్ళని వార్చేసుకోవాలి.

ఫిష్ దమ్ బిర్యానీ తయారీ :

గిన్నె అడుగున కొద్దిగా నూనె రాయాలి. నానబెట్టుకున్న చేప ముక్కల్ని వేసి సమానంగా పరవాలి. పైన సగం ఉడికిన అన్నం వేసి సమానంగా పరచాలి. మిగిలిన వేయించిన ఉల్లిపాయలు, పుదీనా ఆకులు, కొద్దిగా నెయ్యి వేసి, అల్యూమినియం ఫాయిల్‌తో గిన్నెని మూసేసి, దాని పైన మూత పెట్టాలి. ఒక పెనాన్ని పొయ్యి వెలిగించి పెట్టుకోవాలి. దాని మీద బిర్యానీ పాత్రను కూడా పెట్టాలి. ఎక్కువమంటపై 15 నిమిషాల పాటు ఉడికించి తర్వాత సిమ్ లో ఉంచి 7 నుంచి 10 నిమిషాల పాటు ఉడికించి పొయ్యి కట్టేయాలి. కట్టేసిన వెంటనే మూత తెరవకుండా ఒక 15 నుంచి 30 నిమిషాలు వదిలేయాలి.

ప్రోటీన్లు ఎక్కువ




- జానకి బడుగు
పోషకాహార నిపుణులు

చేపలను జపనీస్ వెజిటేరియన్‌గానే భావిస్తారు. మనిషిలో బుద్ధి, దేహం, బలం పెరగడానికి ఇవి ఎంతో ఉపకరిస్తాయి. చేప ముఖ్యమైన కొవ్వు పదార్థం. దీనిలో అధిక జీవ విలువలున్న ప్రొటీన్‌లు ఉన్నందువల్ల గొప్ప ఆహారం అయింది.

పుచ్చకాయతో.. చర్మం తాజాగా!

వేసవికాలం అనగానే గుర్తుకు వచ్చే పండ్లల్లో ఒకటి పుచ్చకాయ. ఇది ఎండల్లో చర్మం వడదెబ్బ బారినపడి కమిలిపోకుండా రక్షిస్తుంది. మెరిసే చర్మాన్ని అందిస్తుంది. అంతేకాదు, ఇందులో చర్మసోయగాన్ని పెంచే గుణాలు చాలానే ఉన్నాయి.

- ఇది నేచురల్ టోనర్. ఎర్రని గుజ్జు ఉండే ఈ పండు సహజమైన ఆస్ట్రిజెంట్. ఇది చర్మం రంగును మార్చుతుంది. అందుకు ఈ గుజ్జును ముఖానికి మర్దనా చేయాలి. తాజా పుచ్చకాయలో కొద్దిగా తేనె కలిపి ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇది జిడ్డు చర్మానికి సహజమైన మెరుపు ఇస్తుంది.



- పుచ్చకాయలో ఉండే లైకోపిన్, విటమిన్ సి మరియు విటమిన్ ఎ శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ను తొలగించడంలో బాగా సహాయపడుతుంది. అలాగే యాంటీఆక్సిడెంట్స్ కూడా ముడతలను, కళ్ళ క్రింద చారలను తొలగిస్తుంది.
- పుచ్చకాయ శరీరానికి తేమను అందిస్తుంది. పొడి చర్మంగలవారు పుచ్చకాయ గుజ్జుపై తేనె చిలకరించి వాడితే ముఖానికి మాయిశ్చరైజ్‌లా పనిచేస్తుంది. డీహైడ్రేషన్‌వల్ల కలిగే చర్మ ఇబ్బందులను తొలగించుకోవడానికి దీన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచిది.
- ఇందులో ఉండే విటమిన్ ఎ చర్మంలోపల ఉన్న నూనె గ్రంధులను తగ్గిస్తుంది. దాంతో ముఖంలో జిడ్డు కూడా తగ్గి ముఖం తాజాగా ఉంటుంది. ★

సొగసైన.. కేశాలు

అందమైన ముఖంతోపాటు జుట్టు ఆకర్షణీయంగా కనిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెడుతుంటారు చాలామంది. అందుకోసం అనేక రకాల పద్ధతులు పాటిస్తుంటారు. మరికొందరైతే వేల రూపాయల డబ్బులను వెచ్చిస్తూ ఉంటారు. మార్కెట్‌లో దొరికే వివిధ రకాల ఆయిల్స్‌ను వాడుతుంటారు. అలా చేయడం వల్ల మొదటికే మోసం వస్తుంది. వాటి వాడకం వల్ల సైడ్‌ఎఫెక్ట్స్ రావడంతోపాటు జుట్టు సహజత్వాన్ని కోల్పోవడం, హెయిర్ షేప్ మారిపోవడం జరుగుతుంది. స్టయిలిష్ జుట్టుకోసం అనవసరంగా డబ్బులు ఖర్చు చేసే బదులు ఇంట్లోని వస్తువులతోనే అందమైన జుట్టును మరింత అందంగా మార్చుకోవచ్చు. వీటివల్ల జుట్టు పాడయ్యే అవకావకాశాలను చాలావరకూ తగ్గించుకోవచ్చు .

- ఆలివ్ ఆయిల్‌ను కొద్దిగా వేడిచేసి జుట్టుపై 10 నుంచి 20 నిమిషాలు ఉంచాలి. తర్వాత తలపై మసాజ్ చేయాలి. 30 నిమిషాల వరకూ అలాఉంచి, తల స్నానం చేస్తే సరిపోతుంది. తద్వారా జుట్టురాలే సమస్యనుంచి కొంతవరకూ బయటపడవచ్చు.
- ముల్తానీ మట్టి జుట్టును మృదువుగా చేస్తుంది. అందుకోసం కప్పు ముల్తానీ మట్టిలో ఒక గుడ్డు, రెండు చెంచాల బియ్యపు పిండి, నీటిని కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు వేసి ముడివేయాలి. కొద్దిసేపటి తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.
- కొబ్బరిపాలల్లో నేచురల్ మాయిశ్చరైజర్ ఉంటుంది. అది జుట్టును నిలువుగా చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. నిమ్మకాయరసంలో కప్పుడు కొబ్బరిపాలు వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి. కొద్దిసేపయిన తర్వాత దానిపై క్రిమి లేయర్‌గా వస్తుంది. దాన్ని జుట్టుకు పట్టించి కొద్దిసేపు తర్వాత షాంపుతో కడిగితే సరిపోతుంది. ఇలా చేయడంవల్ల జుట్టు సహజత్వం కోల్పోకుండా కాపాడుకోవచ్చు.



- గుడ్డు జుట్టును పొడవుగా, షైనింగ్ వచ్చేలా చేస్తుంది. అలాగే, ఆలివ్ ఆయిల్ మాయిశ్చరైజర్ చాలామంచిది. రెండు గుడ్లను ఆలివ్ ఆయిల్‌లో కలపాలి. ఆ పేస్ట్‌ను జుట్టుకి పట్టించాలి. జుట్టునంతా కొప్పులా కట్టేయాలి. షవర్ క్యాప్‌ను ధరించి, మూడ నిమిషాల వరకూ ఉంచాలి. తర్వాత షాంపుతో కడిగేయాలి.
- అలోవేరా.. జుట్టులో ఉండే పిహెచ్ లెవల్‌ను సాధారణ స్థాయిలో ఉంచుతుంది. జుట్టును పొడవుగా కూడా చేస్తుంది. కప్పు అలోవేరా, కప్పు ఆలివ్ ఆయిల్‌ను మిక్స్ చేయాలి. అందులో కొద్దిగా గంధపు తైలాన్ని కలపాలి. ఆ పేస్ట్‌ను జుట్టుకు పట్టించి మసాజ్ చేయాలి. షవర్ క్యాప్‌ను ఒకటి రెండు గంటల వరకూ ఉంచాలి. తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ★

మహిళల గ్రామం

సమాజం అంటే ఏమిటి? కేవలం మహిళలు లేదంటే కేవలం పురుషులు మాత్రమే ఉండేదానిని సమాజం అంటామా? అనలేం కదా! మనందరి దృష్టిలో సమాజం అంటే స్త్రీ, పురుషులు కలిసి జీవించేది. అయితే కెన్యా దేశంలో పురుషులే లేకుండా మొత్తం మహిళలే జీవిస్తున్న ఒక గ్రామం ఉంది. నమ్మలేకపోతున్నారా? ఇదేదో అలనాటి తెలుగు సినిమా అనుకునేరు. అవునండి ఇది నిజమే. దక్షిణ కెన్యా దేశ రాజధాని నైరోపి నగరం నుంచి 380 కిలో మీటర్ల దూరంలో ఉన్న సంబురు ప్రాంతంలోనే ఈ గ్రామం ఉంది.

ఉమేంజో అనే ఈ గ్రామంలో మహిళలు మాత్రమే జీవిస్తున్నారు. దానికి బలమైన కారణం ఉంది. గృహహింస, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులులాంటి పలు కారణాల చేత బాధింపబడి విసిగివేసారిన 15 మంది మహిళలు కలిసి 1990లో ఈ గ్రామాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 47 మంది మహిళలు, 200 మంది చిన్నారులు జీవిస్తున్నారు. పురుషులే లేని ఈ గ్రామానికి బ్రిటన్ సైనికుల చేత అత్యాచారానికి గురైన రెబెక్క లోలోసేలి అనే మహిళ అధ్యక్షురాలిగా ఉంటుంది. ఈ గ్రామంలో మహిళలు ఆభరణాలను తయారుచేసి విక్రయించడం ద్వారాను, ఈ ప్రాంతంలో గుడారాలను నిర్మించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే పనులతో వచ్చే ఆదాయంతోనూ వీరు జీవనోపాధి పొందుతున్నారు. ఈ గ్రామంలో పురుషులకు నిషేధం లేదు. అయితే ఇక్కడి మహిళలు అనుమతించినన్ని రోజులు మాత్రమే ఉండాలి. దానివల్ల పురుషుల కింద బానిసలుగా కాకుండా స్వేచ్ఛాజీవులుగా తమ జీవితాన్ని గడుపుతున్నట్టు ఇక్కడి మహిళలు భావిస్తారు. మహిళలు మాత్రమే ఉంటున్న గ్రామం కావడంతో ఇరుగుపొరుగు గ్రామాల్లో ఉన్న పురుషులు అప్పుడప్పుడు హద్దుదాటి లోపలికి ప్రవేశిస్తుంటారు. అయినప్పటికీ వారిని ధైర్యంగా ఆ మహిళలు ఎదుర్కొంటుంటారు. ఈ గ్రామంలో ఉన్న 247 మంది కలిసి పది కుటుంబాలుగా జీవిస్తున్నారు. ★





విటమిన్లుగల ఆహారం

మనం రోజూ తీసుకునే ఆహారంలో ఎలాంటి విటమిన్స్ ఉంటోయో?! తెలుసుకోగలిగితే ఆరోగ్యంపై మరింత దృష్టిపెట్టొచ్చు. ఉదాహరణకు శరీరానికి విటమిన్ కె చాలా అవసరమని ఆరోగ్య నిపుణులు అంటుంటారు. ఆరోగ్యానికి సరిపడా విటమిన్ కె కోసం అరటి పువ్వు, దానిమ్మ, అరటికాయ, ఉసిరికాయ, జామకాయ, గోంగూర వంటివి ఆహారంలో తీసుకోవాలి. రక్తహీనతను దూరం చేయడానికి ఇవి ఎంతగానో సహాయపడతాయి. అలాగే శరీరానికి అవసరమయ్యే ఐరన్ కోసం మునగాకు, చిక్కుడు, అరటిపువ్వు, వంకాయలు, టమోటా, కీరదోస, బెండకాయ, కాకరకాయ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. అయితే వీటిని మితంగా తీసుకోవాల్సి ఉంటుంది. మోతాదు మించితే ఉదర, కిడ్నీ సంబంధిత సమస్యలు తప్పవని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పిండి పదార్థాల కోసం ఉల్లిపాయలు, బియ్యం, గోధుమలు, పాలు, పప్పుదినుసులు, ధాన్యాలు వంటివి తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచుకునేందుకు ప్రోటీన్లు ఎక్కువగా లభించే సోయా, పప్పుదినుసులు, పాలు, బఠాణీలు, డైట్‌లో చేర్చుకుంటే సరిపోతుంది. కాల్షియం కోసం మునగాకు, రాగి, గోధుమలు, మటన్, బీట్ రూట్, బెండకాయలు వంటివి తీసుకోవాలని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు. ★



మీ కోసం



జిగురు మరీ గట్టిగా ఉండి సీసాలోంచి బయటకు రానప్పుడు అందులో నాలుగైదు చుక్కల వెనిగర్ వేయండి.

జీవన సౌరభం

మన ప్రవర్తన మన ఎదుగుదలకు మూలం అవుతుంది. మనం గడిపే సమయం మన భవిష్యత్తుని నిర్ణయిస్తుంది.

డీఎస్సీ, ఆర్ఆర్‌బి, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఫ్రెంచివారు వర్తక స్థావరాలు ఎక్కడ స్థాపించారు?

ఆధునిక భారతదేశపు చరిత్ర



ఎవిపి.రాజు
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

1. కాన్‌స్టాంట్ నోపిల్ పట్టణాన్ని తురుష్కులు ఎప్పుడు ఆక్రమించారు? **- క్రీ.శ 1453**

2. ప్రప్రథమంగా భారతదేశానికి నూతన జల మార్గాలను కనుగొన్న ఘనత ఎవరికి దక్కింది? **- పోర్చుగీసువారికి**

3. పోర్చుగీసు నావికుడు భారతదేశానికి ఎప్పుడు చేరుకున్నాడు?

27-05-1498న కళ్లికోట చేరుకున్నాడు. స్థానిక ప్రభువైన జామొరిన అతని ఆదరించి ఆశ్రయమిచ్చాడు. అతని కాలంలోనే పోర్చుగీసువారు కళ్లికోట, కొచ్చిన్ కన్ననూరుల వద్ద తమ స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు.

4. 'సముద్రాధిపత్య విధానాన్ని' ఎవరు అనుసరించారు?

పోర్చుగీసు వారు ఐరోపా, ఆసియాల వ్యాపారం తరుష్కుల ఆధీనంలో ఉన్న భూమార్గాల నుంచి తమ ఆధీనంలో ఉన్న జలమార్గాలకు మరల్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. క్రీ.శ 1500 1509 సంవత్సరాల మధ్య వారు హిందూ సముద్రాధిపత్యాలను సాధించారు. కొచ్చిన్‌లోని పోర్చుగీసువారు గవర్నర్ అయిన అల్మీడో సముద్రాధిపత్య విధానాన్ని (బ్లూ వాటర్ పాలసీ) అనుసరించి విజేయుడయ్యాడు. అతని వారసుడైన ఆల్బుకర్క్ భూసంపాదనకు యత్నించి 1510లో గోవాను, 1511లో మలాక్కాను సంపాదించాడు.

5. విజయనగర పాలకుడైన శ్రీకృష్ణదేవరాయలు ఏ విదేశీయులతో స్నేహం చేశారు?

పోర్చుగీసువారితో స్నేహ సంబంధాలను నెలకొల్పారు. క్రమక్రమంగా వారు డయ్యా, డామన్, సాల్‌సెట్టి, చేసిన్‌లను సంపాదించారు.

6. ఆంధ్రదేశంలో పోర్చుగీసు స్థావరం ఏది?

ఆంధ్రదేశంలో పోర్చుగీసు వారి స్థావరాలు క్రీ.శ 1679 నాటికి వారి స్థావరమొకటి ఆంధ్రతీర ప్రాంతంలో మచిలీపట్నంలో కూడా నెలకొల్పారు.

7. సంయుక్త తూర్పు ఇండియా వర్తక సంఘాన్ని ఎవరు స్థాపించారు?

డచ్‌వారు. వీరు హాలెండ్ దేశీయులు. వీరు సాహసికులైన నావికులు. డచ్‌వారు క్రీ.శ 1602లో సంయుక్త తూర్పు ఇండియా వర్తక సంఘాన్ని స్థాపించారు. తూర్పు ఇండియా దీవులతోనూ, ఇండియాతోనూ వ్యాపారాన్ని ప్రారంభించి పోర్చుగీసు వారి ప్రాబల్యాన్ని తుదముట్టించారు. వీరు పోర్చుగీసు వారి నుంచి తూర్పు దీవులను వశపరచుకున్నారు.

8. డచ్‌వారు తమ స్థావరాలను ఎక్కడ నెలకొల్పారు?

మలబార్ తీరంలోని క్విలన్ క్రాంగనూరు, కొచ్చిన్‌ల వద్ద, బెంగాల్‌లోని చిన్స్యూరా, బీహార్‌లోని పాట్నా, మద్రాసు సమీపంలోని నాగపట్టణం వద్ద, ఆంధ్రతీరంలోని మచిలీపట్నం, నర్సాపురం, భీమునిపట్నం, యానామ్, పులికాట్‌ల వద్ద వారి స్థావరాలు నెలకొల్పారు.

9. గోల్కొండ సుల్తాన్ ఎవరితో స్నేహ సంబంధాలు కొనసాగించారు?

గోల్కొండ సుల్తాన్ ఉద్యోగులకు డచ్‌వారి సంయుక్త తూర్పు ఇండియా వర్తక సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం డచ్‌వారు 1606లో మచిలీపట్నం, నిజాంపట్టణం వద్ద, క్రీ. 1610లో పులికాట్ వద్ద తదుపరి నర్సాపురం, భీమునిపట్టణం వద్ద తమ వ్యాపార కేంద్రాలను ఏర్పరచుకున్నారు.

10. మొగలు చక్రవర్తి జహంగీర్ ఆస్థానాన్ని దర్శించిన విదేశీయుడు ఎవరు?

క్రీ.శ 1600 సంవత్సరాంతంలో లండను వర్తకులు కొందరు ఒక సంఘంగా ఏర్పడ్డారు. ఆ సంఘమే 'తూర్పు' ఇండియా వర్తక సంఘం. తూర్పుదేశాలతో వర్తకం చేయడానికి వారు ఇంగ్లండు రాణియైన మొదటి ఎలిజిబెత్ నుంచి ఆజ్ఞాపత్రాన్ని పొందారు. ఆంగ్ల వర్తక సంఘంవారు క్రీ.శ 1601-1606 సంవత్సరాల మధ్య జావా, సుమత్రదీవులను సందర్శించి, క్రీ.శ 1608లో కెప్టెన్ హాకిన్స్ నాయకత్వంలో మొదటిసారిగా భారతదేశానికి వచ్చారు. హాకిన్స్ మొగలు చక్రవర్తి జహంగీర్‌ను దర్శించాడు.

11. ఆంగ్లేయుల ఆంధ్రదేశంలో నెలకొల్పిన వర్తక స్థావరాలు ఏవి?

భారతదేశ తూర్పుతీరంలో వర్తక స్థావరాలు నెలకొల్పడానికి ఆంగ్ల వర్తక సంఘం వారు హిప్పిన్ నౌకదళాధిపతి నాయకత్వంలో 'గ్లోబ్' మచిలీపట్నం చేరింది. ఆంగ్లవర్తకులు గోల్కొండ సుల్తానుతో ఆంధ్రతీర ప్రాంతపు వ్యాపార విషయమై సంప్రదింపులు ప్రారంభించారు. తత్ఫలితంగా 1611లో మచిలీపట్నం వద్ద ఆంగ్లేయులు కర్మాగారాన్ని నెలకొల్పారు.

12. ఆంగ్లేయులు - మద్రాస్‌లో స్థావరాలను ఎలా ఏర్పాటు చేసుకున్నారు?

1638-39లో తూర్పు ఇండియా వర్తక సంఘ డైరెక్టర్‌లు ఆర్మగాంవ్‌లోని తమ కర్మాగారాన్ని నిర్మించారు. అనువైన మరొక స్థలాన్ని నిర్ణయించాల్సిందిగా అక్కడ కంపెనీ ఉద్యోగి ఫ్రాన్సిస్‌డేని ఆదేశించారు. ఫ్రాన్సిస్‌డే అలాంటి ప్రదేశం కోసం పుదుచ్చేరి ప్రాంతంలో అన్వేషణ ప్రారంభించాడు. ఆ ప్రాంతం చంద్రగిరి పాలకుడైన మూడో వెంకటపతి రాయల రాజ్యంలోనిది. అక్కడ స్థానిక పాలకుడైన దామెర్ల వెంకటాద్రి బ్రిటీషువారి ప్రయత్నాలను గురించి విని మద్రాసు ప్రాంతం వారికి అనుకూలమైనదని సూచించి, వారికి తన మద్దతును కూడా ప్రకటించారు. 1639లో ఫ్రాన్సిస్‌డే మూడో వెంకటపతి రాయల నుంచి మద్రాసు ప్రాంతాన్ని పొందాడు. దామెర్ల వెంకటాద్రి నాయని తండ్రి చెన్నప్పపేర అక్కడ చెన్నపట్టణాన్ని ఏర్పరిచాడు. 1641 నాటికి అక్కడ సెయింట్ జార్జికోట నిర్మించి ఉంది.

13. ఫ్రెంచి తూర్పు ఇండియా వర్తక సంఘాన్ని ఎవరు స్థాపించారు?

తూర్పు దేశాలతో వాణిజ్యం లాభసాటిగా ఉంటుందని ఫ్రెంచి ప్రభుత్వమే వర్తకులను ప్రోత్సహించింది. ఫ్రెంచి ఆర్థిక మంత్రియైన కోల్‌బర్టు క్రీ.శ 1664లో ఫ్రెంచి తూర్పు ఇండియా వర్తక సంఘాన్ని స్థాపించి అందులో మూడో వంతు వాటాలను ప్రభుత్వంచేత కొనిపించి, తూర్పు దేశాలతో వాణిజ్యాన్ని ప్రోత్సహించారు.

14. ఫ్రెంచివారు వర్తక స్థావరాలు ఎక్కడ స్థాపించారు?

ఫ్రెంచివర్తక సంఘం వారు ఆఫ్రికాతీరంలో మెడగాస్కర్, బూర్బన్ దీవులను ఆక్రమించి వాటిని కేంద్రంగా చేసుకుని ఇండియాలో వ్యాపార స్థావరాలను నెలకొల్పడానికి ప్రయత్నించారు. వారు క్రమంగా సూరత్, పుదుచ్చేరి, చంద్రనగర్, ఢాకా, కాసింబజార్, పాట్నా, బాలసోర్, కళ్లికోటల వద్ద వర్తక స్థావరాలు స్థాపించుకున్నారు.

15. ఆంధ్రప్రాంతాలల్లో ఫ్రెంచివారి స్థావరాలు ఎక్కడ స్థాపించారు?

కారన్ అనే ఫ్రెంచి నౌకాదళాధిపతి గోల్కొండ సుల్తాన్ (అబ్దుల్లా కుతుబ్‌షా) అభిమానాన్ని పొంది (1689) మచిలీపట్నంలో కర్మాగారాన్ని స్థాపించాడు. 1708లో కాకినాడ సమీపంలోని యానామ్ వద్ద కూడా ఫ్రెంచివారి స్థావరాన్ని నెలకొల్పారు.

16. వాస్కోడిగామా తిరిగి ఎప్పుడు భారతదేశానికి వచ్చాడు?

క్రీ.శ 1498లో వాస్కోడిగామా మొదటిసారిగా భారతదేశంలోని కాలికట్‌లో అడుగుపెట్టాడు. తన పెట్టిన పెట్టుబడిలో 60 రెట్లు సంపదతో 1499లో తిరిగి పోర్చుగల్‌కు వెళ్లిపోయాడు. మళ్లీ రెండోసారి 1502లో తిరిగి భారతదేశానికి వచ్చాడు. ★

నమూనా ప్రశ్నలు

1. ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో త్రిపురనేని రామస్వామి **'వీరగంథము తెచ్చినారము, వీరులెవ్వరో తెలుపుడి"** అనే గేయంతో తెనాలిలో ఉప్పు సత్యాగ్రహాన్ని ఆహ్వానించారు.
2. **'మా కొద్దీ తెల్లదొరతనం'** గేయము ఎవరి రచన **- గరిమెళ్ల సత్యనారాయణ**
3. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ఉప్పుపాటను ఎవరు రచించారు **- గరికపాటి మల్లావధాని**
4. 'స్వరాజ్య' ఆంగ్ల పత్రిక స్థాపకుడు **- టంగుటూరి (26-10-1921)**
5. స్వరాజ్యపార్టీ 1923లో **మోతీలాల్ నెహ్రూ + సి.ఆర్.దాస్ ప్రారంభించారు.**
6. టంగుటూరి వారి గృహముపేరు **- వేదవనం**
7. మద్రాస్‌లోని కాశీవిశ్వనాథుని నాగేశ్వరరావు నివాసం **- శ్రీబాగ్**
8. విజయవాడ నుంచి వెలువడిన 'స్వరాజ్యం' అనే తెలుగు వారపత్రిక సంపాదకుడు **- గాడిచర్ల**
9. ఆంధ్రలో రైతాంగ పోరాట పితామహుడు **- ఆచార్య ఎన్.జి.రంగా**
10. హరిజననాయక్ ఎవరి రచన **- ఆచార్య ఎన్.జి.రంగా**
11. ఆంధ్రదేశంలో సహవిద్య (కో-ఎడ్యుకేషన్)ను మొట్టమొదట ప్రోత్సహించింది ఎవరు **- కందుకూరి**
12. ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకులు **- దుర్గాభాయ్ దేశ్‌ముఖ్**
13. వార్ధా తీర్మానానికి గల మరోపేరు **- క్విట్ ఇండియా తీర్మానం (09-08-1942 - ముంబయి)**
14. 'నవయుగ వైతాళికుడు'గా ఖ్యాతినార్జించిన వారెవరు **- గురజాడ**
15. కందుకూరి 1881 డిసెంబర్ 11న **వితంతు వివాహాలకు** శ్రీకారం చుట్టారు.
16. గుంటూరులో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- కొండా వెంకటప్పయ్య (దేశభక్త బిరుదు ఉంది)**
17. ఏలూరులో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- దండు సూర్యనారాయణరాజు**
విశాఖపట్నంలో **- తెన్నేటి విశ్వనాథం**
చెన్నయిలో **- టంగుటూరి ప్రకాశం**
18. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టు అయిన ప్రథమ మహిళ **- ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి**
19. సీతానగరంలో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- బ్రహ్మజోస్యుల సుబ్రమణ్యం**
20. సీతానగరం ఆశ్రమానికి గల పేరు**- దక్షిణ భారత దండి**
21. అల్లూరి సీతారామరాజు తల్లిదండ్రులు పశ్చిమ గోదావరి జిల్లాలోని **మోగల్లు** వాస్తవ్యులు. (4-7-1897న జననం)
22. జనవరి 1922 నుంచి మే 1924 వరకూ కొనసాగిన రంపావిప్లవానికి నాయకత్వం వహించింది ఎవరు **- అల్లూరి సీతారామరాజు**
23. కృష్ణదేవిపేటకు సమీపంలో ఉన్న తాండవనది ఒడ్డున అల్లూరి నెలకొల్పుకున్న ఆశ్రమం పేరు **- రామవిజయనగరం**
24. అల్లూరికి సహాయపడిన సహచరులు ఎవరు **- వేగిరాజు సత్యనారాయణరాజు, గాంమల్లుదొర, గాంగంటందొర మొదలైనవారు..**
25. **'అగ్గిరాజు'**గా ప్రసిద్ధికెక్కినది ఎవరు **- వేగిరాజు సత్యనారాయణరాజు**

మొండి బాకీలు ఆందోళనకరం

ఆర్థిక నిపుణుల ఆందోళన
వృద్ధి 6.9 శాతానికి చేరొచ్చు
ఎగుమతులపై ఒత్తిడి
క్యూ3పై రాయిటర్స్ పోల్



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న మొండి బకాయిలపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయిటర్స్ పోల్‌లో అభిప్రాయపడ్డారు. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో భారత వృద్ధి రేటు కొంత పుంజుకోవచ్చన్నారు. గత వారం రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో 35 మంది ఆర్థికవేత్తల అభిప్రాయాలపై పోల్ నిర్వహించింది. ఆ రిపోర్టు వివరాలు.. వినియోగదారులు, వ్యాపారం, ప్రభుత్వ వ్యయాలు కొంత పెరగడంతో వృద్ధి సానుకూలంగా ఉండొచ్చని పేర్కొంది. నోట్ల రద్దు చాయలు, జిఎస్‌టి సంక్లిష్టతలు కూడా తొలిగి పోతుండటంతో జిడిపికి మద్దతు దొరకవచ్చు. ఈ పరిణామాల మధ్య 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. 7 శాతం చేరువలో వృద్ధి రేటు నమోదైతే 2017లో ఇదే అత్యధికం కానుంది. కాగా జులై -సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధి రేటు 6.3 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే.

ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం..

బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న మొండి బాకీలపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని బలంగా నియంత్రించలేకపోతే ఆర్థిక వ్యవస్థకే ప్రమాదమని హెచ్చరిం చారు. ఆ రిపోర్టు వివరాలు.. దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో చోటు చేసుకున్న అక్రమ లావాదేవీలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద కుంభకోణం. ఇలాంటి మోసాలకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మూల్యం చెల్లించుకుంటున్నాయన్నారు. ఇవి బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. వీటిని పరిష్కరించుకోవడానికి మరింత సమయం పట్టొచ్చని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ పిడి ఎకనామిస్టు అభిషేక్ ఉపధ్యాయ్ పేర్కొన్నారు. మొండి బాకీల పరిష్కారం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగ్గా ఉండొచ్చన్నారు.

ఇప్పటికీ దూరమే..

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏడో అతిపెద్ద వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పటికీ రెండంకెల వృద్ధి రేటుకు దూరంగానే ఉందని ఉపధ్యాయ్ పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభం పోయి ఇన్నాళ్లు అయినా మెరుగైన వృద్ధి రేటు సాధించలేకపోతున్నా మన్నారు. గతేడాది నుంచి ఎగుమతులపై ఒత్తిడి కొనసాగు తుందన్నారు. 2017లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 6.5 శాతం బలపడిం దన్నారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు 1 శాతం విలువ కోల్పోయిందన్నారు.

7 శాతంగా ఉండొచ్చు : మోర్గాన్ స్టాన్లే..

గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో భారత జిడిపి వృద్ధి రేటు 7 శాతంగా చోటు చేసుకోవచ్చని మోర్గాన్ స్టాన్లే అంచనా వేసింది. 2017-18 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 5.7 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతంగా ఉంది. ఈ గ్లోబల్ ఫైనాన్సీయల్ సర్వీసెస్ రిపోర్టు ప్రకారం పరిశ్రమ, సేవల రంగాల వృద్ధి పెరుగొచ్చు. కాగా వ్యవసాయ రంగం వృద్ధి తగ్గొచ్చు. కార్పొరేట్ రెవెన్యూలు పెరగడానికి తోడు వాహన రంగం మెరుగైన వృద్ధి కనబరిచే అవకాశం ఉంది.

కలరా వాక్సీన్‌కు డబ్ల్యుహెచ్‌ఒ ఆమోదం
శాంతా బయోటెక్నిక్స్ వెల్లడి

హైదరాబాద్ : సనోఫీ పాశ్చర్ అనుబంధ సంస్థ శాంతా బయోటెక్నిక్స్ రూపొందించిన ఓరల్ కలరా వ్యాక్సీన్ 'షాన్‌కాల్'కు డబ్ల్యుహెచ్‌ఒ అనుమతించింది. దీన్ని తక్షణమే వినియోగించడానికి ముందు గరిష్టంగా 14 రోజుల వరకు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిందని ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ భాల్గట్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఈ వ్యాక్సీన్ ఉపయోగించే ఎన్నో ప్రాంతాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ అనుమతి ద్వారా రవాణ సమయంలో వాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు తొలుగుతాయన్నారు. అంటే 2-8 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్య ఉంచాల్సిన అవసరం లేదన్నారు. కలరాను సమర్థవంతంగా నియంత్రణ, నివారించడంలో తాము చేస్తున్న ప్రయత్నాల్లో ఇది మరో ప్రతిష్టాత్మక మైలు రాయి అని పేర్కొన్నారు.

రియాల్టీ, ఆటో షేర్ల పరుగు
సెన్సెక్స్ 304 పాయింట్ల లాభం

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలకు తోడు మదుపర్ల కొనుగోళ్ల మొగ్గుతో సోమవారం భారత మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధి రేటు పెరగనుందన్న అంచనాలు మదుపర్లలో విశ్వాసాన్ని పెంచాయి. ముఖ్యంగా రియాల్టీ, ఆటో సూచీల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 304 పాయింట్లు పెరిగి 34,446కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 92 పాయింట్లు రాణించి 10,583 వద్ద ముగిసింది. రియాల్టీ సూచీ అత్యధికంగా 3 శాతం పెరిగి మార్కెట్లకు గట్టి మద్దతునిచ్చింది. నిఫ్టీలో ఒబెరాయ్ రియాల్టీ 14.11 శాతం, ప్రెస్టిజీ 5.79 శాతం, యూనిటెక్ 3.50 శాతం, డిఎల్ఎఫ్ 1.35 శాతం, శోబా 0.93 శాతం చొప్పున రాణించాయి. ఆటో సూచీ 2 శాతం ర్యాలీ చేసింది.

అంతర్జాతీయంగా జపాన్ నిక్కీ 1.3 శాతం, చైనా సూచీలు 0.7 శాతం, డోజోన్స్ 1.39 శాతం, ఎస్అండ్‌పి 500 సూచీ 1.60 శాతం, నాస్‌డాక్ 1.77 శాతం చొప్పున పెరిగాయి. ఈ సానుకూల ఫలితాలు భారత మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్-30లో సన్‌ఫార్మా 2.40 శాతం, టిసిఎస్ 1.20 శాతం, ఐటిసి 1.10 శాతం, ఇన్ఫీ 0.92 శాతం, విప్రో 0.72 శాతం, విప్రో 0.73 శాతం, ఎస్‌బిఐఎన్ 0.72 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. కాగా మారుతి సుజుకి 4.07 శాతం, టాటా మోటార్స్ 3.34 శాతం, ఎల్అండ్‌టి 2.98 శాతం, ఇండుస్ఇండ్ బ్యాంకు 2.87 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 2.46 శాతం, యాక్సిస్ బ్యాంకు 2.41 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

నోకియాతో బిఎస్ఎన్ఎల్ జట్టు
10 సర్కిళ్లలో 4జి ఎల్‌టిఇ సేవలు

న్యూఢిల్లీ/బార్సిలోనా : ప్రయివేటు టెల్కోలకు ధీటుగా బిఎస్ఎన్ఎల్ కూడా 4జి వాయిస్ ఓవర్ ఎల్‌టిఇ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నోకియాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా నోకియా భారత్‌లోని 10 టెలికాం సర్కిళ్లలో బిఎస్ఎన్ఎల్‌కు తన టెక్నాలజీని అందించనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, గోవా, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆ సర్కిళ్లలో బిఎస్ఎన్ఎల్‌కు 3.8 కోట్ల మంది ఖాతాదారులున్నారు. ఈ టెక్నలాజీ కోసం ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. తమ వినియోగదారులకు అత్యాధునిక, అత్యుత్తమ సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేయనుందని బిఎస్ఎన్ఎల్ సిఎండి అనుపమ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. టెక్నలాజీ భాగస్వామీగా నోకియాను ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. నోకియాకు చెందిన సింగిల్ రేడియో యాక్సెస్ నెట్‌వర్క్‌ను వినియోగించుకొని 2జి, 3జి, 4జి వినియోగదారులకు చౌకగా సేవలను అందించ నున్నామన్నారు. అదే విధంగా 4జి వినియోగదారులకు హెచ్‌డి నాణ్యత కలిగిన వాయిస్ సేవలను అందజేస్తామన్నారు. నోకియా నుంచి కొత్తగా ఐదు ఫోన్లుహెచ్‌ఎండి గ్లోబల్ బ్రాండ్ నోకియా కొత్తగా ఐదు ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2018లో వీటిని ఆవిష్కరించింది.

రామాయపట్నంలోనే పోర్టు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కందుకూరు(ప్రకాశం)

రామాయపట్నంలోనే పోర్టు నిర్మాణం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు ఆర్‌డిఓ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు డాక్టర్ మువ్వా కొండయ్య మాట్లాడుతూ దుగరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి అనేక అడ్డంకులు ఉన్నాయని దానికి ప్రత్యామ్నయంగా మరో ప్రాంతాన్ని ప్రతిపాదించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్ర ప్రభుత్వం రామాయపట్నాన్ని ప్రతిపాదించాలని ఆయన కోరారు.

నీటి ఎద్దడి

విశాఖ జిల్లా అరకులోయ మండలం, చొంపి గ్రామానికి చెందిన గిరిజనులు నీటి ఎద్దడి నివారించాలంటూ సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యాన ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. అధికారులు, ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు



నూతన పింఛను విధానం రద్దు చేయాల్సిందే

ఎన్‌ఎఫ్ఐఆర్ జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే(ఎన్‌ఎఫ్ఐఆర్) జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైల్వే డిఆర్ఎం కార్యాలయం ఎదుట ఉన్న విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన రైల్వేలో 1957లో పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగానంతరం సిబ్బందికి భరోసా కల్పించారన్నారు. 2004లో ఎన్‌డిఎ ప్రభుత్వం పాత పింఛన్ విధానానికి తూట్లు పొడిచి, కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను అమలు చేస్తోందని విమర్శించారు. రైల్వేలో 13.16 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడో వేతన కమిషన్‌ను సవరించి 1986 తరువాత రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్‌ను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. రైల్వేలో 2.23 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు.

నేడు రాజమండ్రిలో యువభేరి

రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 27న రాజమండ్రిలో యువభేరి జరుగనుందని విజయవాడ ఎస్‌సి రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజన్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమలో డివిజన్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్రరావు, అసిస్టెంట్ డివిజన్ కార్యదర్శి వైఎన్.బాబు, ఇంజినీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎన్‌వి సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె ఉధృతం

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 28న విశాఖలోని తూర్పు, తిరుపతిలోని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల కార్యాలయాలను ముట్టడిస్తామని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి
- శ్రీకాకుళంలో 30 మంది అరెస్టు
- విజయనగరంలో విద్యుత్ టవర్ ఎక్కి కార్మికుని నిరసన
- కొనసాగిన నిరవధిక నిరాహార దీక్షలు
- సమస్యలపై శాసనమండలిలో చర్చిస్తాం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి



శ్రీకాకుళంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావును అరెస్టు చేస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) విజయనగరం జిల్లా బొబ్బిలిలో విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికునికి నచ్చజెప్పుతున్న మరో కార్మికుడు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడో రోజూ కొనసాగింది. కార్మికులు సోమవారం తమ ఆందోళనను ఉధృతం చేశారు. కొన్ని జిల్లాల్లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. విజయనగరంలో ఒక కార్మికుడు విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలియజేశాడు. శ్రీకాకుళంలో 30 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చలో శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. కలెక్టరేట్ గేటు ఎదుట పోలీసులు వారిని అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, పి.తేజేశ్వరరావు, ఎం.శ్యామ్‌సుందర్, సంపతిరావు సహా 30 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో కార్మికులు భిక్షాటన నిర్వహించారు. 132 కెవి సబ్‌స్టేషన్ వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకస్మికంగా ఓ కార్మికుడు అక్కడ ఉన్న విద్యుత్ టవర్‌పైకి ఎక్కి సుమారు గంటపాటు తన నిరసన తెలియజేశాడు. విజయనగరంలోని విద్యుత్ భవనం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అంతకుముందు దీక్షలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి మద్దతు ఇచ్చి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను శాసనమండలిలో చర్చిస్తానన్నారు. మాజీ మంత్రి జెడి శీలం, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి మద్దతు తెలిపారు. కర్నూలులో విద్యుత్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. 11 మంది కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1,250 మంది కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగించారు. కాకినాడలో విద్యుత్ శాఖ డిఇ కార్యాలయాన్ని ముట్టడించారు. రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద భిక్షాటన చేశారు. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్య ఇంజినీర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. సిపిఎం, సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి మద్దతు తెలిపాయి. చిత్తూరు జిల్లా తిరుపతిలోని ఎస్‌ఇ కార్యాలయాన్ని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ముట్టడించారు. కడపలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సిఐటియు, రైతు సంఘం, కెవిపిఎస్, అఖిల భారత ట్రేడ్ యూనియన్స్, ప్రజాసంఘాల నాయకులు, లాయర్లు మద్దతు తెలిపారు. విశాఖ జిల్లా పెదబయలు, అరకులోయ మండలాల్లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన,భిక్షాటన చేశారు. నర్సీపట్నంలో ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య, సిఐటియు, సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. గుంటూరులో సామూహిక రాయబారం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం నుంచి జిల్లా పరిషత్తులోని 'మీ కోసం' వరకూ ప్రదర్శన నిర్వహించారు. జెడ్‌పి ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

ప్రాణ త్యాగానికైనా సిద్ధం

కలెక్టరేట్ల ముట్టడికి యత్నించిన న్యాయవాదులను అడ్డుకున్న పోలీసులు



కడప కలెక్టరేట్‌ను ముట్టడించిన న్యాయవాదులు (ఇన్‌సెట్) గేటు ఎక్కి లోనికి వెళ్లే ప్రయత్నం చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - యాంత్రాంగం

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో న్యాయవాదులు చేపట్టిన ఉధృతమయ్యాయి. హైకోర్టు సాధనకు అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని సీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ ఎస్.మస్తాన్‌వలి, సభ్యులు జి.వి.రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, డి.నాగేశ్వరరాజు, ఐలు జిల్లా అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తిరుమలశెట్టి నాగరాజు, న్యాయవాదులు స్పష్టం చేశారు. సోమవారం రాయలసీమ న్యాయవాదుల జెఎసి, కడప బార్ అసోసియేషన్, ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలెక్టరేట్ మట్టడి కార్యక్రమం చేపట్టారు. తొలుత జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన రిలే దీక్షల శిబిరం వద్ద నుంచి న్యాయవాదులు, విద్యార్థి సంఘాలు, సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ మీదుగా ఎర్రముక్కపల్లి సర్కిల్, పిఎఫ్ ఆఫీస్, విద్యుత్ భవన్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టరేట్‌ను ముట్టడి నిర్వహించారు.

విషయం తెలుసుకున్న పోలీసులు కలెక్టరేట్ ప్రధాన గేట్లు మూసివేశారు. దీంతో న్యాయవాదులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కలెక్టర్ బయటికి రావాలంటూ నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న కడప డిఎస్‌పి మాసూం బాష విషయాన్ని ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ శివారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన న్యాయవాదుల వద్దకు వచ్చారు. న్యాయవాదులు ఇన్‌చార్జి జెసికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఇన్‌ఛార్జ్ జెసి శివారెడ్డి మీ న్యాయమైన డిమాండ్‌ను సాయంత్రంలోపు సిఎం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. దీంతో న్యాయవాదులు కలెక్టరేట్ ముట్టడి ఆందోళనను విరమించారు. అనంత పురంలో జిల్లా కోర్టు నుంచి ర్యాలీగా వెళ్తున్న న్యాయవాదులను, సిపిఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. సంగమేష్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన న్యాయవాదులు పోలీసు స్టేషన్‌లోనే రెండు గంటల పాటు నిరసన తెలిపారు. కర్నూలులో బార్ అసోసియేసన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.



గుంటూరు సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మోడీ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలు కోసం కమ్యూనిస్టులు నిర్వహించే పోరాటాలతో మోడీ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపించాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ గుంటూరు జిల్లా 24వ మహాసభల సందర్భంగా మంగళగిరిలో సోమవారం ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, మేధావులతో పాటు మోడీకి, మతోన్మాదానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ కార్యకర్తలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌ను చంపితే రూ.కోటి ప్రకటించడంపైనా మోడీ ప్రభుత్వం ఖండించలేదని మండిపడ్డారు. నల్లధనాన్ని వెలికి తీయకపోగా ఇంకా పోగుచేసుకునేందుకు కార్పొరేట్లకు అవకాశం కల్పించారని, నీరవ్‌మోదీ, విజయమాల్యాలు విదేశాల్లో దర్జాగా తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నికలప్పుడు గిట్టుబాటు ధరకు వాగ్దానాలిచ్చి నేడు రైతు ఆత్మహత్యలనూ పట్టించుకోవడం లేదన్నారు. చంద్రబాబు పాలన అవినీతి మయమైందని, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితిల్లో సిపిఐ, సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీకి ఎన్నుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, వి.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజ్ఞ — జవాబులు


1. తమిళనాడు, 2. విశాఖపట్నం, 3. 350 కిలోమీటర్ల దూరం
4. బి.నాగిరెడ్డి, 5. అమెరికాలోని పశ్చిమ టెక్సాస్‌లో

భారత్ సాల్ట్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - మచిలీపట్నంరూరల్

భారత్ సాల్ట్ యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తూ, కనీస వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటుందని ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల సంఘం కార్యదర్శి, సామాజికవేత్త రాయవరపు సత్యభామ అన్నారు. కృష్ణా జిల్లా బందరు మండలం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ కంపెనీ వద్ద వర్కర్స్, స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్యం కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుస్తోందన్నారు. కార్మికుల కష్టంతో కోట్లాది రూపాయలు గడిస్తూ కార్మికుల కడుపులు కొడుతున్నారని విమర్శించారు. మహిళలకు కనీసం టాయిలెట్లు కూడా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు ఆమరణ నిరాహారదీక్షకైనా వెనుకాడేది లేదన్నారు. యూనియన్ అధ్యక్షులు మోకా నాగరాజు మాట్లాడుతూ భారత్ సాల్ట్ మొండివైఖరి విడనాడాలని, ఎన్నో ఏళ్లుగా భారత్ సాల్ట్‌లో పనిచేస్తున్న కూలీలకు ప్రతి శనివారమూ జీతాలు చెల్లించాలని చెప్పారు. దీక్షల్లో మోకా రాంబాబు, తుమ్మా శివయ్య, వాటపల్లి నాగరాజు, మస్తాన్, గంజాల బుడ్డా, మోకా దుర్గారావు, కొప్పనాతి ఏడుకొండలు, టి.వెంకన్న, మోకా వెంకటేష్, కర్రా నాగరాజు, కె.రంగయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



విజయవాడలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న సిబ్బంది సర్వీసును క్రమబద్ధీకరించాలని ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఎపి ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం మహాతపస్సు నిర్వహించారు. వారికి మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాల్లో ఉద్యోగ విరమణ చేసిన లెక్చరర్స్ స్థానంలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకుండా యాజమాన్యంపై వదిలేసిందన్నారు. యాజమాన్యం ప్రైవేటు వారిని నియమించుకుని చాలీచాలని వేతనాలు చెల్లిస్తుందన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, హెల్త్ కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. ఎంఎల్‌సి వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిఓ 35ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజీవరావు మాట్లాడుతూ మార్చి 4వ తేదీలోపు సమస్యలు పరిష్కారం చేయాలని, లేదంటే ఐదో తేదీ నుంచి విజయవాడలో ఆమరణ దీక్షలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అంబేద్కర్, కోశాధికారి నవీన్ కుమార్, కెవి నాగేశ్వరరావు, ఎఎస్ఎన్ మూర్తి, ఎ.సూరిబాబు, కె.గిరీష్ 13 జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

త్రిపుర రీపోలింగ్‌లో 85 శాతం ఓటింగ్

అగర్తల : త్రిపురలో సోమవారం ఆరు బూత్‌ల్లో జరిగిన రీపోలింగ్‌లో సాయంత్రం 4 గంటల సమయానికి 85 శాతం పోలింగ్ నమోదయింది. రాష్ట్రంలోని సోనామురా, తెలియామురా, సబ్రూమ్, అంపినగర్, కదంతల–కుర్తి, ధాంపూర్ నియోజకవర్గాల్లోని ఒక్కొక్క బూత్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. అధికారికంగా సాయంత్రం 4 గంటలకు పోలింగ్ పూర్తయిందని, కానీ ఓటర్లు ఇంకా క్యూలో వేచి చూస్తున్నారని, పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగే అవకాశముందని ఎన్నికల అధికారి తపస్ రాయ్ తెలిపారు. ఈవిఎంలో ఇబ్బందులు తలెత్తినట్లు ఎలాంటి వార్తలు రాలేదని ఆయన తెలిపారు.



మంతనాలు

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో చర్చిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధి

త్రిసభ్య ధర్మాసనాల మధ్య ఘర్షణ పరిష్కారానికి విస్తృత ధరార్మసనం

న్యూఢిల్లీ : రెండు త్రిసభ్య ధర్మాసనాల మధ్య నెలకొన్న ఘర్షణలను పరిష్కరించేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాం ధర్మాసనాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఏర్పాటు చేశారు. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును మరో త్రిసభ్య ధర్మాసనం ఎలా కొట్టివేస్తుందని జస్టిస్ కురియన్ జోసెఫ్ ప్రశ్నించడంతో సమస్య మొదలైంది. తన సహచర న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థకు సంబంధించిన క్రమశిక్షణను ఉల్లంఘించారని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నాటి తీర్పును కొట్టివేస్తూ ఈ నెల 8న జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎ.కె.గోయల్, జస్టిస్ ఎం.ఎం.శంతన్‌గౌడర్‌లతో కూడిన బెంచ్ తీర్పు ఇవ్వడంపై జస్టిస్ కురియన్ తీవ్రంగా స్పందించారు. భూ సేకరణకు నష్టపరిహారం కేసులో విచారణ జరుగుతుండగా అడ్వకేట్ జనరల్ ముకుల్ రోహ్‌తగి మాట్లాడుతూ ఈ రెండు తీర్పుల్లో వెలువడిన భిన్నాభిప్రాయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో కురియన్ వ్యాఖ్యలు వెలువడిన మరుసటి రోజు జస్టిస్ మిశ్రా, జస్టిస్ గోయల్‌లు భూసేకరణ కేసులను ప్రధాన న్యాయమూర్తికి నివేదించారు. ఈ కేసులను విస్తృత ధర్మాసనంలో విచారించాల్సిందిగా వారు ప్రధాన న్యాయమూర్తిని కోరారు.

ఉత్తర ప్రదేశ్‌లో రైలు ఢీకొని ఆరుగురు టీనేజర్లు మృతి

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని హపూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఆరుగురు టీనేజర్లు మృతి చెందారు. మరొకరు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. హపూర్ పిల్‌ఖువా సమీపంలోని సాడిక్‌పూర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. వారు రైల్వే ట్రాక్‌పై నడుస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదానికి గురైన ఏడుగురు 14–16 సంవత్సరాల మధ్య వయస్సువారని, రోజువారి వేతన కార్మికులుగా పనిచేస్తుంటారని, వారందరూ స్నేహితులని స్థానికులు తెలిపారు.. హైదరాబాద్‌లో ఒక పెయింటింగ్ కాంట్రాక్టు నిమిత్తం వారు ఘజియాబాద్ నుండి రైలులో రావాలనుకుని ఉంటారని, రైలు తప్పిపోవడంతో అర్ధరాత్రి సమయంలో తమ సొంత ప్రదేశమైన పిలాఖువాకు తిరిగి వెళ్తూ ప్రమాదానికి గురై ఉంటారని, ఇయర్‌ఫోన్‌లు పెట్టుకుని సంగీతం వింటూ ట్రాక్‌పై నడుస్తున్న సమయంలో వెనుకగా వచ్చిన రైలును గుర్తించి ఉండరని స్థానికులు పేర్కొన్నారు.

ఓరియంటల్ బ్యాంకుకు రూ. 109 కోట్ల 'టోకరా'

- సింబోలి చక్కెర కర్మాగారంపై కేసు నమోదు
- పంజాబ్ ముఖ్యమంత్రి అల్లునిపై ఎఫ్ఐఆర్
- ఎనిమిది ప్రాంతాలలో సోదాలు



చండీఘర్ : వరుస బ్యాంకుల కుంభకోణాలతో బడా వ్యాపారులు ప్రజల సంపదను కొల్లగొడుతున్న నేపథ్యంలో పంజాబ్‌లో మరో బ్యాంకు కుంభకోణం 'షాక్' ఇచ్చింది. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అల్లుడు, మరో 11మంది కలిసి ఓరియంటల్ బ్యాంకుకు రూ. 109 కోట్ల మేరకు మోసగించారని సిబిఐ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రైవేటు చక్కెర కర్మాగార సంస్థ అయిన సింబోలి షుగర్స్ లిమిటెడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంస్థలోని సిఎండి, సిఎఫ్ఒ, సిఇఒ, డైరెక్టర్లు, బ్యాంకుకు చెందిన అధికారులను నేరపూరిత కుట్ర, మోసం తదితర అంశాల కింద వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. వీరిలో ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అల్లుడు గుర్‌పాల్‌సింగ్ కూడా ఉన్నారని సిబిఐ అధికారులు తెలిపారు. ఆదివారం సిబిఐ అధికారులు ఈ కంపెనీకి సంబంధించిన ఎనిమిది ప్రాంతాలలో సోదాలు నిర్వహించినట్లు ప్రకటించారు. వీటిలో ఐదు ఢిల్లీలో ఉండగా, ఒక ప్రాంతం నొయిడాలో ఉందని అధికారులు తెలిపారు. ఈ సోదాలలో ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించిన అనంతరం వారిని విచారించడానికి పిలుస్తామని అన్నారు. కాగా, ఈ కంపెనీకి 2011లో రూ. 150 కోట్ల రుణాన్ని ఓరియంటల్ బ్యాంకు మంజూరు చేయడమేకాక, రూ.5,700 చెరుకు రైతులకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)స్కీమ్ కింద పెట్టుబడిని అందించినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి కింద రైతులకు మార్చి 2012లో అందించిన రుణాలు కూడా ఈ కంపెనీ ఖాతాలలో చేరినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. ఈ ఖాతాలను నిరర్ధక ఆస్తుల (ఎన్‌పిఎ)కింద మార్చి 2015లో బ్యాంకు ప్రకటించింది. పాత రుణాలను చెల్లించడానికి మరో రుణం కింద రూ. 110 కోట్లు బ్యాంకు మంజూరు చేసింది. అయితే ఈ అకౌంటును కూడా కంపెనీ 2016లో నిరర్ధక ఆస్తిగా ప్రకటించింది.



ఏప్రిల్ 15 లోపు కర్నాటక ఎన్నికల తేదీ

న్యూఢిల్లీ : ఏప్రిల్ 15 లోపు కర్నాటక అసెంబ్లీ ఎన్నికల తేదీని ప్రకటిస్తామని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఓపి రావత్ సోమవారం తెలిపారు. 'స్కూల్ బోర్డు పరీక్షలన్నీ మార్చి నెల చివరిలోగా ముగుస్తాయి. ఇతర పరీక్షలు ఏప్రిల్ 14లోగా ముగుస్తాయి. ఏప్రిల్ 15లోగా ఎన్నికల తేదీని ప్రకటిస్తాం' అని రావత్ తెలిపారు. ప్రస్తుత కర్నాటక అసెంబ్లీ పదవీకాలం మే 28తో ముగియనుంది. ఆలోగానే ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. అలాగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏప్రిల్ మొదటివారంలో కర్నాటకలో ముగ్గురు ఎన్నికల కమిషనర్లు కర్నాటకలో పర్యటిస్తామని రావత్ వెల్లడించారు.

కెజి డి-5 నుండి ఉత్పత్తిలో జాప్యం : ప్రకటించిన ఓఎన్‌జిసి

న్యూఢిల్లీ : కృష్ణా గోదావరి బేసిన్‌లోని కెజి డి–5 చమురు క్షేత్రం నుంచి 2019 జూన్ 19 నాటికి ఉత్పత్తిని ప్రారంభించాలన్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని ప్రముఖ చమురు ఉత్పత్తి సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జిసి) సోమవారం తెలిపింది. జిఎస్‌టి, స్థానిక కొనుగోళ్ళకు సంబంధించి ప్రాధాన్యతా నిబంధనలు కారణంగా తాము నిర్దేశించిన సమయానికి ఉత్పత్తిని ప్రారంభించలేక పోతున్నట్లు ఓఎన్‌జిసి తెలిపింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం ప్రభుత్వ రంగ కంపెనీలు దేశీయ ఇనుము, ఉక్కును ఉపయోగించాలన్న నిబంధన కూడా ఉన్నదని తెలిపింది. గత వారంలో స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో ఫైలింగ్ చేసే విషయమై స్పష్టతనిస్తూ, స్థానికంగానే కొనుగోళ్ళకు ప్రాధాన్యతనివ్వాలన్న విధానం అమలులోకి రావడం, స్టీల్ పాలసీ, జిఎస్‌టి పాలసీల కారణంగా ఉత్పత్తి ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని తెలిపింది. చమురు, మైనింగ్ రంగాలకు సంబంధించి కొత్త పాలసీలపై ఎన్ఎస్ఇకి, బిఎస్ఇకి సమర్పించి వివరణలో ఓఎన్‌జిసి స్పష్టత ఇవ్వకపోయినప్పటికీ వాటి కారణంగానే ఉత్పత్తి ఆగిపోయినట్లు ఓఎన్‌జిసి జారీ చేసిన ఒక ప్రకటన పేర్కొంది.

దక్షిణాది గవర్నర్‌పై ఫిర్యాదు అందలేదన్న కేంద్రం

న్యూఢిల్లీ : దక్షిణ రాష్ట్రాలకు చెందిన ఒక గవర్నర్‌పై లైంగిక దుష్ప్రవర్తనకు సంబంధించి ఫిర్యాదు దాఖలైన విషయం తమకు తెలియదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. అటువంటి పరిణామాలేవీ తమకు తెలియవని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి అశోక్ ప్రసాద్ తెలిపారు. రాజ్‌భవన్ లోని మహిళా సిబ్బంది తనకు అనుకూలంగా వ్యవహరించాలంటూ గవర్నర్ వారిని కోరుతున్నట్లు మీడియా వార్తలు వెలువడ్డాయి.ఇందుకు సంబంధించి వెలువడిన ఫిర్యాదును కూడా కేంద్రం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని దర్యాప్తుకు ఆదేశించిందని మీడియా పేర్కొంటోంది. ఆ ఫిర్యాదు గనక నిజమైతే తక్షణమే గవర్నర్‌ను పదవి నుండి వైదొలగాలని కేంద్రం కోరనుంది. హోం శాఖ ఆ గవర్నర్ ఎవరో వెల్లడించలేదు. అయితే ఆ గవర్నర్ ప్రస్తుత పదవీ కాలంలోనా లేక గత హయాంలోనా అనేది కూడా నిర్ధారితం కాలేదు. గవర్నర్‌పై ఇటువంటి రీతిలో ఫిర్యాదులు వెలువడడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మేఘాలయ గవర్నర్ షణ్ముగనాథన్‌ను ఇలాగే రాజీనామా చేయాల్సిందిగా కోరారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్
నలుగురు మావోయిస్టుల మృతి

రాంచీ: భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులున్నారు. జార్ఖండ్‌లో పలాము జిల్లాలోని లాలాఘాటీ–నౌదియా ప్రదేశంలో సోమవారం ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)కు చెందిన 134వ బెటాలియన్, జార్ఖండ్ రాష్ట్ర పోలీసుల బృందాలు సంయుక్తంగా యాంటీ మావోయిస్టు ఆపరేషన్(కూంబింగ్) నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు వివరించారు. మృతిచెందిన మావోయిస్టులు రాకేశ్ భుయాన్, లల్లూ యాదవ్, రింకీ, రూబీలుగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఈ నలుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఘటనాస్థలంలో రెండు రైఫిళ్ల లభ్యమైనట్టు తెలిపారు.

'భారత్ మాతా కీ జై' అనని వారంతా పాకిస్తానీయులే : బిజెపి ఎమ్మెల్యే

లక్నో : ఉత్తరప్రదేశ్‌కి చెందిన బిజెపి ఎమ్మెల్యే సురేంద్ర నారాయణ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'భారత్ మాతా కీ జై' అని సంభోదించని వారంతా పాకిస్తానీయులేనని ఈనెల 25న జరిగిన బహిరంగ సమావేశంలో బైరియా ఎమ్మెల్యే నారాయణ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఉత్తర భారతంలో 'భారత్ మాతా కీ జై'ని వ్యతిరేకిసున్న వారంతా పాకిస్తానీయులని పేర్కొన్నారు. ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇది మొదటిసారి కాదు. అంతకు ముందు కూడా ఆయన మాట్లాడుతూ 2024 నాటికి భారత్ హిందూ దేశంగా మారిపోతుందని, కొంత మంది ముస్లింలు భారత్‌లోనే ఉంటారని, కాని వారు హిందూ సంస్కృతిలో కలిసిపోతారని వ్యాఖ్యానించారు. గత నెలలో బిజెపి ఎంపి వినయ్ కతియార్ మాట్లాడుతూ ముస్లింలు మతం పేరుతో దేశాన్ని విభజించారని, అందువల్ల దేశాన్ని వారు విడిచి వెళ్లాలని పేర్కొన్న సంగతి తెలిసిందే.

తృణమూల్‌కు భూటియా గుడ్‌బై



న్యూఢిల్లీ : మాజీ ఫుట్‌బాల్ కెప్టెన్ తృణమూల్ కాంగ్రెస్ నుండి తప్పుకుంటున్నట్లు సోమవారం వెల్లడించారు. ఆయన 2011లో ఫుట్‌బాల్ ఆటకు రాజీ నామా చేసిన అనంతరం పార్టీలో చేరినట్లు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తాను ఏ ఇతర రాజకీయ పార్టీలో చేరలేదని, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సభ్యత్వాలన్నిటికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, భూటియా పార్టీలో చేరి ఐదు సంవత్సరాలైందని, ఆయన పార్టీ తరపున రెండు సార్లు పోటీ చేసి, ఓడిపోయినట్లు మమతా బెనర్జీ తెలిపారు. కాగా, అతను గతంలోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాలనుకున్నట్లు కొందరు అధికారులు తెలిపారు. గతేడాది అతను అధికార పార్టీ నిబంధనలను తిరస్కరించి ప్రత్యేక గూర్ఖాలాండ్ ఆందోళనను సమర్ధించడం ద్వారా పార్టీ నుండి విమర్శలను ఎదుర్కొన్నారని, దాంతో డార్జిలింగ్‌లో 100 రోజుల అశాంతికి కారణమైనట్లు తెలిపారు.

భూసేకరణ చట్టంపై రాజ్యాంగ ధర్మాసనం

- పరిహారం చెల్లింపులపై వేర్వేరు ధర్మాసనాల భిన్న తీర్పులు

న్యూఢిల్లీ: భూసేకరణ విషయంలో వేర్వేరు ధర్మాసనాలు పరస్పర విరుద్ధమైన తీర్పులివ్వడంతో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు వెల్లడించింది. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మార్చి 6 నుంచి విచారణ చేపట్టనున్నది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు ఎకె సిక్రి, ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్, ఆశోక్‌భూషణ్ సభ్యులుగా ఉంటారు. 2013,భూసేకరణ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం భూమిని కోల్పోయే బాధితులకు ప్రభుత్వం తగిన పరిహారం, పునరావాసం కల్పించాలి. అయితే, ఈ చట్టాన్ని ఏవిధంగా అమలు చేయాలనే విషయంలో సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు సభ్యుల వేర్వేరు ధర్మాసనాలు వేర్వేరు తీర్పులివ్వడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 21న జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు ఈ అంశానికి సంబంధించి ఓ కేసు వచ్చింది. ఫిబ్రవరి 8న అదే అంశంపై ముగ్గురు సభ్యుల మరో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అది పుణె మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు. ఫిబ్రవరి 8 తీర్పు ప్రకారం నిర్ణీత ఐదేండ్ల గడువులోగా భూయజమానులు ఏవైనా కారణాలు చూపి పరిహారం తీసుకోనంత మాత్రాన భూసేకరణ రద్దు కాదు. ఇదే అంశంపై 2014లో సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు సభ్యుల మరో ధర్మాసనం ఇందుకు విరుద్ధంగా తీర్పు ఇచ్చింది. భూయజమానులకు పరిహారం అందించని పక్షంలో భూసేకరణ భేషరతుగా రద్దవుతుందన్నది ఈ తీర్పు సారాంశం. దాంతో, ఈ రెండు తీర్పులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని భావించిన జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసింది. అత్యున్నత న్యాయస్థానం న్యాయ క్రమశిక్షణ పాటించాలని, సాధికారతను కాపాడుకోవాలని, లేదంటే ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఈ సందర్భంగా జస్లిస్ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది తీర్పు ఇచ్చే వరకూ భూసేకరణ చట్టంలోని సెక్షన్ 24కు సంబంధించిన కేసులను హైకోర్టులు చేపట్టవద్దని సుప్రీం ధర్మాసనం సూచించింది. దీనిపై తుదపరి విచారణను జస్టిస్ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం మార్చి 7కు వాయిదా వేయగా, ఈలోగానే(మార్చి 6న) రాజ్యాంగ ధర్మాసనం విచారణ ప్రారంభించనున్న విషయం గమనార్హం. ఫిబ్రవరి 22న ఇలాంటిదే మరో కేసు ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనం ముందుకు రాగా, దానిని తగిన ధర్మాసనానికి బదలాయించాలంటూ చీఫ్ జస్టిస్‌కు మరో సిఫారసు కూడా అందింది.

ముంబయిలో పనిచేసే విదేశీయులకు ప్రపంచంలోనే అత్యధిక జీతాలు

హెచ్‌ఎస్‌బిసి నివేదిక



న్యూఢిల్లీ : ముంబయిలో పనిచేస్తున్న విదేశీయులకు ప్రపంచంలోనే అత్యధిక వేతనాలు లభిస్తున్నట్లు హెచ్‌ఎస్‌బిసి నివేదిక వెల్లడించింది. భారత దేశ ఆర్థిక రాజధానిగా పేరు గాంచిన ముంబయిలో విదేశీయులకు సగటున ఏడాదికి 2,17,165 డాలర్లు (రూ. 1.4 కోట్లు) వేతనంగా లభిస్తుందని, ఇది ప్రపంచ సగటు 99,903 డాలర్లు (రూ. 64 లక్షలు) కంటే రెండింతలు ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 52 నగరాల్లో ఈ సర్వే నిర్వహించారు. ముంబయి తరువాత శాన్‌ఫ్రాన్సిస్కోలో విదేశీయులకు ఎక్కువ వేతనాలు (2,07,227 డాలర్లు, రూ. 1.34 కోట్లు) లభిస్తున్నాయి. ఈ జాబితాలో తొలి పది స్థానాల్లో మూడు ఆసియా నగరాలు షాంఘై, జకారా, హాంగ్‌కాంగ్ చోటు దక్కించుకున్నాయి.

సర్వే చేసిన 31 నగరాల్లో ప్రపంచ సగటు కంటే ఎక్కువ వేతనాలు లభిస్తుండగా, మిగిలిన 21 నగరాల్లో ప్రపంచ సగటు కంటే తక్కువ వేతనాలు లభిస్తున్నాయి. ఈ జాబితాలో ఎడిబర్గ్ నగరం చివరిస్థానంలో ఉంది. ఇక్కడ 56,250 డాలర్లు (రూ. 36 లక్షలు) వేతనం లభిస్తుంది. కాగా, విదేశీయులకు ఉద్యోగాల కల్పనలో మిగిలిన ఆసియా నగరాలతో పోలిస్తే ముంబయి చివరి స్థానంలో ఉంది. అలాగే విదేశీ ఉద్యోగార్ధులకు అమెరికా, బ్రిటన్‌లలోని నగరాలు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయని నివేదిక తెలిపింది. తమ కెరీర్ తదుపరి దశకు చేరుకోవడానికి ఈ నగరాలు అనుకూలంగా ఉంటాయని వారు భావిస్తారని నివేదిక పేర్కొంది.

త్వరలో అమర్త్యసేన్‌పై డాక్యుమెంటరీ విడుదల

కోల్‌కతా : నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌పై తీసిన డాక్యుమెంటరీని మార్చి 9 తరువాత విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ సుమన్ ఘోష్ సోమవారం తెలిపారు. సెన్సార్ బోర్డు సిఫార్సు చేసిన విధంగా డాక్యుమెంటరీలో వచ్చే 'గుజరాత్'పదంపై 'బీప్' ఇచ్చిన తరువాత డాక్యుమెంటరీని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అమర్త్యసేన్‌పై రూపొందించిన డాక్యుమెంటరీ 60 నిముషాలు నిడివి కలిగి ఉంటుందన్నారు. డాక్యుమెంటరీలో ఉపయోగించిన 9 పదాలను తొలగించాలని కోల్‌కతాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) పేర్కొనగా, చివరకు ముంబయి కోర్టు 'గుజరాత్' అనే ఒక్క పదంపై బీప్ ఇవ్వాలని జులై 11, 2017న వెల్లడించిందని ఘోష్ తెలిపారు. కొంతమంది మిత్రులతో కలిసి 2002–2003 మధ్యకాలంలో అమర్త్యసేన్‌పై డాక్యుమెంటరీ చిత్రీకరణ ప్రారంభించామని, భారత్‌తోపాటు బ్రిటన్, అమెరికాలలో చిత్రీకరించినట్లు ఆయన తెలిపారు. 2017లో డాక్యుమెంటరీ చిత్రీకరణను పూర్తిచేసినట్లుచెప్పారు. ఈ డాక్యుమెంటరీకి గత ఏడాది జులైలో సెన్సార్ నుంచి ఇబ్బందులుఎదురయ్యాయని చెప్పారు.

గుజరాత్, ఇన్ ఇండియా, హిందూ, గోవు, ఈ రోజుల్లో హిందుత్వ అనే పదాలను తొలగించి 'యు' సర్టిఫికెట్ పొందవచ్చునని కోల్‌కతాలోని సెన్సార్ బోర్డు తెలిపింది. ఒకానొక దశలో దీనిపై తన పోరాట తీవ్రత తగ్గిపోయిందని ఆయన చెప్పారు. కాని దేశ వ్యాప్తంగా మీడియా మద్దతుతో పోరాటాన్ని బలోపేతం చేసినట్లు చెప్పారు. ఫలితంగా సినిమా విడుదలకు సిద్ధమైందన్నారు. ఈ సందర్భంగా మీడియాకు, సిబిఎఫ్‌సి చీఫ్ ప్రసూన్ జోషికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేకం

జెఎన్‌యూ పేదల పట్ల సానుభూతిని నేర్పింది

పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవంలో గుజరాత్ చీఫ్ సెక్రటరి



అహ్మదాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (జెఎన్‌యు) పూర్వ విద్యార్థిగా తాను ఎంతో గర్వ పడుతున్నానని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జెఎన్ సింగ్ అన్నారు. జెఎన్‌యు మేథో స్వేచ్ఛనిస్తోందని తెలిపారు. ఆ స్వేచ్ఛ లెఫ్ట్, రైట్ సిద్ధాంతాలకు సంబంధించినది కాదని, పేదల పట్ల సానుభూతి కలిగి ఉండటాన్ని జెఎన్‌యు బోధిస్తోందని, ఏ ప్రభుత్వమైనా ఇష్టపడేది అదేనని ఆయన అన్నారు. జెఎన్‌యూ పూర్వ విద్యార్థుల సంఘం(ఎఎజె), గుజరాత్ చాప్టర్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులతో కొది సేపు ముచ్చటించారు. జెఎన్‌యులో తాను 1979–1982 మధ్యకాలంలో ఇంటర్నేషనల్ స్టడీస్‌లో విద్యను అభ్యసించినట్లు ఆయన చెప్పారు. జెఎన్‌యు మేథోపరంగాను, అంతర్గతంగాను ఎన్నో అవకాశాలను కల్పిస్తోందన్నారు. అందువల్లే మానవ వనరుల మంత్రిత్వ శాఖ (హెచ్‌ఆర్‌డి) జెఎన్‌యుకు దేశంలో రెండో ర్యాంక్ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఎస్సెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) జెఎన్‌యుకు ఎ++ ర్యాంక్ ఇవ్వడాన్ని ఆయన ప్రస్తావించారు. అడిషనల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ ప్రసాద్ మాట్లాడుతూ తాను కూడా జెఎన్‌యు పూర్వ విద్యార్థినేనని చెప్పారు. తనకు ప్రశ్నించడాన్ని, హేతుబద్ధంగా ఆలోచించడాన్ని విశ్వవిద్యాలయం నేర్పిందన్నారు. జెఎన్‌యులో విద్యనభ్యసించడం తన జీవితంలో చేసిన మంచి పని అని డిజిపి మోహన్ ఝా అన్నారు. ఇక్కడ విద్యనభ్యసించడం వల్ల తన మేధస్సు వికసించిందని అన్నారు. రెండేళ్ళ కాలంలో రెండు సార్లు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవంలో 25 మంది పాల్గొన్నారు. గుజరాత్ సెంట్రల్‌యూనివర్సిటి (సియుజి), పిడిపియు, గుజరాత్ యూనివర్సిటికి చెందిన పలువురు ప్రొఫెసర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించాలని గుజరాత్ కేడర్‌కుచెందిన ఐపిఎస్ అధికారి, కె.కె. ఓఝా తెలిపారు. ప్రస్తుతం ఆయన అడిషనల్ డిజిపిగా పనిచేస్తున్నారు. ఇంటి పేర్లను రద్దుచేసే వ్యవస్థ గురించి ఆలోచించాల్సి ఉందని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు సంబంధించి కొత్త కమిటీని ఎన్నుకున్నారు.రెవెన్యూ సర్వీసెస్‌కు చెందిన ముండ్రా, డెవలప్‌మెంట్‌కమిషనర్ అమియా చంద్రా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అడిషనల్ చీఫ్ సెక్రటరి సంగీతా సింగ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

కేంద్ర క్యాబినేట్ మాజీ కార్యదర్శి టిఎస్‌ఆర్ సుబ్రమణియన్ మృతి

న్యూఢిల్లీ : కేంద్ర క్యాబినేట్ మాజీ కార్యదర్శి టిఎస్‌ఆర్ సుబ్రమణియన్ (79) సోమవారం మృతి చెందారు. సుబ్రమణియన్ మృతిపై ఐఎఎస్ అధికారుల సంఘం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. " సుబ్రమణియన్ మృతి చెందారనే విషాద వార్త తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన మృతి ఐఎఎస్ సోదరులకు, దేశానికి తీవ్ర లోటు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. ఆయన ఆలోచనలు, భావాలు మాకు మార్గనిర్దేశకత్వం చేస్తామని మేము విశ్వసిస్తున్నాం' అని ఐఎఎస్‌ల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. 1996 ఆగష్టు 1 నుంచి 1998 మార్చి 31 వరకూ ఆయన కేంద్ర క్యాబినేట్ కార్యదర్శిగా పనిచేశారు. సుబ్రమణియన్ మృతిపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, ఇతర సీనియర్ అధికారులు సంతాపం తెలిపారు.

యాక్సిడెంట్ కేసులో బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్

పాట్నా: తొమ్మిది మంది విద్యార్థులను పొట్టనబెట్టుకున్న బీహార్‌లోని ముజఫర్‌పుర్ రోడ్డు యాక్సిడెంట్ కేసులో బీజేపీ నేత మనోజ్ బైతాపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం నాడు విద్యార్థులపైకి బొలెరో కారు దూసుకెళ్లినప్పుడు మనోజ్ బైతానే డ్రైవింగ్ చేస్తున్నాడని, ఆ కారూ ఆయన పేరు మీదే రిజిస్టరై ఉన్నదని పోలీసులు సోమవారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసే ప్రక్రియను ముమ్మరం చేస్తున్నామని, దర్యాప్తు మొదలు పెట్టామని పోలీసులు వెల్లడించారు. కారులో నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ప్రమాద స్థలానికి 35 కిలోమీటర్ల దూరంలోని టోల్‌టాక్స్ వద్దనున్న సీసీటీవీలో మనోజ్ బైతా కారు నడుపుతున్నట్టు రికార్డ్ అయిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆర్జేడీ నాయకులు రాష్ట్ర అసెంబ్లీ బయట ధర్నా చేశారు. నిందితుడు ఏ పార్టీకి చెందినవాడైనా ఉపేక్షించబోమని బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ సోమవారం స్పష్టం చేశారు.

బ్రిటన్ అగ్ని ప్రమాదంలో నలుగురు మృతి

లండన్ : సెంట్రల్ ఇంగ్లండ్ నగరమైన లీసెస్టర్‌లో మూడంతస్తుల భవనంలో సంభవించిన పేలుడు, అగ్ని ప్రమాదంలో నలుగురు మరణించారని పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారని లీసెస్టర్‌షైర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. తీవ్రవాద దుశ్చర్య వల్లే పేలుడు సంభవించిందనడానికి ఎలాంటి సంకేతాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను ఇంకా నిర్ధారించాల్సి వుంది. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపకయంత్రాలు రాత్రంతా కృషి చేస్తూనే వున్నాయి. ఈ మంటలు భవనమంతా వ్యాపించాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.



ముగింపు

ప్యోంగ్‌చాంగ్‌లో జరిగిన వింటర్ ఒలింపిక్స్ ముగింపు ఉత్సవానికి హాజరైన ఇవాంకా ట్రంప్ దక్షిణకొరియా జనరల్‌తో కలిసి ఉత్తర, దక్షిణకొరియా క్రీడాకారుల మార్చింగ్‌ను తిలకించారు.

చైనా రాజ్యాంగానికి సవరణలు

సోషలిజంపై జిన్‌పింగ్ ఆలోచనలు పొందుపరచాలి

చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదన

బీజింగ్ : చైనా రాజ్యాంగానికి సవరణలు చేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) కేంద్ర కమిటీ ఆదివారం ప్రతిపాదించింది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) స్థాయీ సంఘం సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదన చేశారు. కొత్తగా తలెత్తిన పరిస్థితులకు అనుగుణంగా, కొత్త శకంలో చైనా లక్షణాలతో కూడిన సోషలిజాన్ని పరిరక్షించడం, అభివృద్ధిపరచడంలో భాగంగా ఈ ప్రతిపాదన చేసినట్లు స్థాయీ సంఘం తెలిపింది. చైనా సోషలిజంపై జీ జిన్‌పింగ్ ఆలోచనా సరళిని కూడా రాజ్యాంగంలో పొందుపరచాలని సిపిసి కేంద్ర కమిటీ ప్రతిపాదించింది. అభివృద్ధిపై శాస్త్రీయ దృక్పథాన్ని కూడా చేర్చాలని పేర్కొంది. ఈ ప్రతిపాదన ప్రకారం, సిపిసి నాయకత్వంలో, మార్క్సిజం-లెనినిజం మార్గదర్శకత్వంలో, మావో జెడాంగ్ ఆలోచనలు, డెంగ్ గ్జియావోపింగ్ సిద్ధాంతాలు, అభివృద్ధిపై శాస్త్రీయ దృక్పథంతో, నూతన శకంలో చైనా లక్షణాలతో కూడిన సోషలిజంపై జీ జిన్‌పింగ్ ఆలోచనలకు, సోషలిస్టు పంథాకు కట్టుబడి వుండాలి. సంస్కరణలను అమలు చేయాలన్న పట్టుదల, ధృఢ సంకల్పం, ప్రపంచ దేశాలకు ద్వారాలు తెరవడం, సోషలిస్టు సంస్థలను నిలకడగా అభివృద్ధిపరచడం, సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయడం, సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని, సోషలిస్టు చట్ట పాలనను మెరుగుపరచడం, కష్టించి పనిచేయడం, స్వయం సమృద్ధి సాధించడం, దేశ పారిశ్రామిక రంగాన్ని ఆధునీకరించడానికి చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు.

ట్రంప్ ప్రతిపాదనల్ని తోసిపుచ్చిన ఎన్‌ఆర్‌ఎ



వాషింగ్టన్ : ఫ్లోరిడాలోని పాఠశాలలో జరిగిన కాల్పుల అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కొంత మంది రిపబ్లికన్‌లు సంయుక్తంగా తుపాకీ చట్టాలను మార్చడానికి చేసిన ప్రతిపాదనను నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్‌ఆర్‌ఎ) ఆదివారం వ్యతిరేకించింది. కొన్ని రకాల తుపాకీలను కొనుగోలు చేయడానికి వయస్సు పరిమితిని పెంపొందించడానికి, సెమీ ఆటోమేటిక్ రైఫిల్స్‌ను అనుమతించే బంప్ స్లాక్స్ నిషేధించడం వంటి ప్రతిపాదనలు ఎన్‌ఆర్‌ఎ తోసిపుచ్చింది.



110 మంది బాలికల అదృశ్య వార్తలు నిజమే

నైజీరియా ప్రభుత్వం

అబుజా : ఈశాన్య ప్రాంతంలోని ఒక స్కూలుపై బోకోహారం తీవ్రవా దులు దాడి చేసిన తర్వాత 110 మంది బాలికలు అదృశ్యమయ్యారని నైజీరియా ప్రభుత్వం ఆదివారం నిర్ధారించింది. ఈ సంఘటనపై రోజుల తరబడి మౌనం పాటించిన ప్రభుత్వం ఎట్టకేలకు నోరు విప్పింది. యోబె రాష్ట్రంలోని దాప్చిలో ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నికల్ కాలేజీకి చెందిన 110మంది విద్యార్థినులు దాడి తర్వాత కనబడకుండా పోయారని ఫెడరల్ ప్రభుత్వం ధృవీకరించిందని సమాచార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం స్కూల్లో 906మంది విద్యార్థులుండగా దాడి జరిగిన తర్వాత నుండి 110మంది కనబడటం లేదు. వీరు కిడ్నాప్ అయివుంటారన్న అనుమానాలు తలెత్తాయి. 2014లో కూడా ఇలాగే చిబాక్ ప్రాంతంలో 200 మందికిపైగా విద్యార్థినులు అపహరణకు గురయ్యారు. ఆ సంఘటన ఆనాడు యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రస్తుతం బాలికల అదృశ్యం కేసు ఆనాటి సంఘటనను గుర్తుకు తెస్తోంది. గత సోమవారం రాత్రి బోకోహారం తీవ్రవాదులు దాడి చేసిన సమయంలో భయంతో విద్యార్థినులు బోర్డింగ్ స్కూలు నుండి పారిపోయారు. తొలుత కిడ్నాప్ జరగలేదని అధికారులు పేర్కొన్నప్పటికీ శుక్రవారం అధ్యక్షుడు బుహారీ బాధిత బాలికల కుటుంబాలకు క్షమాపణ చెప్పారు. ఇదొక జాతీయ విపత్తు అని వ్యాఖ్యానించారు.

ఆంక్షలకు దీటుగా స్పందిస్తాం

హెచ్చరించిన ఉత్తర కొరియా



ప్యోంగాంగ్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 23న హెచ్చరించినట్లుగా నౌకలు, వాణిజ్య సంస్థలపై నిషేధం, మరిన్ని ఆంక్షలను విధించినట్టైతే తమదైన రీతిలో ప్రతిస్పందన వుంటుందని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటన జారీ చేస్తూ, దక్షిణ కొరియా సహకారం, ఉత్తర కొరియా కృషి వల్ల వింటర్ ఒలింపిక్స్ క్రీడలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు.

ఈ ఏడాది ప్రారంభం నుండి ఉభయ కొరియాల మధ్య అవగాహనా క్రమం ప్రారంభమైందని చెప్పారు. ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్ ముగుస్తున్న తరుణంలో ఉత్తర కొరియాపై ఆంక్షలను విధించడం ద్వారా కొరియా ద్వీపకల్పంపై యుద్ధ మేఘాలు తారట్లాడేలా అమెరికా ఉన్మాదంగా ప్రవర్తిస్తోందని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. ఉత్తర కొరియాపై తీవ్ర ఆంక్షలను ఈ నెల 23న ట్రంప్ ప్రకటించారు. 56 నౌకలు, వాణిజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలను విధించారు. ఇతర దేశాలతో ఉత్తర కొరియా వాణిజ్యాన్ని పూర్తిగా నిషేధించడమే ఈ ఆంక్షల ప్రధాన లక్ష్యంగా వుంది.

ఏ తరహా ఆంక్షలను విధించినా దాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని ఉత్తర కొరియా ఇప్పటికే పలుసార్లు హెచ్చరించింది. ఉభయ కొరియాల మధ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు, కొరియా ద్వీపకల్పంలో శాంతి, సుస్థిరతలను పరిరక్షించేందుకు తాము నిజాయితీగా చేస్తున్న కృషిని అమెరికా నిర్లక్ష్యం చేసినట్టైతే కచ్చితంగా తాము అనుకున్న రీతిలో స్పందిస్తామని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. ఉద్రిక్తతలు చెలరేగినట్టైతే తలెత్తే పర్యవసానాలకు అమెరికానే కారణమని హెచ్చరించారు.

చర్చలకు ఉత్తర కొరియా సుముఖమే

వెల్లడించిన దక్షిణ కొరియా

సియోల్ : అమెరికాతో చర్చలు జరిపేందుకు ఉత్తర కొరియా సుముఖంగానే వుందని దక్షిణ కొరియా తెలిపింది. ప్యాంగ్‌చాంగ్‌లోని వింటర్ ఒలింపిక్స్ ముగింపు ఉత్సవాల్లో పాల్గొనేందుకు జనరల్ కిమ్ యాంగ్ చోల్ నేతృత్వంలోని ఉత్తరకొరియా ప్రతినిధి బృందం క్రీడల ముగింపునకు ముందుగానే దక్షిణ కొరియా ప్రతినిధి బృందాన్ని కలిశారు. అయితే ఏ చర్యలకైనా అంతిమ లక్ష్యం అణు నిరాయుధీకరణే అని అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.చర్చలు జరిపేందుకు సిద్ధమంటూ ప్యాంగాంగ్ సమాచారం ఇస్తే అది మొదటి చర్యగా పరిగణిస్తామని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే చర్చలు జరిపే అవకాశాన్ని ఉత్తర కొరియా ఇంకా ధృవీకరించలేదు. కానీ, ఎలాంటి ముందు షరతులు లేకుండా చర్చలకు సిద్ధమేనని తెలిపింది. ముగింపు ఉత్సవాలకు ట్రంప్ కుమార్తె ఇవాంకా హాజరయ్యారు. ఒలింపిక్ స్టేడియంలో జనరల్ కిమ్‌కు కొద్ది అడుగుల దూరంలోనే ఇవాంకా కూర్చున్నప్పటికీ ఉత్తర కొరియన్లు ఎవరితోనూ ఆమె మాట్లాడలేదు. ఒలింపిక్స్ సందర్భంగా అమెరికా, ఉత్తర కొరియా ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని దక్షిణ కొరియా భావించింది. కానీ అమలు కాలేదు.



ఖలీదా జియాకు బెయిల్ మంజూరు

ఢాకా : బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధ్యక్షురాలు, మాజీ ప్రధాని ఖలీదా జియా బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. దిగువ కోర్టు నుంచి అవసరమైన పత్రాలు అందిన తరువాతే పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఖలీదా జియా మూడు సార్లు ప్రధాన మంత్రి పదవిని నిర్వహించారు. అవినీతి ఆరోపణలపై ఢాకా ప్రత్యేక కోర్టు ఫిబ్రవరి 8న ఐదేళ్ళ జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. జియా అనాథ ఆశ్రమం పేరిట విదేశాల నుంచి అందిన విరాళాలలో 21 మిలియన్ టాకాలు (దాదాపు 25 వేల అమెరికన్ డాలర్లు)ను స్వాహా చేశారన్న ఆరోపణలను ఆమె ఎదుర్కొంటున్నారు. ఖలీదా జియా తన భర్త జియార్ రహమాన్ పేరుమీద అనాధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. మరో రెండు వారాల్లో సంబంధిత పత్రాలు హై కోర్టుకు చేరతాయని, అప్పుడు కేసు విచారణ చేపడతామని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

సిడ్నీలో తీవ్ర భూకంపం

సిడ్ని (ఆస్ట్రేలియా) : సిడ్నీలోని పుపువా న్యూ గినియా ప్రాంతంలో సోమవారం ఉదయం 7.5 తీవ్రతతో భూకంపం సంభవించిందని అమెరికా భూకంపపరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే సునామీ హెచ్చరికలు మాత్రం జారీ చేయలేదని చెప్పారు. ఎంగా ప్రావిన్స్‌లోని పొర్గెరాకు దక్షిణంగా 90 కిలోమీటర్ల దూరంలో 35 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రీకృతమై ఉందని అమెరికాకు చెందిన భూగర్భ సర్వే సంస్థ (యుఎస్‌జిఎస్) తెలిపింది.. భూ కంపం నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశముందని యుఎస్‌జిఎస్ హెచ్చరించింది.

మొదటి పేజీ తరువాయి

మేఘాలయ, నాగాలాండ్ 'పోలింగ్' నేడే

ప్రచారాన్ని ముమ్మరంగా సాగించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఎంపి శశి థరూర్ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండు రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయలలో కాంగ్రెస్ 59 మంది అభ్యర్థులను ప్రకటించగా, బిజెపి తరుపున 47మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. మేఘాలయలో లోక్‌సభ మాజీ స్పీకర్ పిఎ. సంగ్మా కుమారుడు ఎ. సంగ్మా పార్టీ అయిన (నార్త్ ఈస్ట్ డెమక్రటిక్ అలయన్స్) (ఎన్‌ఇడిఎ)తో, నాగాలాండ్‌లో ఎన్‌డిపిపిపార్టీతో బిజెపి చేతులు కలిపింది. మేఘాలయలో 370 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, 3,083 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 18.4 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మేఘాలయలో 32మంది మహిళా అభ్యర్థులు పోటీ చేస్తుండగా, నాగాలాండ్‌లో ఐదుగురు మహిళా అభ్యర్థులు పోటీ చేయనుండటం విశేషం. నాగాలాండ్‌లో 2,156 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేకంగా 67 మహిళా పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి ఎఫ్ఆర్.ఖార్కొంగర్ తెలిపారు. 40 నియోజకవర్గాలలో ఎన్‌డిపిపి (నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ) పోటీ చేస్తుండగా, బిజెపి 20 స్థానాలలో పోటీ చేస్తుంది.

మోడల్ సిటీగా అమరావతి

'రియల్ టైం గవర్నన్స్' అని, అందుకు బ్యూరోక్రాట్లను సిద్ధం చేశానని అన్నారు. ప్రపంచంలో సింగపూర్ కన్సోర్టియం మన రాష్ట్రానికి ఎంతగానో సాయం అందజేస్తుందని, అమరావతి నిర్మాణంలో అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని తెలిపారు. ఈ సదస్సుల్లో జపాన్, సౌత్ కొరియా, సింగపూర్, రష్యా దేశాల నుంచి అనుభవజ్ఞులైన ప్రతినిధులు హాజరై ఎంఒయులకు తోడ్పాటునందించారన్నారు. సదస్సులు ముగిసిన మరుసటి రోజు నుంచే ఎంఒయుల అమలుకు కృషిచేస్తానన్నారు. అనంతపురంలో ఆటోమొబైల్ ఇండస్ట్రీని స్థాపిస్తున్నామని, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విశాఖలో ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫింటెక్ వ్యాలీ)ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులకు రిలయన్స్, టెక్ మహీంద్రా, లూలూ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రావడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు.

రిలయన్స్ ఎంఒయు రూ.30వేల కోట్లు

రిలయన్స్ ఎంఒయు రూ.30వేల కోట్లతో జరిగిందని, ఆదానీ భావనపాడు పోర్టును అభివృద్ధి చేసేందుకు అంగీకరించారని చంద్రబాబు చెప్పారు. త్వరలో వీటిని కేంద్ర కేబినెట్ ముందు పెట్టి కమిటీ ఆమోదించాక టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చంద్రబాబు వేదికపై వివరించారు. లూలూ షాపింగ్ మాల్‌తో విశాఖ 'లుక్' మారనుందని, వచ్చే ఏడాదికే అంతా సిద్ధమవుతుందని అన్నారు. అపోలో, హెచ్‌ఎస్‌బిసి, గూగుల్ ఇంకా అనేక ఎంఒయులు జరిగాయన్నారు. తిరుపతిలో 1 మిలియన్ సెల్‌ఫోన్ల ఉత్పత్తిని ప్రారంభించనున్నారని, త్వరలో ఇన్నోవేషన్, ఇంకుబేషన్ సెంటర్లను ప్రారంభిస్తామని అన్నారు. భవిష్యత్‌లో ఏ ఆవిష్కరణ జరిగినా ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మీద నుంచే జరగాలన్న నిర్ణయానికి పారిశ్రామిక వేత్తలంతా వస్తారని చంద్రబాబు చెప్పారు. ముగింపుసభలో రష్యా ప్రతినిధి వోల్గా కొలికోవా, మారిషస్ దేశ ఉపాధ్యక్షులు పరమేశ్వరం పిళ్ళై, సింగపూర్ మంత్రి ఈశ్వరన్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు పాల్గొన్నారు.

అరకొరగా గిరిజనాభ్యుదయం

రూ. 58 కోట్లు కేటాయిస్తే రూ. 4 కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ. 20 కోట్లు కేటాయిస్తే రూ. 4 కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ. 58 కోట్లు కేటాయిస్తే రూ. 12 కోట్లు, ఇంటర్ విద్యకు రూ. 7 కోట్లకు రూ. 61 లక్షలు ఖర్చు చేయగా, సాంస్కృతిక శాఖకు రూ. 1.70 కోట్లు కేటాయిస్తే కేవలం రూ. 11లక్షలే ఖర్చు చేయడం విశేషం. అటవీ, పౌరసరఫరాలు, గృహనిర్మాణం, స్కిల్‌డెవలప్‌మెంట్, యూత్ సర్వీసెస్ వంటి పలు ముఖ్య శాఖలకు కేటాయించిన నిధుల్లో 50 శాతం కంటే మించి ఖర్చు చేయలేదు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ. 25 కోట్లు కేటాయిస్తే రూ. 9 కోట్లు, యూత్ సర్వీసెస్‌కు రూ. 51.75 కోట్లు కేటాయిస్తే రూ. 16 కోట్లు, అటవీ శాఖకు రూ. 6 కోట్లు కేటాయిస్తే రూ. 2 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం గృహనిర్మాణం కోసం కేటాయించిన రూ. 236.66 కోట్లలో రూ. 127 కోట్లు ఖర్చు చేసి చేతులు దులుపుకొంది. హార్టీకల్చర్, వయోజన విద్య, వికలాంగుల సంక్షేమం, తదితర శాఖల ద్వారా మాత్రే నూరు శాతం నిధులు ఖర్చు చేశారు. ఆయుష్మ, శాప్, ఇరిగేషన్, మెడికల్ ఎడ్యుకేషన్ వంటి శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి ప్రతిపాదనలే రూపొందించలేదని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ అనుబంధ శాఖలకు తొలుత కేటాయించిన నిధుల కంటే భారీగా పెంచడం గమనార్హం. ఒక గ్రామీణాభివృద్ధి విభాగానికే రూ. 1,000 కోట్లు కేటాయించడం విశేషం.

లోక్‌పాల్‌ను ఎందుకు నియిమంచలేదు

(మొదటి పేజీ తరువాయి)

జరిగితే మోడీ మాట్లాడలేదని అన్నారు. అలాగే జిఎస్‌టిని గబ్బర్ సింగ్ ట్యాక్స్‌గా వర్ణించిన రాహుల్ దీనివల్ల చిన్న వ్యాపారాలు మూత పడ్డాయని, లక్షలమంది ప్రజలు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కాని ఒక వ్యక్తి కొడుకు వ్యాపారాలు మాత్రం 50 వేల నుండి రూ.80 కోట్లకు చేరుకుంటున్నాయని అమిత్ షా కుమారుడు జైషా గురించి తెలిపారు. ఉపాధి కల్పన చేస్తామన్నారని, రుణమాఫీ చేస్తామన్నారని, ప్రధాని అవేమీ చేయలేదని, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నుండి వాటిని మోడీ నేర్చుకోవాలని ఆయన తెలిపారు. నీరవ్ మోడీ వంటి వ్యక్తులకు, సూపర్‌రిచ్‌లకు లబ్ది కలిగిస్తున్న మోడీ ఆ మొత్తంతో కర్నాటకలో ఉన్న పేదలకు ఉచితంగా ఏడు కిలోల బియ్యం ఇవ్వొచ్చని ఆయన అన్నారు.

పేదలకు అందని విదేశీ విద్య

ఉమ్మడి వేదికతో లక్ష్యాల సాధనకు గండి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో పేర్లు వేర్వేరుగా ఉన్నా ఒకే తరహాలో ఉండే పథకాలన్నింటినీ ఒకే వేదిక (కామన్ ప్లాట్‌ఫారం) ద్వారా అమలు చేయడం వల్ల లక్ష్యాలు నీరుగారుతున్నాయని ఆయా శాఖల అధికారులు అభిప్రాయపడుతున్నారు. వేర్వేరు సామాజిక, ఆర్థిక అసమానతలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన సంక్షేమ శాఖలను ఉమ్మడి వేదిక మీదికి తెచ్చి, భావసారూప్యతగల పథకాలను అమలు చేయడం వల్ల ఆయా వర్గాలవారికి తగిన న్యాయం చేసే వీలుండటం లేదని వారు పేర్కొంటున్నారు. వివిధ సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న వాటిలో ఉపకార వేతనాలు, విదేశీ విద్య వంటి పథకాలను ప్రస్తుతానికి ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. పెళ్లి కానుక పథకాన్నీ ఈ జాబితాలోకే తేవాలనుకుంటున్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ఉద్దేశించిన విదేశీ విద్యా పథకాన్నే ఒక ఉదాహరణగా పరిశీలిస్తే.. ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లే వారికి అక్కడి ట్యూషన్ ఫీజులు, విదేశాలకు వెళ్లేందుకు వీసా, విమాన ప్రయాణ ఖర్చులూ ఒక్కో విద్యార్థికీ రూ.10 లక్షలు ప్రభుత్వ పరంగా చెల్లిస్తున్నారు. మరో రూ. 5 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణ సహాయమూ అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రభుత్వం అనుమతించిన 15 దేశాల్లో ఫీజుల రేట్లు భారీగా తేడాలుంటున్నాయి. అవి కోర్సులను బట్టి మారుతుంటాయి. అందువల్ల ప్రభుత్వం ఇచ్చే ట్యూషన్ ఫీజుల మొత్తం ఆయా కోర్సులను బట్టి కొన్ని దేశాలైతేనే సరిపోతున్నాయి. జర్మనీ, యుకె వంటి యూరప్ దేశాలతో పాటు అమెరికాలోని ప్రఖ్యాత యూనివర్సిటీల్లో ఎంఎస్ చేయాలంటే రూ. 25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుంది అంటే ప్రభుత్వ సహాయానికి అదనంగా ఆ విద్యార్థి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు భరించాల్సి ఉంటుంది. దీంతో ఆ ఆర్థిక స్థోమత ఉన్న వాళ్లు మాత్రమే విదేశాలకు వెళ్లేందుకు సముఖత వ్యక్తం చేస్తున్నారు. ఆ స్థోమత లేని వారు ఈ పథకాలను వినియోగించుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యా పథకానికి నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరటం లేదు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల నుంచి ఏటా 1500 మంది విద్యార్థులను విదేశాలకు పంపాలని లక్ష్యంగా నిర్ణయించినా, ఈ లక్ష్యంలో 25 శాతం కూడా నెరవేరటం లేదు. ఇప్పటి వరకు దాదాపు 1143 మంది విదేశీ విద్యాపథకానికి పేర్లు నమోదు చేయించుకోగా, వారిలో సగం మందే విదేశాలకు వెళ్లగలిగారని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే సహాయానికి జతగా బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలోనూ విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. షూరిటీలడుగుతున్నారని షూరిటీలు అభ్యర్థులు వాపోతున్నారు. ఆ నేపథ్యంలో విదేశీ విద్యకు ఎంత వ్యయమైతే అంతా పూర్తిస్థాయిలో ప్రభుత్వం భరిస్తేనే లక్ష్యాలు నెరవేరగలవంటున్నారు. ఇందుకు భిన్నంగా అన్ని వర్గాల వారికీ కామన్ ప్లాట్‌పామ్ పేరిట ఒకే విధమైన ఫీజులంటే ఈ లక్ష్యాల సాధన మరింత నీరుగారగలదని అధికారులు విశ్లేషిస్తున్నారు.

అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

ముగిసిన తరువాత ఆయన పాస్‌పోర్టును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశం విడిచి వెళ్ళకూడదని ఆదేశించారు.

తరలింపు మరింత ఆలస్యం

శ్రీదేవి భౌతిక కాయాన్ని భారత్‌కు తీసుకురావడంలో మరింత జాప్యం నెలకొనే అవకాశం ఉంది. తొలుత సోమవారం సాయంత్రానికే భౌతిక కాయాన్ని ముంబాయికి తీసుకురావచ్చని భావించారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తిచేశారు. మంగళవారం ఉదయం ప్రజల సందర్శన కోసం ఉంచి, ఆ తరువాత అంత్యక్రియలు నిర్వహిస్తామని శ్రీదేవి కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో మంగళ వారం సాయంత్రానికి కూడా భౌతిక కాయాన్ని తరలించడంపై అనుమా నాలు నెలకొన్నాయి. మృత దేహాన్ని సోమవారం అప్పగించడం సాధ్యం కాదని పోలీస్ వర్గాలు స్పష్టం చేశాయి. శరీరాన్ని భద్రపరిచే ఎంబామింగ్ ప్రక్రియకు కూడా అభ్యంతరాలు తెలిపాయి. భారత కాన్సులేట్ నుండి మరిన్ని పత్రాలు అందాల్సిఉందని , అప్పటి వరకు మృత దేహాన్ని అప్పగించలేమని దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీడియాకు తెలిపారు.

ముంబాయిలో అభిమాన సందోహం

ముంబయిలోని బోని కపూర్ సోదరుడు నటుడు అనిల్ కపూర్ నివాసానికి పలువురు బాలీవుడ్ నటులు చేరుకున్నారు. శ్రీదేవి ఇద్దరు కుమార్తెలు ఖుషి, వర్ధమాన నటి జాహ్నవి అక్కడే ఉన్నారు. ఫరాఖాన్, ఫరాన్ అఖ్తర్, టాబు, సరోజ్‌ఖాన్, రేఖ, రాణి ముఖర్జీ, కరణ్ జోహార్, మనీష్ మల్హోత్రా, అనుపమ్ ఖేర్ తదితరులు శ్రీదేవి మృతికి నివాళులు అర్పించారు. శ్రీదేవికి నివాళులు అర్పించేందుకు పలు ప్రాంతాల నుండి అభిమానులు వెల్లువెత్తుతున్నందున అనిల్ కపూర్ నివాసం వద్ద పోలీసులు భద్రతను పెంచారు. అభిమానులను దూరంగా ఉంచేందుకు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు.శ్రీదేవి భౌతిక కాయాన్ని త్వరగా పంపించేందుకు ఇక్కడ స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నామని దుబాయ్‌లోని భారత దౌత్యాధికారి నవదీప్ సూరి మీడియాకు తెలిపారు. అబుదాబి రాజు షేక్ అల్ నహ్యాన్‌తో మాట్లాడామని అక్కడ జరగాల్సిన ప్రక్రియలు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారని, ఆమె భౌతిక కాయం అర్ధరాత్రికి ముంబయి చేరుకుంటుందని అనిల్ కపూర్ సన్నిహితులు మీడియాకు తెలిపారు.

కరెన్సీ రాదు

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వ్ బ్యాంకులకు లేఖలు రాశారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలు ఈ లేఖలోనే ప్రస్తావించారు. అయితే ఇప్పటివరకు ఆర్‌బిఐ నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదు. ఇలా ఆర్‌బిఐ స్పందించకపోవడానికిగల కారణాలు పరిశీలిస్తే కేవలం కొత్తగా నోట్ల ముద్రణపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆంక్షలే కారణంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది కన్నా ఈ ఏడాది నోట్ల ముద్రణను కనీసం 15 శాతం తగ్గించాలని కేంద్రం ఆర్‌బిఐకి సూచించినట్లు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. నోట్ల ముద్రణకు అయ్యే వ్యయం, దానిని దేశంలోని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు అయ్యే ఖర్చు, భద్రతా వ్యయం వంటివి కూడా ఆంక్షలకు కారణంగా ఉన్నట్లు చెబుతున్నారు. అందుకే పే గౌవ్ (ఆన్‌లైన్ లావాదేవీలు)కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం అన్ని రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇకపై అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారానే జరగాలని తేల్చి చెబుతోంది. దీనివల్ల నగదు వాడకం తగ్గుతుందని, అందుకే కరెన్సీ ముద్రణ కూడా కుదించాలని ఆర్‌బిఐకి సూచనలు చేసినట్లు తెలిసింది. ఇదే ఇప్పుడు రాష్ట్ర నగదు లావాదేవీలపైనా తీవ్ర ప్రభావాన్ని చూపించనుంది. కాగా, ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా పట్టణాల కన్నా పల్లెల్లో ప్రజలకు ఎక్కువ సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న కొనుగోళ్లు అధికంగా ఉంటాయని, వీటిని ఆన్‌లైన్ ఉపయోగం అంతగా సాధ్యం కాదని అధికారులు విశ్లేషిసున్నారు. ముందుగా గ్రామ స్థాయిలో రూపే కార్డులు, ఇ-పోస్ మిషన్ల వినియోగంపై దృష్టి సారించకపోతే నగదు కష్టాలు మరింతగా వేధిస్తాయని వారు స్పష్టం చేస్తున్నారు.

రూ.4,39,765 కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

సదస్సులో 734 ఎంఒయులు వచ్చాయి. ఈ పెట్టుబడుల విలువ రూ.4,39,765 కోట్లు కాగా, వీటిద్వారా 11,02,125 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఒక్క సిఐఐ సదస్సు మూడోరోజే 369 ఎంఒయులు, రూ.2.20లక్షల కోట్లకు పైబడి పెట్టుబడులు వచ్చాయి. 7.17 లక్షల మందికి ఉద్యోగావకాశాలకు ఒప్పందాలు కుదిరాయి. 50 దేశాల నుంచి 280 మంది విదేశీ ప్రతినిధులు విచ్చేయగా, దేశం నలుమూలల నుంచి 3,673 మంది హాజరయ్యారు. 30 మంది స్టూడెంట్లను కలిపి మొత్తం సిఐఐ సదస్సుల్లో 4,253 మంది పాల్గొన్నారు.

సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో వచ్చిన ఎంఒయులు, పెట్టుబడులు, ఉద్యోగాలు

డిపార్టుమెంట్	ఎంఒయు	పెట్టుబడి	ఉపాధి
ఈజ్ ఆఫ్ డూయింగ్	144	రూ.1,51,400	1,52,496
ఉపాధి హామీ	38	రూ.78,935	24,411
పరిశ్రమలు	129	రూ.58337	131,682
సిఆర్‌డిఎ	37	రూ.49,643	78,680
మౌలిక వసతులు	22	రూ.45,981	3,86,200
ఐటి, ఎలక్ట్రానిక్స్	75	రూ.30,050	1,30,343
మైన్స్	31	రూ.12,227	16,225
టూరిజం	49	రూ.5002	30,338
హెల్త్ అండ్ మెడికల్	25	రూ.5090	4750
ఫుడ్‌ప్రోసెసింగ్	165	రూ.3100	47000
ఎపిఎస్ఎస్‌డిసి	19	--	1,00,000
మొత్తం:	**734**	**రూ.4,39,765**	**11,02,125**

బొండా భూ కబ్జా కేసులో రెవెన్యూ అధికారుల విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కుమారుడు సురేంద్ర చిన్ననాటి నుంచి తనకు తెలిసిన వారేనన్నారు. వారి ఇంటిని తనఖా పెట్టుకో మని తన వద్దకు వచ్చారని తనకు అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో వాటి జోలికి వెళ్లలేదన్నారు. భూ కబ్జాలకు పాల్ప డటం తనకు అలవాటు లేదని చెప్పారు. తనెవ్వరినీ బెదిరించడంలేదన్నారు. స్వాతంత్ర్య సమర యోధుని మనవడు సురేష్ మాట్లాడుతూ ఈ భూ వివాదంపై 2016లోనే ఫిర్యాదు చేశామన్నారు. సివిల్ వివాదంలో ఉందని తెలిసి కూడా బొండా ఉమ డెవలప్‌మెంట్ డీల్ ఎలా కుదుర్చుకున్నాడని ప్రశ్నించారు. సిఐడి కేసు నమోదు చేసుకున్న తర్వాతే ఉమ డీల్ రద్దు చేసుకున్నారని చెప్పారు. తమ వెనుక ఎవరూ లేరన్న ఉద్దేశంతోనే ఆ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అన్ని వివరాలు ఫోర్‌మెన్ కమిటీ ముందుంచామన్నారు. విచారణలోనే అన్ని నిజాలు బయటపడతా యన్నారు. అయితే ఆరోపణలు వస్తున్న స్థలాన్ని తాను చట్టానికి లోబడే తీసుకున్నానని మాగంటి బాబు అన్నారు. సురేష్ 2016లో తన వద్దకు వచ్చి ఆ భూమి తనదేనన్నారని చెప్పారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపమంటే మాత్రం ఆ పని చేయకుండా సింగ్‌నగర్ పిఎస్‌లో కేసు పెట్టాడన్నారు. పిఎస్‌లోనే స్వయంగా రిజిస్ట్రార్ ఆ డాక్యుమెంట్లు పరిశీలించి అవి ఫోర్జరీవని తేల్చినట్లు చెప్పారు. కేవలం మస్తాన్‌కి, తనకు మధ్య మాత్రమే ఒప్పందం జరిగిందని, దీనిపై చట్ట ప్రకారమే పోరాడతానన్నారు. తనకు రామి రెడ్డి కోటేశ్వరరావు పరిచయమే లేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్త వాలేనని, ఆరోపించిన వారిపై చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటానన్నారు. విజయవాడ రాజరాజేశ్వరీపేట, పెనమలూరులో ప్రాంతాల్లో కూడా బొండా ఉమ భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. అయితే జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో జరుగుతున్న విచారణలో మాత్రం స్వాతంత్ర్య సమర యోధునికి సంబంధించిన ఫిర్యాదును మాత్రమే విచారిస్తున్నామని అధికారులు తెలిపారు. మిగిలిన వారి ఫిర్యాదులపై తర్వాత విచారణ చేపడతామన్నారు.

మనసును కలిచివేసింది



శ్రీదేవితో సుబ్బిరామిరెడ్డి, అనీల్ కపూర్, బోని కపూర్‌లు

'శ్రీదేవి' హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. నమ్మలేకపోతున్నాను. దాదాపుగా నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబానికి ఎంతో సన్నిహితురాలు, ఆప్తురాలు. ఎన్నో సినీ వేడుకలకు మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చేవారు. ఆమె మరణం భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటు. 'వేటగాడు, ప్రేమాభిషేకం, జగదేకవీరుడు అతిలోకసుందరి' వంటి ఎన్నో తెలుగు చిత్రాలు బాలీవుడ్‌లో యాష్ చోప్రా తాము రూపొందించిన 'చాందిని, అలాగే లమ్హే' చిత్రాలు శ్రీదేవి నటజీవితానికి ఎంతో వన్నె తెచ్చాయి. ఆమె కీర్తిని దశ,దిశలా వ్యాపింప చేశాయి. నిన్నగాక మొన్న 'మామ్'గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీదేవి హఠాత్తుగా మరణించడం అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఏదన్నా సన్నివేశం ఇస్తే ఇలా చేయాలా? అలా చేయాలా? అని రిహార్సల్స్ చేసుకోకుండా అలా పాత్రను అర్థం చేసుకుని సహజంగానే నటించేస్తారు. అందుకే శ్రీదేవి స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయాలేరని అంటుంటారు. అభిమానుల్లో ఆమెకున్న పేరు అంతా ఇంతా కాదు. 'బడి పంతులు' చిత్రంలో ఎన్టీఆర్ మనవరాలిగా చేసిన శ్రీదేవి.. ఆ తర్వాత ఆయన పక్కన హీరోయిన్‌గా అదరగొట్టేశారు. ఇక ఏఎన్నార్‌తో పలు చిత్రాల్లో నటించిన ఈ 'అతిలోక సుందరి' ఆ తర్వాతి కాలంలో నాగార్జునతో కూడా నటించడం గమనార్హం. నటనకు వయసు ప్రమాణికం కాదని అప్పట్లోనే తేల్చి చెప్పారు శ్రీదేవి. తన సినీ కెరీర్‌లో 250కు పైగా చిత్రాల్లో నటించిన ఆమె హఠాత్తుగా ఈలోకాన్ని విడిచి వెల్లడం అభిమానులను తీవ్రంగా కలిచివేస్తోందని పేర్కొన్నారు.

ప్రతిక్షణం సహకరించేవారు

శ్రీదేవితో మా తొలి చిత్రం 'క్షణక్షణం' తీయడం, ఆ చిత్రానికి తొలిసారిగా ఆమె ఉత్తమ నటిగా నందితో పాటూ ఫిలిం ఫేర్ అవార్డు కూడా అందుకోవడంతో చాలా సంతోషించాం. ఆ చిత్ర నిర్మాణంలో తానొక పెద్ద స్టార్ హీరోయిన్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సింపుల్‌గా ఉంటూ ప్రతిక్షణం ఎంతో సహకరించేవారు. ఆ సమయంలో వాళ్ళ నాన్నగారు దూరమై, మానసికంగా డిప్రెస్ అయినా కూడా షెడ్యూల్స్‌కి ఎలాంటి ఆటంకం లేకుండా సినిమా అనుకున్న టైమ్‌కి పూర్తవడానికి ఎంతో తోడ్పడ్డారు. అలాంటి గొప్ప అంకితభావం ఉన్న నటి దూరమవడం చాలా దురదృష్టకరం. ఆవిడ ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటూ, కుటుంబసభ్యులకు సంతాపం తెలియ చేస్తున్నానని.. నిర్మాత డా. కె.ఎల్.నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



కె.ఎల్. నారాయణ

'సైరా' షెడ్యూల్ సిద్ధం

చిరంజీవి హీరోగా ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న చిత్రం 'సైరా'. 'ఖైదీ నంబర్ 150' తరువాత చిరు సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నటిస్తోన్న సినిమా ఇది. నయనతార ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా చిరంజీవి కనిపించబోతున్నాడు. ఇప్పటికే తొలి షెడ్యూల్ షఉటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ ఫిబ్రవరిలో మొదలుకావాలి. కాని కొన్ని అనివార్య కారణాల వల్ల షూటింగ్ వాయిదా పడింది. మార్చి 5నుండి హైదరాబాద్‌లో సెకండ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. చిరంజీవితో పాటు నయనతార, అబితాబ్ బచ్చన్ ఈ షెడ్యూల్‌లో పాల్గొనబోతున్నారు. ఇళయరాజా ఈ సినిమాకు సంగీతం అందించే అవకాశం ఉంది. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీలో రూపొందుతున్న ఈ సినిమాకు పరుచూరి బ్రదర్స్ మాటలు రాస్తున్నారు.



'నందికొండ వాగుల్లోన'



'నందికొండ వాగుల్లోన' చిత్రం ఆడియో ట్రైలర్ సీడీని ఆవిష్కరిస్తున్న ఎర్రల్ల శ్రీనివాస్

బీచుపల్లి ఆంజనేయ ప్రొడక్షన్స్ పై సాయి వెంకట్ ప్రెసెంట్స్ షఫీ, లక్కీ ఎకారి సాయి కిరణ్, పూజశ్రీ, మేఘన, జ్యోతిక యాదవ్ ప్రధాన తారాగణంగా 'నందికొండ వాగుల్లోన' చిత్రం రూపొందుతోంది. సత్యనారాయణ దర్శకుడు. నిర్మాత రఘు హెచ్. లహరి మ్యూజిక్ ద్వారా ఈచిత్ర ఆడియో ట్రైలర్ ఆవిష్కరణ ఫిల్మ్ ఛాంబర్‌లో విడుదల చేసారు.. ట్రైలర్‌ను శివారెడ్డి చేయగా, ఆడియో సీడీని ఎర్రల్ల శ్రీనివాస్ విడుదల చేసారు. ఈ వేడుకలో ఎమ్ ఎల్ ఎ శ్రీనివాస్ గౌడ్, ఎర్రల్ల శ్రీనివాస్, సాయి మధుసూదన చారి, గట్టు రామచంద్ర రావు, ఆర్ కె గౌడ్, సత్యానంద్, రాధా ప్రశాంత్, హనుమంత రావు, కమెడియన్ శివారెడ్డి, రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.. దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ 'ఎ' సర్టిఫికెట్ వచ్చిన సినిమా అని అనుకోకండి ఇందులో ఎంటర్టైన్మెంట్ చాలా ఎక్కువ గా ఉంది. తప్పకుండా ప్రేక్షకులు సినిమాను చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నా అన్నారు. నిర్మాత రఘు మాట్లాడుతూ కష్టపడి పని చేసాం.. నవీన్, భాషలు ఈ సినిమా చేయడానికి ప్రోత్సహించారు.. ఇక సాయి వెంకట్, ఆర్ కె గౌడ్ ఈ సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారని అన్నారు. సమర్పకుడు సాయి వెంకట్ మాట్లాడుతూ హీరో షిరాజ్ తో ఉన్న స్నేహం కొద్దీ ఈ సినిమాను సమర్పించడం జరుగుతోంది.. అర్జున్ రెడ్డి సినిమాలో ఉన్న దానికంటే కాస్త ఎక్కువగానే టెమ్టేషన్స్ ఇందులో ఉన్నాయి. అలానే పూర్తి ఎంటర్టైన్మెంట్ గా సాగుతుంది. ముఖ్యంగా బీసీ సెంటర్ల్‌లో బాగా అడుతుందని నమ్ముతున్నాం..200 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేసేలా చిత్ర యూనిట్‌కు సపోర్ట్‌గా ఉంటామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాం అని అన్నారు. ముందు మార్చ్ 2న విడుదల చేయాలనుకున్నాం కానీ బంద్ కారణంగా పోస్ట్ పోన్డ్ చేసుకున్నాం.. మంచి డేట్ చూసుకొని విడుదల చేస్తామని తెలుపారు మరో సమర్పకుడు షిరాజ్.



నాగశౌర్య, సాయిపల్లవి

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. ఈ చిత్రం మొదటి సింగిల్ 'సంజాలి..'ను విడుదల చేశారు. 'నిను చూసి ఎన్నెలంత అలిగెల్లి పోదా ఇల్లా..' అంటూ మొదలయ్యే ఈ 'సంజాలి' పాట చక్కని సాహిత్యంతో, మధురమైన శ్యామ్ సి.ఎస్. సంగీతంతో రూపొందింది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్. జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజ కృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివశర వణన్, షియామ్ పనిచేస్తున్న సాంకేతికవర్గం. ఈ చిత్రానికి ఎగ్జి క్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.ప్రేమ్, సమర్పణ: ఎన్.వి.ఆర్. సినిమా, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: విజయ్.



అల్లరి నరేశ్ రెండు సినిమాలు

వరుస పరాజయాలతో హీరోగా వెనకబడిన అల్లరి నరేష్ తన తర్వాతి సినిమాల్ని చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటున్నారు. గతంలో తనకు 'సుడిగాడు' వంటి విజయాన్ని అందించిన భీమినేని శ్రీనివాసరావుతో ఒక సినిమా చేస్తున్న నరేష్ ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్టైన్మెంట్స్ సంస్థతో ఒక చిత్రాన్ని చేయనున్నాడు. ఈ చిత్రాన్ని 2016లో 'నందిని నర్సింగ్ హోమ్' సినిమాతో దర్శకుడిగా పరిచయమై ప్రశంసలు అందుకున్న పివి.గిరి డైరెక్ట్ చేయనున్నారు. మార్చి మొదటి వారంలో ఈ చిత్ర, యొక్క రెగ్యులర్ షూట్ మొదలుకానుంది. ఈ సినిమాలో హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే వివరాలు త్వరలోనే తెలియనున్నాయి .

'మనం' సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్



సాయికుమార్

బుల్లితెర దర్శకుడు అనిల్ కడియా దర్శకత్వంలో జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రవీణ కడియాల నిర్మాణ బాధ్యతలతో రూపొందుతున్న సరికొత్త గేమ్ షో 'మనం'. సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్.. అనేది ఉప శీర్షిక. బుల్లితెరపై సాయికుమార్ యాంకర్‌గా చేసిన 'వావ్' అనే గేమ్ షో 250 ఎపిసోడ్లు ఈ టీవీలో ప్రసారం అయింది. నంది అవార్డు కూడా గెలుచుకుంది. సాయికుమార్ కూడా ఉత్తమ వ్యాఖ్యాతగా అదే కార్యక్రమానికి బుల్లితెర నందిని అందుకోవడం విశేషం. అనిల్ కడియాల దర్శకత్వంలోనే 'వావ్' రూపొందింది. మళ్ళీ ఏడేళ్ళ తర్వాత వీరి కలయికలో 'మనం' రాబోతుంది. ఈ షో ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కామన్ పీపుల్ ఎంటర్ అవుతారు. ఈ రోజుల్లో ఒకే కుటుంబానికి చెందిన వారందరూ ఒకచోట కూర్చుని మాట్లాడుకోవడం గగనమైపోయింది. అందుకే రెండు కుటుంబాలు ఒకచోట చేరితే అది పండుగలా మారుతుందని చూపించడానికి చేసే ప్రయత్నమిదని షో నిర్మాత ప్రవీణ కడియాల తెలియజేస్తున్నారు.

సాయికుమార్ మాట్లాడుతూ... ఈనెల 27 నుండి ప్రతి మంగళవారం రాత్రి 9.30 నిముషాలకు ప్రైమ్ టైమ్‌లో ఈటీవీలో ప్రసారం కాబోతుంది. షోలో కుటుంబ అనుబంధాలు, ఆప్యాయతల గురించి మాట్లాడుకుంటూ.. ఆట పాటలతో ఎంజాయ్ చేస్తూ లక్షల విలువైన బహుమతులు గెలుచుకుంటూ అందరినీ ఎంటర్‌టైన్ చేయడమే ఈ షో ప్రత్యేకత అని చెప్పారు.

ఇద్దర్నీ ఒకటి చేసింది ఈరోజే

రెండు మనసుల్ని కలిపింది. ఇద్దరు వ్యక్తుల్ని ఒకటి చేసింది. ప్రేమకథా చిత్రమే కాదు, అందులో హీరోహీరోయిన్లను ప్రేమికులుగా మార్చిన సినిమా కూడా. సిల్వర్ స్క్రీన్ పైనే కాదు.. నాగచైతన్య, సమంతల కెరీర్‌లోనే వెరీవెరీ స్పెషల్ మూవీ 'ఏమాయ చేసావె'. 2010లో సరిగ్గా ఇదే రోజున విడుదలైన ఈ సినిమా 8 ఏళ్లు పూర్తిచేసుకుంది.గౌతమ్ మీనన్ దర్శకత్వంలో నాగచైతన్య, సమంత కాంబినేషన్‌లో వచ్చిన సినిమా ఇది. కెరీర్‌లో నాగచైతన్యకు అది రెండో సినిమా అయితే, సమంతకు అదే తొలి మూవీ. అలా వీళ్లిద్దరూ కలిసి చేసిన ఈ మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ.. 2010లో వచ్చిన బ్లాక్ బస్టర్స్‌లో ఒకటిగా నిలిచింది.

సున్నితమైన ప్రేమకథను, అంతే సున్నితమైన భావాలతో మనసుకు హత్తుకునేలా చూపించింది ఏమాయచేసావె సినిమా. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ అందించిన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్రాణంపోసింది. రెండో సినిమానే అయినప్పటికీ నాగచైతన్య యాక్టింగ్ టాలెంట్, మొదటి సినిమాకే సమంత చూపించిన నేచురల్ ఎక్స్ ప్రెషన్స్ ఈ మూవీని బ్లాక్ బస్టర్‌గా మార్చేశాయి. వీళ్లిద్దరి కెరీర్‌లో ఈ సినిమా టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమా పాటలు, సన్నివేశాలు చూస్తుంటే అంతే కొత్తగా అనిపిస్తాయి.



నాగచైతన్య, సమంత

రోగుల నడుమ వేడుక

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ('మా') అధ్యక్షుడు శివాజీ రాజా పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఉదయం 'మా' కార్యాలయంలో నిడారంబరంగా జరిగాయి. కార్యవర్గ సభ్యులు..పలువురు ఆర్టిస్టులు కేక్ కట్ చేసి శివాజీ రాజాకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 'మా' కోసం పాటుపడుతోన్న శివాజీ రాజా నిరంతర కషిని



కొనియాడారు. ఈ వేడుకల్లో సీనియర్ దర్శకులు ఎస్. వి. కష్ణారెడ్డి, శ్రీకాంత్, బెనర్జీ, జనరల్ సెక్రటరీ నరేష్, జాయింట్ సెక్రటరీ ఏడిద శ్రీరామ్, కల్చరల్ కమిటీ చైర్మన్ సురేష్ కొండేటి, కార్య వర్గ సభ్యులు సురేష్, గీతాసింగ్, వెంకట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రతీ ఏడాది శివాజీ రాజా పుట్టిన రోజు సందర్భంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు పళ్లు పంచుతుంటారు. ఈ ఏడాది కూడా యధావిధిగా పళ్లు పంచడం జరిగింది.

'ప్రేక్షకులు చూసే తీరు మారిపోయింది'

విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగ మైన నటనతో దండు పాళ్యం చిత్రం ద్వారా ఆ గ్యాంగ్‌కి క్రేజ్ వచ్చేసింది. శ్రీనివాస రాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సెన్సేషనల్ చిత్రం మరోక్కసారి తెలుగు ప్రేక్షకుల్ని థ్రిల్ చేయనుంది. ఈ చిత్రాన్ని శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియోషన్స్ వారు తెలుగులో విడుదల చేస్తున్నారు. సాయి కృష్ణ ఫిల్మ్ సమర్పణలో వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్స్‌పై శ్రీనివాస్ మీసాల, సాయి కష్ణ పెండ్యాల సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈచిత్రానికి సంబంధించిన ఆడియో ఫంక్షన్ ప్రసాద్ ల్యాబ్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' దర్శకుడు వి.ఐ.ఆనంద్, 'నేను లోకల్' దర్శకుడు త్రినాధ్, ప్రముఖ రచయిత, దర్శకుడు, నటుడు పరుచూరి వెంకటేశ్వరావు, ప్రముఖ నిర్మాత మర్యాపురం శివకుమార్ ముఖ్య అతిధులుగా హజరయ్యారు.

అంతేకాకుండా మెట్టమెదటిసారిగా ఈ చిత్రంలో నటించిన గ్యాంగ్ మెత్తం ఈ కార్యక్రమానికి హాజరవ్వటం విశేషం.

ఈ సందర్భంగా హీరోయిన్ పూజాగాంధి మాట్లాడుతూ.. నేను చాలా గ్లామర్ రోల్స్ చేశాను. కాని దర్శకుడు శ్రీనివాస రాజు చెప్పిన కథ, కథనం నచ్చి ఈ సినిమా చేశాను. కాని ఆయన వరుసగా మూడు పార్టులు తీసారు. ఇప్పుడు మా గ్యాంగ్ అందర్ని దండుపాళ్యం గ్యాంగ్ అంటున్నారు. దీనివల్ల ఇంతకుముందు చేసిన పాత్రలు మర్చిపోయారు. లక్ష్మి పాత్రకు నేను కొంచెం కష్టపడాల్సి వచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌తో నా మాటతీరు అన్ని మార్చుకోవాల్సి వచ్చింది. పార్టు 3 కూడా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నానని అన్నారు.



దండు పాళ్యం 3చిత్రం సీడీని అవిష్కరిస్తున్న పరుచూరి వెంకటేశ్వరావు

మకరంద్ పాండే మాట్లాడుతూ... ఈ చిత్రంలో నా నవ్వుని సిగ్నేచర్ స్టైల్‌గా మార్చారు. ఈ సినిమా తరువాత మమ్మల్ని ప్రేక్షకులు చూసే తీరు మారిపోయింది. క్రూరంగా ఘోరంగా చూస్తున్నారు. మీరు దండుపాళ్యం గ్యాంగ్ కదాని అడుగుతున్నారు. చాలా హ్యాపీగా వుంది. పాత్రల్ని గుర్తుపెట్టుకున్నారు అంటే అదే మా విజయం. అయితే స్క్రీన్ మీద కంటే మేమంతా ఇన్నోసెంట్ పిల్లలం. దండుపాళ్యం 3 మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.

రవికాలే మాట్లాడుతూ.. తెలుగులో చాలా చిత్రాలు చేశాను కాని ఈ చిత్రానికి వచ్చిన గుర్తింపు మరే చిత్రానికి కూడా రాలేదు. మంచి డ్రెస్‌లు వేసుకుని హుందాగా నటించినప్పుడు బాగానే చేశాడు అన్నారు. కానీ ఇందులో కనపడితే మీరు దండుపాళ్యం గ్యాంగ్ కదా అని అడుగుతున్నారని తెలిపారు.

వి.ఐ.ఆనంద్ మాట్లాడుతూ.. ఇలాంటి చిత్రాలు తీయలంటే అందరివల్ల కాదు.. దానికి ఎంతో ధైర్యం కావాలి. ఇలాంటి చిత్రాన్ని నిర్మించాలన్నా దానికి మించిన గట్స్ కావాలి. దర్శకుడు శ్రీనివాస రాజు మెదటి పార్టుతోనే తనేంటో నిరూపించుకున్నారు. ఇలాంటి సినిమా ఓపార్టు తీస్తేనే మన రసం కారిపోతుంది. అలాంటిది ఆయన మూడు పార్టులు తీసి సక్సస్‌ఫుల్‌గా దూసుకుపోతున్నాడంటే మామూలు మేటర్ కాదని అన్నారు.

పరుచూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. యేము ఇప్పటికి 365 చిత్రాలకి రాశాం. కానీ ఈ దర్శకుడు ఏ చిత్రం గురించైనా 365 రోజులు డిస్కస్ చెయ్యగలడు అంత సినిమా నాలెడ్జ్ వున్నవాడు. వరుసగా సీక్వెల్స్‌తో హిట్స్ కొడుతున్నాడు. ఇప్పుడు ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.

నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, సాయికష్ణ పెండ్యాల మాట్లాడుతూ.. మహానుభావుడు, ఆనందోబ్రహ్మ, ఒక్కక్షణం... చిత్రాల్ని పంపిణి చేశాం. ఈసారి 'దండుపాళ్యం 3'తో నిర్మాతగా ప్రవేశించాం. దర్శకుడు శ్రీనివాస రాజు కథని మెప్పించే విధానం చాలా బాగుంటాయి. ప్రేక్షకులు థ్రిల్‌గా ఫీలవుతారు. మార్చిలో విడుదల కానుందని అన్నారు



మహిళల శరీరంలో అతి ముఖ్యమైన భాగం గర్భాశయం. మహిళ గర్భం ధరించిన తర్వాత పిండం పెరిగి పెద్దయ్యేదీ గర్భసంచిలోనే. జీవి పునరుత్పత్తికి ఎంతో కీలకమైనది ఇదే. ఎంతో ప్రాధాన్యతగల గర్భాశయానికి గడ్డల నుంచి ముప్పు కలుగుతోంది. గర్భాశయంలో పెరిగే అంత హానికరం కాని కణుతులివి. వీటినే ఫైబ్రాయిడ్స్ అంటారు. ఇవి గర్భాశయ కుహరంపై ప్రభావాన్ని చూపడమే కాక దాన్ని శిథిలం చేస్తున్నాయి. ప్రపంచంలో కోట్లాది మందిని గర్భధారణకు దూరం చేయడంతో పాటు శారరీకంగా, మానసికంగా కుంగదీస్తున్నాయి. గర్భసంచిలో ఎర్పడే ఈ గడ్డలు (ఫైబ్రాయిడ్స్) ఏమిటి? వాటిని ఎలా నిర్ధారించాలి? చికిత్సలేమిటి? తదితర విశేషాలు ఈవారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!

గర్భసంచిలో గడ్డల ముప్పు

గర్భసంచిలో గడ్డలు ఎందుకు ఏర్పడతాయో ఇప్పటికీ కచ్చితంగా వైద్యశాస్త్రం స్పష్టం చేయలేకపోతోంది. కానీ దీనికి కొన్ని కారణాలను మాత్రం గుర్తించారు. కొంతవరకు జన్యుపరంగా ఇవి ఏర్పడే అవకాశముంది. ఈస్ట్రోజెన్ హార్మోను వీటిని ప్రభావితం చేస్తున్న విషయాన్ని మాత్రం పరిశోధనల్లో తెలుసుకున్నారు. ఫైబ్రాయిడ్స్ కొందరిలో వేగంగా మరికొందరిలో నెమ్మదిగా పెరుగుతున్నాయి. కొన్ని ఎప్పుడూ ఒకే పరిమాణంలో ఉండొచ్చు, కొన్ని వాటంతటవే కుంచించుకుపోవచ్చు. నెలసరి నిలిచిపోయిన తర్వాత సహజంగానే ఈస్ట్రోజెన్ ఉత్పత్తి తగ్గుతుంది కాబట్టి ఫైబ్రాయిడ్లు కూడా కొంతమందిలో చిన్నగా మారుతుంటాయి. కొన్నైతే రాళ్లలా గట్టిపడిపోతుంటాయి. ఇలా గర్భాశయ కండరాల్లో అసహజంగా ఏర్పడే సాధారణ కణుతులవల్ల పదిహేను



నుంచి ఇరవై శాతం మంది బాధపడుతున్నారు.

గర్భసంచిలో గడ్డల సమస్య పిల్లలు పుట్టే వయసులో (15-45 ఏళ్లలో) ఉన్న స్త్రీలలో ఎక్కువగా కనబడుతుంటుంది. వీటివల్ల చాలా మంది మహిళలు గర్భధారణకు దూరమవుతున్నారు. సంతానం కలిగే వయస్సులో ఈ గడ్డలు ఎక్కువగా ఏర్పడుతున్నాయి. వీటిని చాలా మంది క్యాన్సర్ కణితులేమోనని భయపడిపోతుంటారు. నిజానికి గర్భసంచిలో తలెత్తే గడ్డల్లో ఫైబ్రాయిడ్ గడ్డలే అధికం. వీటికి క్యాన్సర్‌తో సంబంధమేమీ లేదు. ఇవి క్యాన్సర్‌గా మారే అవకాశమూ లేదు

ఎక్కడ ఏర్పడతాయి?

ఈ గడ్డలు చిన్న బఠాణీ గింజంత పరిమాణం మొదలుకుని పెద్ద పుచ్చకాయంత పరిమాణం వరకూ పెరగొచ్చు. ఈ కణితులు గర్భసంచి గోడల కణాల నుంచే పుట్టుకొచ్చి, అక్కడే గడ్డల్లా ఏర్పడుతుంటాయి. ఇవి గర్భసంచి లోపల, మీద ఎక్కడైనా ఏర్పడొచ్చు. ఒకే సమయంలో ఒకటి కన్నా ఎక్కువ గడ్డలు కూడా ఉండొచ్చు. ఫైబ్రాయిడ్లు చిన్నగా ఉన్నప్పుడు పైకి ఎలాంటి లక్షణాలూ కనబడవు. అందువల్ల ఎంతోమందికి ఇవి ఉన్న సంగతే గుర్తించలేరు.

డాక్టర్లు పొత్తికడుపును పరీక్షిస్తున్నప్పుడో, గర్భం ధరించినపుడు అల్ట్రాసౌండ్ పరీక్ష చేస్తున్నప్పుడో అనుకోకుండా బయటపడుతుంటాయి.

ఎందుకొస్తాయి?

శరీరంలో అవసరమైన హార్మోన్ల విడుదల ఒక క్రమంలో జరగాలి. అయితే హార్మోన్లలో ముఖ్యమైన ఈస్ట్రోజన్ అందరిలోనూ ఒకేలా విడుదల కాదు. కొంతమందిలో ఎక్కువగా విడుదలైతే, ఇంకొందరిలో తక్కువగా విడుదలవుతుంది. ఈ హెచ్చుతగ్గుల వల్ల గర్భాశయంలో కణుతులు ఏర్పడతాయి. ఈ హార్మోన్ శరీరంలో ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ మొత్తంలో ఫైబ్రాయిడ్స్ పెరుగుతాయి. ఊబకాయం ఉన్న వారిలోనూ ఈ కణుతులు ఉంటాయి. అధిక బి.పి, మధుమేహం వ్యాధుల మాదిరిగానే ఇవి వంశపారంపర్యంగా వస్తాయి. తక్కువ వయస్సులో రజస్వల అయిన వారికి గడ్డలు త్వరగా ఏర్పడతాయి. సంతానం లేని మహిళల్లోనూ ఇవి ఎక్కువగా ఉంటాయి. ఈ కణుతులు సాధారణంగా పదహారేళ్ల నుంచి అరవై ఏళ్ల లోపు వస్తాయి. నలభై సంవత్సరాలు వచ్చినా పిల్లలు కలగని వారిలో గడ్డలు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా నలభై నుంచి అరవై ఏళ్ల వయస్సులో ఇవి ఏర్పడతాయి. కొంతమందిలో ఇవి పెరుగుతూ ఉంటే, మరికొంతమందిలో మామూలు పరిమాణంలోనే ఉంటాయి. మెనోపాజ్ (రుతుక్రమం ఆగిపోయే) దశ వచ్చే వరకు కణుతులు పెరుగుతాయి. ఈ లక్షణం కొంతమందిలో మాత్రమే కనిపిస్తుంది.

ఫైబ్రాయిడ్స్ రకాలు

గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ (కణుతులు) ముఖ్యంగా మూడు రకాలు. గర్భాశయ లోపలి పొరకు ఆనుకుని ఉండేవి సబ్ ఎండోమెట్రియల్ ఫైబ్రాయిడ్స్. కండరాల్లో ఏర్పడే వాటిని ఇంట్రామస్క్యులర్ ఫైబ్రాయిడ్స్‌గాను, కండరాలకు బయట ఉండే వాటిని ఎక్స్‌టర్నల్ ఫైబ్రాయిడ్స్‌గా వర్గీకరించారు.

వీటిలో ఎక్స్‌టర్నల్ ఫైబ్రాయిడ్స్ అంత ప్రమాదకరమైనవి కావు. మిగిలిన రెండింటి విషయంలో చాలా జాగ్రత్తగా పరిశీలించి తగిన చికిత్సని అందించాలి. ఈ కణుతులు గర్భాశయ గోడలను ఆధారంగా చేసుకుని మిల్లీమీటరు నుంచి సెంటీమీటర్ వరకు ఎదుగుతాయి.

సబ్ ఎండోమెట్రియల్ ఫైబ్రాయిడ్స్

ఈ రకం ఫైబ్రాయిడ్ల వల్ల రుతుక్రమ సమయంలో రక్తస్రావం ఎక్కువగా ఉంటుంది. గర్భధారణ ఆలస్యమవుతుంది. ఒకవేళ గర్భం ధరించినప్పటికీ మొదట్లోనే గర్భస్రావం అవుతుంది. గర్భాశయం లోపలి స్థానాన్ని ఫైబ్రాయిడ్స్ ఆక్రమించుకోవడంతో పిండం ఎదుగుదలకు అవకాశం ఉండదు. పిండానికి సరైన పోషణ అందదు. దీనివల్లే గర్భస్రావం అవుతుంది. ఒకవేళ కొంతమందికి గర్భం నిలబడినప్పటికీ దానితోపాటే కణుతులు కూడా పెరుగుతాయి.

ఇంట్రామస్క్యులర్ ఫైబ్రాయిడ్స్

ఇంట్రామస్క్యులర్ ఫైబ్రాయిడ్స్ ఉన్న వారికి రుతుక్రమ సమయంలో అధిక రక్తస్రావం కావడంతోపాటు పొత్తి కడుపు, నడుమ భాగాలవద్ద నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఈ కణితులు పెద్దగా ఉండడంతో మూత్రనాళాలు, మలద్వార కండరాలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా మూత్రపిండాల వ్యాధులే కాక మలబద్ధకం వస్తుంది.

ఎక్స్‌ట్రనల్ ఫైబ్రాయిడ్స్

ఈ గడ్డలు అంత ప్రమాకరమైనవి కాకపోయినప్పటికీ వీటి ప్రభావం గర్భాశయంపై పడుతుంది. వీటి వల్ల మూత్రపిండ వ్యాధులు, మలబద్ధకం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి.



లక్షణాలు

గర్భసంచిలో గడ్డల సమస్య లక్షణాలు బయటకు కన్పించకపోయినా అవి ఉన్నవారిలో రకరకాల రూపాలలో వ్యక్తమౌతుంటాయి.

✧ గర్భాశయంవద్ద రక్తం గడ్డ కట్టడం, మత్తుగా ఉండడం వంటి లక్షణాలుంటాయి.

✧ సంతాన లేమి సమస్య ఉంటుంది.

✧ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు, ఛాతీలో నొప్పి ఉంటుంది.

✧ రక్తహీనత, ఆయాసం, గుండెదడ వంటి సమస్యలుంటాయి.

✧ రుతుక్రమం ఎక్కువ రోజులు ఉండడంతోపాటు అధిక రక్తస్రావం ఉంటుంది.


✧ ఉదర భాగంలో నొప్పి కలుగుతుంది

✧ పొట్ట ఆకారంలో మార్పులు వస్తుంటాయి.

✧ నడుము వద్ద అధికంగా పెరుగుదల ఉంటుంది.

నిర్ధారణ


గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ మిల్లీమీటరు పరిమాణం నుంచి మొదలవుతాయి. అయిదారు కేజీల బరువు వరకు పెరుగుతాయి. చిన్నగా ఉన్నవాటి విషయంలో పెద్దగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పొట్ట భాగంపై తడిమినప్పుడు



చేతికి తగిలే పరిమాణంలో ఉంటే వాటిని వెంటనే తీయించుకోవాలి. ఉదర పరీక్షలు చేయించడం ద్వారా ఈ కణుతులను గుర్తించవచ్చు. ఎటువంటి మందులు వాడినా ఇవి తగ్గవు. రుతుక్రమ సమయంలో అధిక రక్తస్రావమైనా, పొత్తి కడుపు, నడుమ వద్ద నొప్పి తీవ్రంగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. కొత్తగా ట్రాన్స్ వెజైనల్ స్కాన్ ద్వారా గడ్డలను నిర్ధారించే పరీక్షలు చేస్తున్నారు. గర్భాశయంలో గడ్డలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎంత పరిమాణంలో ఉన్నాయి? ఒక గుత్తి మాదిరిగా ఉన్నాయా లేక ఒక్కటే ఉందా అన్న విషయాలు చాలా సులువుగా దీంతో తెలుసుకోవచ్చు. అప్పుడు తగిన చికిత్స చేయడానికి వీలవుతుంది.

గడ్డలకు చికిత్స ఇలా!

ఫైబ్రాయిడ్లు ఉన్నా బాధలేవీ లేకపోతే ఎలాంటి చికిత్స అవసరం లేదు. ఏడాదికి ఒకసారి స్కానింగు చేసి గడ్డలు ఎలా ఉన్నాయన్నది చూసుకుంటే చాలు. బాధ ఎక్కువగా ఉంటే మాత్రం చికిత్స తప్పనిసరిగా తీసుకోవాలి. గడ్డలు ఏర్పడిన చోటు, బాధల తీవ్రత, మహిళల వయసును బట్టి చికిత్స చేస్తారు. నెలసరి నిలిచిపోవటానికి తాత్కాలికంగా మందులు ఇచ్చి పరిశీలిస్తారు. ఫైబ్రాయిడ్లకు ఈస్ట్రోజెన్



హార్మోన్ ఉత్పత్తిని తగ్గించే మందులు బాగా ఉపయోగ పడతాయి. ఇవి తాత్కాలికంగా నెలసరి ఆగిపోయేలా చేస్తూ.. కణితుల సైజు తగ్గటానికి తోడ్పడతాయి. అయితే ఈ మందులతో శరీరంలో వేడిఆవిర్లు రావడం వంటి దుష్ప్రభావాలు తలెత్తొచ్చు. అందువల్ల వీటిని మూడు నుంచి ఆరునెలల కన్నా ఎక్కువకాలం వాడటం అంత మంచిది కాదు. దీర్ఘకాలం ఈ మందులు వాడితే ఎముక క్షీణత సమస్య ఏర్పడుంది. కొందరికి ప్రొజెస్టిరాన్ అనబడే హార్మోనును విడుదల చేసే ఐయూడీని లోపల అమరుస్తారు. ఇది రుతుస్రావం అధికంగా కావటాన్ని తగ్గిస్తుంది. కొందరికి గర్భనిరోధక మాత్రలు కూడా ఇస్తుంటారు. అవసరమైతే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. సంతానం కలగనివారికి కేవలం కణితులనే తొలగించి, గర్భసంచిని అలాగే ఉంచేందుకు ప్రయత్నిస్తారు. పిల్లలు పుట్టిన తర్వాత గడ్డలు ఏర్పడితే గర్భసంచిని తీసేయొచ్చేమో పరిశీలిస్తారు. ప్రస్తుతం అబ్లేషన్ ప్రక్రియతో కణితికి రక్తాన్ని సరఫరా చేసే నాళాన్ని మూసేసే పద్ధతి కూడా అందుబాటులో ఉంది. దీంతో గడ్డ క్రమేపీ చిన్నదై, మాయమవుతుంది. అసాధారణ పరిస్థితుల్లో ఈ కణుతుల నివారణకు శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. సంతానం ఉన్న మహిళల్లో కణుతులు ఉంటే గర్భాశయాన్ని తొలగించాల్సి ఉంటుంది. సంతానం కలగని వారిలో ఉంటే కణుతులను మాత్రమే తొలగిస్తే సరిపోతుంది. ఈ సమయంలో ఒక్కోసారి రక్తస్రావం ఆగదు. అటువంటప్పుడు కణుతులతోపాటు గర్భాశయాన్ని తొలగిస్తారు.

- డాక్టర్ శివాజీ ప్రధాన
ఎంబిబిఎస్, డిజిఓ
స్త్రీవైద్య నిపుణులు
ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి
సోంపేట - శ్రీకాకుళం జిల్లా.



ఫైబ్రాయిడ్స్ క్యాన్సర్ కాదు!

చాలామంది అపోహపడేటట్టు గర్భసంచిలో గడ్డలు క్యాన్సర్ గడ్డలు కావు. ఇవి అంత ప్రమాదకరమైనవి కావు.

కానీ ఇవి పరిమాణం ఎక్కువై పక్కభాగాలను నొక్కుతుంటే రకరకాల బాధలు మొదలవుతాయి. ప్రధానంగా నెలసరి సమయంలో రుతుస్రావం ఎక్కువగా, ఎక్కువరోజులు అవుతుంది. నెలసరి కూడా త్వరత్వరగా వచ్చేస్తుంది. రుతుస్రావం ఎక్కువగా కావడంవల్ల రక్తహీనత తలెత్తొచ్చు. రుతుస్రావమయ్యే సమయంలో పొత్తికడుపులో తీవ్రమైన బాధ, నొప్పి ఉండొచ్చు. ఫైబ్రాయిడ్లు మరీ పెద్దవైతే గర్భాశయం గుంజినట్టయ్యి.. నడుంనొప్పి, పొత్తికడుపులో రాయిపెట్టినట్టు బరువుగా ఉంటుంది. కణితులు ఫలోపియన్ ట్యూబులను నొక్కితే సంతానం కలగడంలో ఇబ్బంది తలెత్తొచ్చు. కొందరిలో గర్భం నిలవడం కష్టమౌతుంది. గడ్డలు మూత్రకోశానికి అడ్డువస్తే మూత్ర సమస్యలు, పురీషనాళానికి అడ్డొస్తే మలబద్ధకం వంటి సమస్యలు తప్పవు. అందువల్ల గడ్డలను తనికీ చేయించుకుని, అవసరమైతే వెంటనే చికిత్స చేయించుకోవడం చాలా అవసరం.



చిన్నారి



పొడుపు కథ

దీన్ని కోస్తే చాలు
తెప్పించే కన్నీళ్లు
ఉంటుంది పొరలు పొరలు
దీన్ని తింటే ఎంతో మేలు?

జవాబు : ఉల్లి

జోక్ :

టీచర్ : రాముా! పాండవులను పంచపాండవులని ఎందుకు పిలుస్తారు?
రాము : వాళ్లు పంచలు కట్టుకుంటారు కనుక.. సార్..

చుక్కలు కలపండి!

పిల్లలూ..! పక్కనున్న బొమ్మలో చుక్కల్ని కలిపి రంగులు దిద్దండి!



చెమటతో లాభమా? నష్టమా?



పిల్లలూ..! మీకు తెలుసా? సగటు మానవుని శరీరం నిత్యం ఆక్సీకరణ పద్ధతి ద్వారా 2500 కాలరీల ఉష్ణశక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఈ శక్తితో 25 లీటర్ల నీటిని '0' సెం.గ్రే. వద్ద వేడి చెయ్యవచ్చు. మన శరీరంలోని పిండి పదార్థములు ఆహారమనే కొలిమిలో ఉష్ణోగ్రత పెరగకుండా ఉంచటానికి జరిగే ప్రయత్నాలలో ఒకటి చెమట పట్టటం. నిజానికి శరీర ఉష్ణోగ్రత మెదడులోని ఉష్ణోగ్రతాకేంద్రంచేత అదుపు చేయబడుతుంది. ఈ కేంద్రంలో మూడు భాగాలు ఉంటాయి. అదుపుకేంద్రం, ఉష్ణకేంద్రం, శీతలకేంద్రం. రక్తంలో వేడి ఏదేనీ కారణంవల్ల తగ్గిపోయినట్లయితే ఉష్ణకేంద్రం వెంటనే పని చేయడం ప్రారంభిస్తుంది. సరిగ్గా ఇదే సమయంలో కొన్ని ప్రత్యేక గ్రంథులు మండే రసాయన పదార్థాలను ఉత్పత్తి చేస్తాయి. వీటిద్వారా కండరాలు, కాలేయము శరీరంలోని ఉష్ణోగ్రతను పెంచి సామాన్య స్థితికి తీసుకువస్తాయి.



ఇదేవిధంగా శరీర ఉష్ణోగ్రత కొన్ని కారణాల వల్ల పెరిగినప్పుడు శీతల కేంద్రము పని చేయనారంభిస్తుంది. దాంతో ఆక్సీకరణ పద్ధతి మందగిస్తుంది. స్వేదగ్రంథులు చెమటను బయటకు వదులుతాయి. అప్పుడు శరీరంలోని నీరు, యూరియా, కొన్ని లవణాలు చెమట రూపంలో బయటకు వస్తాయి. శరీరంలోని ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మాత్రమే స్వేదగ్రంథులు వేగంగా పనిచేస్తాయి. బయటకు వచ్చిన చెమట శరీరపు వేడికి ఆవిరై శరీరానికి చల్లదనాన్నిస్తుంది. వేసవి కాలంలో కూజానీళ్ళు ఈ పద్ధతిలోనే చల్లబడతాయి. ఆవిరి అవడం చేత చల్లదనం కలుగుతుంది. అందుచేత శరీర ఉష్ణోగ్రతను అదుపు చెయ్యటంలో చెమట బాగా పని చేస్తుంది. అంతేకాదు, శరీరంలోని అంతర్భాగాలను శుద్ధి చేస్తుంది. శరీరానికి హానికలిగించే అనేక విషపదార్థాలు చర్మంలో ఉండే అనేక లక్షల రంధ్రాలు చెమట రూపంలో బయటకు పంపుతాయి.



వాతావరణంలో తేమ ఉన్నప్పుడు చెమట త్వరగా ఆవిరికాదు. అందుచేత చికాకు కలుగుతుంది. ఫ్యాను కింద కూర్చున్నప్పుడు ఆహ్లాదంగా ఉంటుంది. ఫ్యాను గాలి చెమటను త్వరగా ఆవిరిగా మార్చటమే ఇందుకు కారణం. ★

నేను గీసిన చిత్రం





పి.మహాలక్ష్మి
8వ తరగతి
అరవింద హైస్కూల్

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



రోహిత్‌కు పరీక్ష?

టీ20 ట్రై సిరీస్ సారథిగా ఎంపిక

రోహిత్ శర్మ... క్రికెట్ ప్రేమికులకు అతని పరిచయంగానీ... అతను చేసిన ద్వి శతకాల గురించిగానీ విడిగా చెప్పనవసరం లేదు... ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల ప్రతిభాశాలి. ఎంత విధ్వంస ఇన్నింగ్స్ ఆడతాడో... అంతే పేలవంగానూ అవుటవుతాడు... మార్చి 6 నుండి కొలంబోలోని శ్రీలంక-బంగ్లాదేశ్‌లతో ప్రారంభమైన ట్రై సిరీస్‌కు సారథిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

సఫారీ పర్యటనలో వన్డేల్లో, టీ20ల్లో ఘోరంగా విఫలమైన రోహిత్ శర్మకు టీమిండియా పగ్గాలు అప్పగించారు. మూడో టీ20లో కోహ్లీ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో జట్టు పగ్గాలు మనోడికే అప్పగించారు. సఫారీ పర్యటనలో మూడు టీ20ల్లో 21, 0, 11... వన్డేల్లో సైతం 20, 15, 0, 5, 115, 15 పరుగులు మాత్రమే చేశాడు... రోహిత్ ఆరు వన్డేల్లో కేవలం 200 లోపు పరుగులు మాత్రమే చేశాడు.. మూడు టీ20ల్లో 32 పరుగులు మాత్రమే చేశాడు. 25 ఏళ్ళల్లో టీమిండియా సాధించలేని సిరీస్ విజయాలను కోహ్లీ సారథ్యంలో సాధించి విజయానందంతో తిరుగు ప్రయాణమైంది మనజట్టు. రెండు నెలల దక్షిణాఫ్రికా పర్యటనలో ఆ దేశ జట్టును చిత్తు చేసిన టీం ఇండియా వన్డే సిరీస్‌ను(5-1), టీ20 సిరీస్‌ను (2-1)తో కైవసం చేసుకొని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. టీమిండియా అన్ని విభాగాల్లో అద్భుతంగా రాణించి... సఫారీలను చిత్తు చేసి చిరస్మరణీయ విజయాలు సాధించిన భారత జట్టును నిజంగా అభినందించాల్సిందే. దీంతో టీమిండియా జట్టు మార్చి 6వ తేదీనుండి భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య ట్రై సిరీస్ ప్రారంభం కానుంది. టీమిండియాకు రోహిత్ శర్మ సారథిగా వ్యవహరించనున్నాడు. కోహ్లీ సారథిగా తొలిసారి సఫారీ పర్యటనకు బయలుదేరిన టీమిండియా అద్భుతంగా రాణించి రెండు సిరీస్ విజయాలను సాధించింది. దీంతో లంకతో సిరీస్‌కు కోహ్లీ, ధోనీలకు విశ్రాంతి కల్పించింది బీసీసీఐ. కోహ్లీ టీ20ల్లో రాణించలేకపోయినా వన్డేల్లో అద్భుతంగా రాణించి మూడు సెంచరీలను సాధించి సారథిగా నిరూపించుకున్నాడు. రోహిత్ అటు వన్డేల్లో... ఇటు టీ20ల్లో రెండింటిలోనూ పూర్తిగా విఫలమయ్యాడు. దీంతో రాబోయే సిరీస్‌కు సారథిగా వ్యవహరించే శర్మ ఏమేరకు రాణించనున్నాడో ఎదురు చూడాల్సి ఉంది. సారథిగా కోహ్లీ వన్డేల్లో రాణించిన విధంగా రోహిత్ శర్మ కెప్టెన్‌గా మంచి విజయాలను నమోదు చేసుకోవాలని ఆశిద్దాం...

బంగ్లాదేశ్ సారథిగా షకీబ్-అల్-హసన్

ట్రై సిరీస్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టుకు సారథిగా షకీబ్-అల్-హసన్ ఎంపికయ్యాడు. బంగ్లాదేశ్ క్రికెట్‌బోర్డు సోమవారం టీ20 ట్రై సిరీస్ నదహాస్ ట్రోఫీలో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును ప్రకటించింది. ఇటీవల వేలిగాయం కారణంగా జట్టుకు దూరమైన షకీబ్ తిరిగి జట్టులోకి తిరిగి చేరడంతోపాటు సారథిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్ మాట్లాడుతూ రాబోయే ప్రపంచకప్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును పటిష్టపరిచే ఉద్దేశ్యంతో జట్టులోకి యువకులకు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు.

ట్రై సిరీస్ షెడ్యూల్...

మార్చి 6 : భారత్ x శ్రీలంక
మార్చి 8 : భారత్ x బంగ్లాదేశ్
మార్చి 10 : శ్రీలంక x బంగ్లాదేశ్
మార్చి 12 : భారత్ x శ్రీలంక
మార్చి 14 : భారత్ x బంగ్లాదేశ్
మార్చి 16 : శ్రీలంక x బంగ్లాదేశ్
మార్చి 18 : ఫైనల్
(మ్యాచ్‌లన్నీ కొలంబో మైదానంలో... భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభమౌతాయి)

ఆసియాగేమ్స్‌లో పతకం సాధిస్తా!

గాయంతో కామన్వెల్త్ గేమ్స్‌కు దీపా కర్మాకర్ దూరం




న్యూఢిల్లీ : భారత నెంబర్‌వన్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ రాబోయే కామన్వెల్త్ పోటీలకు దూరమైంది. మోకాలి గాయంనుండి ఇంకా పూర్తిగా కోలుకోని కారణంగా తాను ఈ పోటీలలో పాల్గొన లేకపోతున్నట్లు సోమవారం వెల్లడించింది. ఈ పోటీలకు దూరం కావడం తనను తీవ్రంగా బాధించిందని... కానీ ఆసియా గేమ్స్‌లో తప్పక పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది. కామన్వెల్త్ పోటీలు ఏప్రిల్ 4 నుండి 15వ తేదీల మధ్య ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో ఈ జరగనున్నాయి. తాను ఈ పోటీలకు గాయం కారణంగా పాల్గొనకపోవడం తనను బాధించిందని... దీనికి భారతీయ ప్రజలందరూ క్షమించాలని కోరారు.

అంతేగాక ఈ సంవత్సరాంతంలో జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొని తప్పక పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది. 2014 స్కాట్లాండ్ రాజధాని గ్లాస్కోలో జరిగిన పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. తాను పూర్తిగా కోలుకున్న అనంతరం ప్రాక్టీస్ మొదలు పెట్టనున్నట్లు ఈ సందర్భంగా తెలియజేస్తూ... కామన్వెల్త్ పోటీలలో పాల్గొనే క్రీడాకారుల జాబితానుండి తన పేరును తొలగించి పంపించాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు. 24 ఏళ్ల కర్మాకర్ ఏడాదికాలంగా మోకాలి గాయంతో బాధపడుతోంది.

గత ఏడాది ఏప్రిల్‌లో యాంటీరియల్ క్రూసియేట్ లీగ్‌మెంట్ (ఎసిఎల్) శస్త్ర చికిత్స చేయించుకుంది. 2016లో భారతదేశం తరపున రియో ఒలింపిక్స్‌లో పాల్గొని ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి తృటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది. మహిళా జిమ్నాస్టిక్స్ విభాగంలో భారతదేశం తరపున పాల్గొన్న తొలి అథ్లెట్ దీప కర్మాకర్ కావడం విశేషం. త్రిపురకు చెందిన దీప గాయం కారణంగా పూర్తిగా కోలుకున్న తర్వాతే ఈ పోటీలలో పాల్గొని పతకం సాధిస్తానన్న ధీమా వ్యక్తం చేసింది. ఆసియాగేమ్స్‌లో పాల్గొనేముందు జిమ్నాస్టిక్స్ విభాగంలో నాలుగు విభాగాల్లో ప్రాక్టీస్ మొదలుపెట్టనున్నట్లు తెలియజేసింది. వాల్ట్, అసమాన బార్స్, బ్యాలెన్సింగ్ బీమ్, ఫ్లోర్ విభాగాల్లో ప్రాక్టీస్ మొదలుపెట్టి పతకం సాధించడానికి కృషిచేస్తానన్నారు.

2016లో రియోలో జరిగిన ఒలింపిక్స్ భారతదేశం తరపున (ప్రొడునోవా) విభాగంలో పాల్గొని తృటిలో పతకం కోల్పోయిన విషయం తెలిసిందే. మరో యువ అథ్లెట్ అరుణ బుద్ధా రెడ్డి కూడా ఇటీవల ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిన విషయం తెలిసిందే.

అంతర్జాతీయ క్రికెట్‌కు మోర్కెల్ గుడ్‌బై?



జోహాన్స్‌బర్గ్ : దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ మోర్నీ మోర్కెల్ రాజీనామాను ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో జరిగే టెస్ట్ సిరీస్ అనంతరం తాను క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు సోమ వారం తెలిపాడు. 33 ఏళ్ల మోర్కెల్ సఫారీ జట్టు తరపున ఇప్పటివరకు 83 టెస్టులు, 117 వన్డేలు, 44 టీ-20లు ఆడాడు. ఈ విషయంపై మోర్కెల్ మాట్లాడుతూ.. "ఇది చాలా కఠినమైన నిర్ణయం. అదే సమయంలో ఇది ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభించేందుకు సరైన సమయం. ఈ అంతర్జాతీయ షెడ్యూల్ వల్ల నాపై చాలా ఒత్తిడి పెరుగుతోంది. దీంతో నా కుటుంబంతో సమయం గడపలేకపోతున్నా. క్రికెట్ సౌతాఫ్రికా, నా కుటుంబం, మిత్రులు ఇన్నాళ్లుగా నాకు చాలా అండగా నిలి చాడు. నాలో ఇంకా చాలా క్రికెట్ మిగిలుందని భావిస్తున్నా. నా శక్తిని, ప్రతిభని రానున్న ఆస్ట్రేలియా సిరీస్‌లో ఉపయోగించి.. జట్టు విజయానికి తోడ్పడతానని నేను అనుకుంటున్నా" అని మోర్కెల్ తెలిపాడు.

నికోల్సన్ హఠాన్మరణం



ముంబయి : క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అధ్యక్షుడు కేకో నికోల్సన్(63) మృతి చెందాడు. సోమవారం ఉదయం ముంబయి లోని గ్లోబల్ ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. నికోల్సన్ స్నూకర్, బ్రిలియర్డ్స్‌ల అభివృద్ధికి విశేష కృషిచేసిన వారిలో ప్రప్రథముడు. క్రికెట్‌తోపాటు, స్నూకర్, బిలియర్డ్స్‌ను ఒక వేదికపైకి నిలపడానికి కొన్నిసార్లు బీసీసీఐ సమావేశాలకు సైతం హాజరై తన వాణి వినిపించేవారు. డిసెంబర్‌లో బ్రిలియర్డ్‌సంఘం తరపున బ్యాడ్మింటన్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌కు గౌరవ లైఫ్‌టైమ్ సభ్యత్వాన్ని ఇచ్చిన తర్వాత కేకో సిసిఐ బృందంతో కలిసి ఆస్ట్రేలియా-ఇంగ్లండ్‌ల యాషెస్ సిరీస్‌కు హాజరయ్యారు.

పంజాబ్ సారథిగా అశ్విన్



న్యూఢిల్లీ : భారతజట్టు ఆఫ్‌స్పిన్నర్, చెన్నై సూపర్‌కింగ్స్ మాజీ క్రీడాకారుడు రవిచంద్రన్ అశ్విన్‌కు పంజాబ్ జట్టు పగ్గాలు అప్పగించింది. ఏప్రిల్ 4 నుంచి ప్రారంభంకానున్న ఐపీఎల్ 11వ సీజన్ కోసం కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు కెప్టెన్‌గా అశ్విన్‌ని నియమిస్తున్నట్లు జట్టు యాజమాన్యం సోమవారం ప్రకటించింది. గత సీజన్‌లలో అశ్విన్ చెన్నై సూపర్ కింగ్స్, పుణె సూపర్ జెయింట్స్ జట్టు తరపున ఆడాడు. అయితే ఈ ఏడాది జరిగిన వేలంలో చెన్నై జట్టు అశ్విన్‌ని తమ జట్టులోకి తీసుకోవడంలో ఆసక్తి చూపలేదు. దీంతో పంజాబ్ జట్టు అశ్విన్‌ను రూ.7.6 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. అంతేకాక జట్టు మెంటర్ వీరేంద్ర సెహ్వాగ్ సలహా మేరకు అతనికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. గతంలో పంజాబ్ జట్టుకు గ్లెన్ మ్యాక్స్‌వెల్, మురళీ విజయ్, డేవిడ్ మిల్లర్, జార్జ్ బెయిలీ, డేవిడ్ హస్సీ, అడమ్ గిల్‌క్రిస్ట్, జయవర్ధనే, కుమార సంగక్కార, యువరాజ్ సింగ్‌లు సారథులుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

అట్టహాసంగా ఆలిండియా ఐఎమ్‌డి క్రీడా పోటీలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖపట్నం పోర్టు స్టేడియంలో సోమ వారం ఆలిండియా ఐఎమ్‌డి (ఇండియన్ మెట్రాలజీ డిపార్టుమెంట్) క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని తుపాను హెచ్చరికల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకూ జరగనున్న ఈ పోటీల్లో డిజిఎం న్యూఢిల్లీ, పుణే, ఆర్‌సి న్యూఢిల్లీ, ఆర్‌సి ముంబయి, ఆర్‌సి కోల్‌కత్తా, ఆర్‌సి గౌహతి, ఆర్‌సి నాగ్‌పూర్, పిఎఎ ఐఎండి, ఆర్‌సి చెన్నై, రీజనల్ ఐఎమ్‌డి సెంట్రల్ నుంచి వచ్చిన సుమారు 500 మంది క్రీడాకారులు ఇక్కడ తలబడనున్నారు. వాలీబాల్, షూటింగ్ బాల్, క్రికెట్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్ టెన్నీస్ వంటి క్రీడల్లో వీరంతా పోటీపడతారు. ఈ పోటీలను ఆంధ్రాయూని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2014 హుదూద్ తుపాను సమయంలో ఐఎమ్‌డి సిబ్బంది అందించిన సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మెట్రాలజీ ఎస్‌బి తంపి, విశాఖ సైక్లోన్ వార్నింగ్ కేంద్రం డైరెక్టర్ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టెట్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



మృతి చెందిన విద్యార్థిని సులోచన

టెట్‌లో క్వాలిఫై కాలేనేమోనని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కర్నూలు జిల్లా ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉలిందకొండ ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన పెద్దయ్య, సుంకులమ్మకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. చివరి కుమార్తె వై.సులోచన (25) టిటిసి పూర్తి చేసి రెండు సంవత్సరాలుగా టెట్ పరీక్షకు శిక్షణ తీసుకుంది. ఈ నెల 23న నెల్లూరు జిల్లా కావలిలో టెట్ పరీక్ష రాసి 24న బస్తిపాడుకు చేరుకుంది. అదే రోజు తన సోదరునితో తాను టెట్‌లో క్వాలిఫై కాలేనేమోనని, క్వాలిఫై కాకపోతే బతకలేనని, చనిపోవాలనుకుంటున్నానని చెప్పింది. రాత్రి కుటుంబ సభ్యులకు తెలియకుండా గుర్తు తెలియని విషగుళికలు మింగింది. ఆదివారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న సులోచనను కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అదేరోజు సాయంత్రం మృతి చెందింది. మృతురాలి సోదరుడు వై.తిమ్మప్ప సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉగాది పురస్కారాలకు ఆహ్వానం

సృజనాత్మక సమితి సిఇఒ విజయభాస్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'విళంబి' నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు, కవులకు అందించే ఉగాది పురస్కారాలు, కళారత్న (హంస) పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సిఇఒ డి విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానంలో హంస పురస్కారాలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, వైద్యం, ఇంద్రజాలం, మూకాభినయం, హరికథ, బుర్రకథ, జర్నలిజం, సామాజిక సేవతో పాటు కమిటీ సిఫార్సు చేసిన ఇతర సేవా రంగాలకు ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో పద్మ అవార్డులు, సంగీత, నాటక, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు, కేంద్ర ప్రభుత్వ అవార్డులు పొందిన వారిని ఈ అవార్డులకు పరిశీలించే విషయంలో ఎంపిక సంఘం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మార్చి 7లోపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జివిఆర్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల బిల్డింగ్, దుర్గాపురం, విజయవాడ-520003 అడస్సుకు బయో డేటాను పంపాలని పేర్కొన్నారు. apdirectorculture@gmail.com మెయిల్ కు కూడా పంపవచ్చని, అభ్యర్థుల తరపున ఇతరులు కూడా ప్రతిపాదనలను పంపవచ్చని తెలిపారు.

పిసిసి కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు హామీలిచ్చి నెరవేర్చని టిడిపి, బిజెపిలను రద్దు చేయాలని ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అమలు చేయాలని కోరుతూ పిసిసి ఆధ్వర్యంలో విజయవాడలో కాగడాల ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. ఆంధ్రరత్న భవన్ నుంచి లెనిన్ సెంటర్ వరకు జరిగిన ఈ ర్యాలీలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నాలుగు సంవత్సరాలగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. హోదా అవసరం లేదని టిడిపి అంటోందని, వారిని బిజెపి ప్రోత్సహిస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఆ రెండు పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. ఎపికి ప్రత్యేక హోదా కోసం పోరాడేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రదర్శనలో కొలనుకొండ శివాజి, మీసాల రాజేశ్వరరావు, సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న బాబు

వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తానన్న జగన్

ప్రజాశక్తి-పొదిలి



మాట్లాడుతున్న వైఎస్ జగన్

చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ప్రజలను మోసం చేస్తూ అవినీతి, అక్రమాలతో అన్యాయమైన పాలన సాగిస్తున్నారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తూర్పారపట్టారు. సోమవారం ప్రజాసంకల్ప యాత్ర 98వ రోజు మార్కాపురం నియోజకవర్గంలోని కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో సాగింది. పొదిలి పట్టణంలోని చిన్న బస్టాండ్ సెంటర్‌లో సాయంత్రం ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాజకీయాలలో వ్యక్తిత్వం, విశ్వసనీయత, కమిట్‌మెంట్, సిన్సియారిటీ కోల్పోయిన వ్యక్తి ఎలా ఉంటాడో అందుకు చంద్రబాబు ఉదాహరణ అన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టేందుకు రాష్ట్రానికి చెందిన 25 మంది పార్లమెంటు సభ్యులు కలిసి రావాలంటే చంద్రబాబు మాటమార్చుతున్నారని విమర్శించారు. 2015లో ఐదులక్షల కోట్లు, 2016లో 10లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు వస్తున్నాయని చెబుతున్న చంద్రబాబు నేడు జరుగుతున్న సదస్సులో కూడా 4.39లక్షల వేల కోట్లు వస్తున్నాయనడం హాస్యాస్పందంగా ఉందన్నారు. వాస్తవాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో పర్యావరణ ఇతర అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నవారు తక్కువేనన్నారు. జిఎస్‌టి రాకతో రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగిందంటూ చంద్రబాబు చెప్పే మాటలు మరో మొసలి కన్నీరు తలపిస్తున్నాయన్నారు. జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శంఖుస్థాపన చేసిన వెలుగొండ ప్రాజెక్టును తాను పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు.

భూమి ఇవ్వని రైతులపై ప్రభుత్వ కక్ష సాధింపు

వైసిపి అధికార ప్రతినిధి కె.పార్థసారథి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాజధాని నిర్మాణం కోసం భూమి ఇవ్వని రైతులపై ప్రభుత్వం కక్ష సాధింపులకు చర్యలకు పాల్పడుతోందని వైసిపి విమర్శించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాడులకు తెగబడుతోందని ధ్వజమెత్తింది. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి కె.పార్థసారథి మీడియాతో మాట్లాడారు. రాంప్రసాద్ అనే రైతుకు సంబంధించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేసిన కోర్టు ఉత్తర్వులను అధికారులు ఉల్లంఘించారన్నారు. నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లిన రాంప్రసాద్‌ను బట్టలూడదీసి మరీ అధికారులు, పోలీసులు దాడి చేశారన్నారు. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు మంత్రుల అండతో హింసకు దిగుతున్నారని మండిపడ్డారు. అన్యాయంగా రైతుపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమ్మిట్లతో ఒరిగేదేమీ లేదు..

సిఐఐ సమ్మిట్ల ద్వారా ప్రచార ఆర్భాటం తప్ప, రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని పార్థసారథి విమర్శించారు. గతంలో జరిగిన సిఐఐ సదస్సుల వల్ల రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయో, ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మార్చి 1న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి..

ప్రత్యేక హోదా సాధనలో భాగంగా మార్చి 1న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. హోదాతోనే రాష్ట్ర భవిష్యత్, యువత భవిత ఆధారపడి ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా పార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే ప్రజా సంఘాలు, కమ్యునిస్టు పార్టీలు సంఘీభావం తెలిపాయన్నారు. హోదా కోసం పోరాడే ప్రతి ఒక్కరితో కలిసి పని చేస్తామని తెలిపారు.

టి-ఎంసెట్ షెడ్యూల్ విడుదల



ఏప్రిల్ 4 వరకు అర్జీల స్వీకరణ
మే 2 నుంచి 7 వరకు పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ షెడ్యూల్ విడుదలైంది. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి ఈ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. మార్చి 4 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల్లో తప్పులను సరిదిద్దుకునేందుకు ఏప్రిల్ 6 నుంచి 9 వరకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 20 నుంచి మే1వ తేదీ వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2-7వ తేదీ వరకు ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తుండగా, 2,3 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు పరీక్ష నిర్వహించనున్నారు. మే 5,6,7 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగానికి పరీక్ష నిర్వహించనున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 25 వేల మంది చొప్పున ప్రతి రోజు రెండు పూటలా పరీక్ష నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటిలాగే నాలుగు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతితో పాటు కర్నూలులో పరీక్షా కేంద్రాలు ఉంటాయి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఇ-మెయిల్ అడ్రస్ ఇవ్వాల్సి ఉంది. పరీక్ష మూల్యాంకనం అనంతరం జవాబు పత్రాలు, కీ ని నేరుగా విద్యార్థి మెయిల్ ఐడిలకే పంపించే ఏర్పాటు చేశారు. విద్యార్థి దరఖాస్తు చేసుకున్న తరువాత పిడిఎఫ్ కాపీని మెయిల్ ఐడికే పంపించనున్నారు.

భారీగా పెరిగిన ఫీజులు

జిఎస్టీ భారం, ఆన్‌లైన్ పరీక్షల నేపథ్యంలో ఎంసెట్ దరఖాస్తు ఫీజు భారీగా పెరిగింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.400, జనరల్ కేటగిరి విద్యార్థులకు రూ.800 ఫీజుగా నిర్ణయించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ రెండు విభాగాలకు హాజరయ్యే వారిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800, జనరల్ విద్యార్థులకు రూ.1600 ఫీజుగా నిర్ణయించారు. గతేడాదిఏడాది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, జనరల్ విద్యార్థు లకు రూ.500 ఫీజు ఉండేది. రాష్ట్ర విభజన చట్ట ప్రకారం ఉమ్మడి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. ఏపీ విద్యార్థులకు 15 శాతం ఓపెన్ కోటాలో అడ్మిషన్లు ఉంటాయి.

రాష్ట్రాభివృద్ధికి సహకరించని కేంద్రం

ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న

ప్రజాశక్తి - నందిగామ(కృష్ణా)

రాజకీయాల్లో ప్రధాని మోడీ కంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీనియర్ అని, రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించటం లేదని ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి సిఎం చంద్రబాబు చేసిన కృషి మరవలేనిదన్నారు. జగన్ ప్రతి శుక్రవారమూ అవినీతి కేసులపై కోర్టుకు వెళ్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అవినీతి ఆరోపణలు చేయటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వై.పద్మావతి, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండూరు వెంకట రమణ, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఆర్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68